

రామప్ప శిల్పకళా సౌందర్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా ప్రదర్శించిన నృత్యరూపకం ఆకట్టుకుంది. రవీంద్రభారతి ప్రధాన మందిరంలో గురువారం కూచిపూడి, పేరిణి సంప్రదాయాల్లో నిర్వహించిన 'ప్రైడ్ ఆఫ్ రామప్ప' నృత్య ప్రదర్శన ఆద్యంతం అలనాటి వైభవాన్ని కళ్లకు కట్టింది.

- న్యూస్‌టుడే, రవీంద్రభారతి

సౌర విద్యుత్తు బాటలో..

సర్కారీ భవనాలు



ఈనాడు, హైదరాబాద్: నగరంలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, జాతీయ పరిశోధన కేంద్రాలు సౌర విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు వేగంగా అడుగులు వేస్తున్నాయి. సంస్థలకు కావాల్సిన విద్యుత్తులో గరిష్ఠంగా సోలార్‌ను వినియోగించుకుంటున్నాయి. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద కార్యాలయాలు, ఇళ్లపై సౌర పలకలతో కాలుష్య రహిత విద్యుదుత్పత్తికి ప్రాధాన్యమిస్తున్నాయి.


జీఎస్ఐలో 150 కిలోవాట్ల సౌర ప్లాంట్లు

బండ్లగూడలోని జియోలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) శిక్షణ కేంద్రంలో 300 వరకు సౌర పలకలు ఏర్పాటుచేశారు. 150 కిలోవాట్ల సామర్థ్యమున్న సౌర ప్లాంట్లు బిగించారు. మింట్ కాంపౌండ్‌లో ఐదంతస్తుల టీఎస్ రెడ్కో భవనం నిర్మాణంలో ఉంది. వంద శాతం కరెంటును సౌర, పవన విద్యుత్తు వంటి పునరుద్ధరణీయ ఇంధన వనరులతో మాత్రమే వాడతారు. ఈ భవనంలోనే టీజీఎస్పీడీసీఎల్ మెట్రో జోన్ కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. కొత్త భవనంలో పూర్తిగా నెట్ జీరో అనేది ఇదే మొదటిసారి.

బడ్జెట్‌లో ఘనం.. ఇచ్చింది తృణం

- కేటాయించిన దాంట్లో ఇప్పటివరకు పదో వంతే విడుదల
- నిధులు లేక బల్దియాలో నిలిచిన అభివృద్ధి పనులు

ఈనాడు-సిటీ బ్యూరో
ప్రధాన ప్రతినిధి



రాష్ట్ర బడ్జెట్‌లో బల్దియాకు రూ.3,200 కోట్లు కేటాయించినా.. ఆ నిధులను విడుదల చేసేందుకు ఆర్థిక శాఖ ముందుకురావడం లేదు. ప్రభుత్వం కేటాయించిన మొత్తంలో ఇప్పటివరకు కేవలం పదోవంతు మాత్రమే విడుదలయ్యాయి. తీవ్ర ఆర్థిక సంక్షోభంతో జీహెచ్ఎంసీలో అభివృద్ధి ఎక్కడకక్కడే ఆగిపోయింది. పన్నుల రూపంలో వస్తున్న ఆదాయం ఉద్యోగుల జీతాలు, వివిధ రకాల నిర్వహణ పనులకే సరిపోతుండడంతో.. రోడ్లు, నాలాలు ఇతరత్రా పనులు చేపట్టడానికి వీలుపడటం లేదు. దీనిపై క్షేత్రస్థాయిలో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. అత్యవసరంగా రూ.వెయ్యి కోట్ల నిధులను ఆర్థిక శాఖ విడుదల చేయాలని బల్దియా అధికారులు కోరుతున్నారు.

పనులు నిలిపేసిన గుత్తేదారులు..

గత ప్రభుత్వ హయాంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టినా నిధులు మాత్రం పూర్తిగా విడుదల చేయలేదు. దీంతో బల్దియాలోని అన్ని విభాగాల్లో పనులు చేసిన గుత్తేదారులకు పెద్దఎత్తున బకాయి పడింది. రూ.1500 కోట్లు రోడ్ల నిర్మాణాలు చేపట్టిన గుత్తేదారులకే ఇవ్వాల్సి ఉంది. బకాయిలు ఇవ్వకపోవడంతో ఏడాదిగా పనులు నిలిపివేశారు. వివిధ పనులకు పలుమార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రావడం లేదు. మరోవైపు రూ.2500 కోట్లు రెండు పడక గదుల ఇళ్ల గుత్తేదారులకు ఇవ్వాల్సి ఉంది. దీంతో 35 వేల ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఆగిపోయాయి. ఈ ఇళ్లను మూసీ నిర్వాసితులకు కేటాయించాలని అనుకున్నారు. అసంపూర్తిగా ఉండడంతో కేటాయించలేని పరిస్థితి. నిర్వాసితుల కోసం రెండు పడక గదుల ఇళ్లను సిద్ధం చేయడానికి రూ.1000 కోట్లు కేటాయించాలని పురపాలక శాఖ ప్రభుత్వానికి నివేదించింది.

ఏ మూలకూ చాలక..

బల్దియాలో దాదాపు పనులన్నీ నిలిచిపోవడంతో పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ చొరవ తీసుకుని హెచ్ఎండీఏతోపాటు ఇతర విభాగాల్లో ఉన్న నిధుల్లో దశల వారీగా రూ.300 కోట్లు విడుదల చేయించారు. ఈ మొత్తం నిధులు దేనికీ సరిపోవడం లేదని గ్రేటర్ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ఎస్సార్డీపీ కింద చేపట్టిన వంతెనల పనులను గుత్తేదారులు ఆపేశారు. కాలనీ రోడ్ల నిర్మాణాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల హెచ్ఎండీఏ విడుదల చేసిన రూ.150 కోట్ల నిధుల్లో ఒక్కో జోన్‌కు రూ.20 కోట్ల చొప్పున ఆరు జోన్లకు రూ.120 కోట్లు కేటాయించారు. కానీ ఆ నిధులతో పూర్తిస్థాయిలో పనులు ప్రారంభించ లేని పరిస్థితి. ఒక్కో జోన్‌కు రూ.300 కోట్లను విడుదల చేస్తే అన్ని పనులు మొదలుపెట్టడానికి అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

ప్రీకాస్ట్ దిమ్మెలతో

వరద నిల్వ ట్యాంకులు

ఈనాడు, హైదరాబాద్: వరద నీటిని ఒడిసి పట్టే భూగర్భ జలాశయాల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు జీహెచ్ఎంసీ కొత్త పద్ధతిపై దృష్టిపెట్టింది. ప్రీకాస్ట్ పద్ధతిలో వేర్వేరు సామర్థ్యాలు కలిగిన ట్యాంకులను నిర్మించేందుకు సిద్ధమైంది. వేగంగా పనులను పూర్తి చేయాలన్న ఉద్దేశంతో ప్రీకాస్ట్ పద్ధతిని ఎంపిక చేసుకుంటున్నామని, నిర్ణీత ప్రమాణాలతో తక్కువ ధరకు దిమ్మెలను సరఫరా చేసే సంస్థలకు టెండర్లు పిలిచామని ఇంజినీరింగ్ విభాగం వెల్లడించింది.

జాప్యం లేకుండా..

ఇప్పటికే 5లక్షలు, పది లక్షల లీటర్ల నీటిని నిల్వ చేయగల సామర్థ్యంతో జీహెచ్ఎంసీ 12 చోట్ల భూగర్భ జలాశయాల నిర్మాణాన్ని ప్రారంభించింది. తరచుగా వర్షాలు కురుస్తుండటంతో పురోగతి పడకేసింది. ఆ అనుభవంతో.. ఇకపై ప్రీ కాస్ట్ పద్ధతిలో ట్యాంకులు నిర్మించాలని ఇంజినీర్లు నిర్ణయించారు. అందుకోసం 50 ప్రాంతాలను ఎంపిక చేశామని, స్థలాన్ని పరిశీలించి.. అక్కడ ఎన్ని లక్షల లీటర్ల ట్యాంకులు నిర్మించాలో నిర్ణయిస్తామంటున్నారు. ప్రీకాస్ట్ పద్ధతిలో తయారు చేసి, వాటిని నేరుగా ఆయా ప్రాంతాల్లో అమర్చాలని, వారంలో పని మొత్తం పూర్తయ్యేట్లు కార్యక్రమాన్ని రూపొందించామని జీహెచ్ఎంసీ చెబుతోంది.



రానున్న పండగలను పురస్కరించుకొని కేపీహెచ్‌బీకాలనీలోని ఓ మాల్‌లో గురువారం పలువురు చెఫ్‌లు, యువతులు కేక్ మిక్సింగ్ చేస్తూ సందడి చేశారు. -న్యూస్‌టుడే, కేపీహెచ్‌బీకాలనీ

ట్రాఫిక్ నియంత్రణకు హైడ్రా

- ఇరు విభాగాలు కలిసి పనిచేయాలని నిర్ణయం
- ఫుట్‌పాత్, రోడ్ల ఆక్రమణల తొలగింపునకు ప్రత్యేక డ్రైవ్

ఈనాడు- హైదరాబాద్: నగరంలో విపరీతంగా పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి హైడ్రా రంగంలోకి దిగుతోంది. వాహన రద్దీ సమస్యతో పాటు ఫుట్‌పాత్, రహదారి ఆక్రమణలపై నగర ట్రాఫిక్ విభాగంతో కలిసి పనిచేయాలని నిర్ణయించింది. ఇరు విభాగాలు కలిసి ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఆక్రమణలను తొలగించనున్నాయి. హైడ్రా ఆధీనంలోని విపత్తు స్పందన బృందాలు ట్రాఫిక్ నియంత్రణలో పాలుపంచుకోనున్నాయి. ఈ మేరకు ఇరు విభాగాలు సంయుక్తంగా పనిచేయాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, ట్రాఫిక్ అదనపు కమిషనర్ పి.విశ్వప్రసాద్ నిర్ణయించారు. ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులతో కలిసి పనిచేసేందుకు డీఆర్ఎఫ్ బృందాలకు శిక్షణ ఇవ్వనున్నారు. హైడ్రా అధికారులు, నగర ట్రాఫిక్ డీసీపీ, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లతో రంగనాథ్, విశ్వప్రసాద్ గురువారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నెలకోసారి ఇరు విభాగాలు భేటీ కావాలని నిర్ణయించారు.



మాట్లాడుతున్న రంగనాథ్. చిత్రంలో విశ్వప్రసాద్

డీఆర్ఎఫ్ బృందాలకు శిక్షణ

- ప్రధాన రహదారులు, కాలనీల్లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మించిన శాశ్వత దుకాణాల గుర్తింపునకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి. దుకాణదారులకు ముందస్తు సమాచారం ఇచ్చి తొలగించాలి.
- ఫుట్‌పాత్‌ల మీద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, టెలిఫోన్ డక్టులు, జీహెచ్ఎంసీ చెత్తడబ్బాలు తొలగించాలి. పాదచారులు సాఫీగా వెళ్లేలా ఫుట్‌పాత్‌లను మార్చాలి. ట్రాఫిక్ విధులపై డీఆర్ఎఫ్ బృందాలకు శిక్షణ ఇవ్వడం.
- నగరంలోని రహదారులపై 144 నీరు నిలిచే పాయింట్లుండగా అందులో 65 హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఉన్నాయి. వీటిని ప్రాధాన్యక్రమంలో పరిష్కరించాలి.
- వరద నీరు వెంటనే తొలగించేందుకు భారీ మోటార్లు వినియోగించాలి. ఈ ప్రాంతాల్లో శాశ్వత పరిష్కారానికి కొత్తపైపులైన్లు ఏర్పాటు చేయాలి. వరద కాలువలు, పైపుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలి.
- కూలడానికి సిద్ధంగా ఉన్న చెట్లు, కొమ్మల్ని గుర్తించి తొలగించాలి.

నగరంలో విధులు.. ఆంధ్రప్రదేశ్‌లో డీఎడ్

- ఉపాధ్యాయ కొలువుకు ఎంపికైన 11మంది పొరుగు సేవల సిబ్బంది
- నియామకాలను నిలిపివేసిన హైదరాబాద్ కలెక్టర్

ఈనాడు, హైదరాబాద్: ఉపాధ్యాయ కొలువు సాధించాలన్న లక్ష్యంతో హైదరాబాద్ జిల్లాలో ఓ ప్రభుత్వ విభాగంలో పొరుగు సేవల కింద విధులు నిర్వహిస్తున్న అభ్యర్థులు.. ఆంధ్రప్రదేశ్‌లో డీఎడ్ (డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) పూర్తిచేశారు. డీఎడ్ అర్హతతో ఎస్‌జీటీ పోస్టుకు దరఖాస్తు చేసి, పరీక్ష రాశారు. ఉద్యోగానికి అర్హత సాధించడంతో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. అయితే నియామకపు పత్రాలు ఇచ్చే టప్పుడు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆధ్వర్యంలో మరోమారు పరిశీలించగా.. 11 మంది పొరుగుసేవల విభాగంలో విధులు నిర్వహించినట్లు తేలడంతో నియామకపు పత్రాలు నిలిపివేశారు. వారు సమర్పించిన విద్యార్హత పత్రాలను పూర్తిస్థాయిలో పరిశీలించాలని ఉత్తర్వులు జారీచేశారు.

తరగతులకు హాజరు కాకుండా..

ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికైన 11 మంది తాము ఆంధ్రప్రదేశ్‌లో డీఎడ్ పూర్తి చేసినట్టు ధ్రువపత్రాలు సమర్పించారు. అయితే పొరుగు సేవల విభాగంలో విధులు నిర్వహిస్తూ.. నెలనెలా జీతాలు తీసుకుంటున్నారు. హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న వీరంతా.. పక్క రాష్ట్రంలో డీఎడ్ ఎలా చదివారని కలెక్టర్ అనుదీప్ సందేహాన్ని వ్యక్తంచేశారు. ఈ 11 మంది తరగతులకు హాజరుకాకుండా బీఎడ్ పూర్తి చేశారని, పరీక్షల సమయంలోనే అక్కడికి వెళ్లి ఉంటారని విచారణ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.

నకిలీ బోనఫైడ్‌లతో మరో 21 మంది..

హైదరాబాద్‌లో ఉపాధ్యాయ పోస్టులు ఎక్కువగా ఉండడంతో కొందరు అభ్యర్థులు తప్పుడు బోనఫైడ్ పత్రాలను సమర్పించి పరీక్షలు రాశారు. వీరిలో 21 మంది ఎంపికయ్యారు. తుదిదశ పరిశీలనలో బోనఫైడ్ పత్రాలు నకిలీవని ప్రాథమికంగా తేలింది. మూతపడిన ప్రైవేటు పాఠశాలల్లో చదివినట్లు బోనఫైడ్ పత్రాలు సమర్పించారు. ఎప్పుడో మూతబడిన పాఠశాలల్లో.. ఎలా చదివారనే అనుమానంతో వారికి అధికారులు నియామక పత్రాలు ఇవ్వలేదు. ఇదే తరహాలో మరికొందరు అభ్యర్థులు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోనూ దరఖాస్తులు చేసినట్లు తెలిసింది. ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులు అంతర్గతంగా విచారణ చేస్తున్నట్టు సమాచారం. హైదరాబాద్‌లో మొత్తం 32 మంది అభ్యర్థులకు నియామకపు పత్రాలు ఇవ్వలేదని, వారు సమర్పించిన ధ్రువపత్రాలపై విచారణ చేస్తున్నామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.

చిల్లర చిక్కులకు చెల్లు



- రెండు నెలల్లో బస్సుల్లో పూర్తిస్థాయి డిజిటల్ చెల్లింపులు
- ప్రత్యేక యాప్ రూపకల్పనపై ఆర్టీసీ దృష్టి

ఈనాడు, హైదరాబాద్



ఆర్టీసీ ప్రయాణికులకు చిల్లర కష్టాలు తీరనున్నాయి. బస్సుల్లో కండక్టర్, ప్రయాణికులకు మధ్య చిల్లర గొడవలు నిత్యకృత్యమయ్యాయి. ఈ సమస్యను తీర్చేందుకు పూర్తిస్థాయి డిజిటల్ చెల్లింపుల ప్రక్రియకు సంస్థ సమాయత్తమైంది. ఇందుకు సంబంధించి బండ్లగూడ, దిల్‌సుఖ్‌నగర్ డిపోల్లోని 140 బస్సుల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన డిజిటల్ చెల్లింపుల ప్రక్రియకు విశేష స్పందన రావడంతో రెండు నెలల్లో గ్రేటర్‌లోని అన్ని డిపోల్లో అందుబాటులోకి తెచ్చేందుకు ఆర్టీసీ సన్నాహాలు చేస్తోంది. అవసరమైన 4,500 ఇంటలిజెంట్ టికెటింగ్ యంత్రాలను(ఐటిమ్స్)ను సమకూర్చుకుంటోంది. ఇంటర్నెట్ ఆధారంగా ఇవి పనిచేయనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 10,000 ఐటిమ్స్ యంత్రాలు అవసరమవుతుండగా సగం మేర గ్రేటర్‌లోనే వినియోగించనున్నారు. తద్వారా క్యూఆర్ కోడ్ స్కానింగ్, కార్డు స్వైపింగ్‌తో ప్రయాణికులు టికెట్ కొనే వెసులుబాటు కలుగనుంది.

పెద్దనోట్లతో పరేషాన్

గ్రేటర్‌లో మెజార్టీ ప్రయాణికులు డిజిటల్ చెల్లింపులకు అలవాటుపడ్డారు. బస్సుల్లో టికెట్ కొనుగోలుకు రూ.100, రూ.200 నోట్లు ఇస్తుండటంతో కండక్టర్లకు ఇబ్బందికర పరిస్థితి ఎదురవుతోంది. రూ.10 నాణేలను తీసుకోవడంలోనూ కండక్టర్లు, ప్రయాణికుల మధ్య వాగ్వాదం జరుగుతోంది. ఈ నాణేన్ని తీసుకోవాలని ఆర్బీఐ కోరుతున్నా, స్వయంగా ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశించినా కొన్ని బస్సుల్లో తీసుకోవడం లేదంటూ ప్రయాణికులు ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సాంకేతికతను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. యూపీఐ, క్రెడిట్, డెబిట్ కార్డు ద్వారా చెల్లింపులు ప్రారంభమైతే చిల్లర కష్టాలు తీరిపోనున్నాయి.

విద్యార్థుల బస్‌పాస్‌కు యాప్..

గ్రేటర్ పరిధిలో 5లక్షల మందికి పైగా విద్యార్థులు వేర్వేరు కళాశాలల్లో చదువుతున్నారు. వీరంతా బస్‌పాస్ రెన్యూవల్ కోసం ప్రతినెలా వరుసలో ఉండాల్సిన సమస్య తీరనుంది. ఇందుకు ఆర్టీసీ ప్రత్యేక యాప్ ప్రవేశపెట్టే యోచనలో ఉంది. యాప్‌తో బస్‌పాస్‌లు పొందే వెసులుబాటు కలగనుంది. తద్వారా పాస్‌ను కండక్టర్‌కు మొబైల్‌లోనే చూపించి ప్రయాణించొచ్చు.

జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఇలంబర్తి బాధ్యతల స్వీకరణ



ఈనాడు డిజిటల్, హైదరాబాద్: జీహెచ్ఎంసీ కమిషనర్‌గా కె.ఇలంబర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అనురాగ్ జయంతి, అపూర్వ్ చౌహాన్, అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, యాదగిరిరావు, వేణుగోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, పంకజ, రవికిరణ్ ఉపేందర్‌రెడ్డి, వెంకన్న సీసీపీ శ్రీనివాస్, సీసీపీఆర్ఓ మహమ్మద్ ముర్తుజా అలీ, చీఫ్ ఎంటమాలజిస్ట్ డా.రాంబాబు, ఓఎస్డీ వేణుగోపాల్, ఆయా విభాగాల సీనియర్ అధికారులు కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కాసులుంటేనే ఆటలు

- బల్దియా క్రీడా ప్రాంగణాలు ప్రైవేటుకు
- సౌకర్యాలు పెంచి రుసుము వసూలుకు అనుమతి

ఈనాడు, హైదరాబాద్



నగరంలోని స్పోర్ట్స్ కాంప్లెక్సులు, మైదానాల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు ఇచ్చేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. సౌకర్యాల పెంపు, ఆధునిక హంగులు ఇతరత్రా లక్ష్యాలతో పనులు ప్రారంభించింది. మొదటి దశలో ఖైరతాబాద్ జోన్ పరిధిలోని 9 స్పోర్ట్స్ కాంప్లెక్సులు, 200లకుపైగా మైదానాలను పీపీపీ(ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం) పద్ధతిలో అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. అందుకు ప్రణాళిక ఇవ్వాలంటూ కన్సల్టెన్సీలను ఆహ్వానిస్తూ జోనల్ సూపరింటెండెంట్ ఇంజినీరు తాజాగా ఆర్ఎఫ్‌పీ(రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్) టెండరు నోటిఫికేషన్ విడుదల చేశారు. క్రమంగా మిగిలిన జోన్లలోని క్రీడా కాంప్లెక్స్‌లను ప్రైవేటుకు ఇవ్వాలని బల్దియా భావిస్తోంది.

ఇప్పటికే ఫీజు వసూలు చేస్తున్న బల్దియా..

ఏడేళ్ల క్రితం జీహెచ్ఎంసీ ఆన్‌లైన్ సభ్యత్వ నమోదుతో స్పోర్ట్స్ కాంప్లెక్సులు, మైదానాలకు రుసుము వసూలు చేయడం ప్రారంభించింది. ఏటా రూ.5కోట్లకుపైగా ఆదాయం సమకూరుతోంది. నెలవారీ రుసుము రూ.100నుంచి రూ.1000 వరకు ఉంది. మైదానాన్ని అద్దెకు తీసుకోవాలంటే రోజుకు రూ.7500 వరకు చెల్లించాలి.

కాంట్రాక్టు ప్రతిపాదన ఇలా..

అభివృద్ధి చేసి ఐదేళ్లపాటు నిర్వహించుకునేందుకు అనుమతి, పరిస్థితులను బట్టి కాంట్రాక్టు పొడిగింపుపై జీహెచ్ఎంసీ నిర్ణయం తీసుకుంటుంది. కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థ నిపుణులైన శిక్షకులతో కేంద్రాలు నిర్వహించాల్సి ఉంటుంది. అన్నిరకాల రుసుములను ఏటా 5-7శాతం మేర పెంచుకోవచ్చు. ప్రాంగణంలో ఆహారం, క్రీడా వస్తువుల విక్రయ కేంద్రాలు, ఫిట్‌నెస్ కేంద్రాలు నిర్వహించుకోవచ్చు.

పేద, మధ్య తరగతిపై భారం..

పలువురు ఇంజినీర్లు, గేమ్ ఇన్‌స్పెక్టర్లు కలిసి స్పోర్ట్స్ కాంప్లెక్సులు, ఈత కొలనులు, ఇతర మైదానాలకు మరమ్మతులంటూ ఏటా రూ.కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలున్నాయి. సరైన నిఘా పెట్టి, నిధులు సద్వినియోగమయ్యేలా చర్యలు తీసుకుంటే.. స్పోర్ట్స్ కాంప్లెక్సులు ఆరోగ్యవంతమైన హైదరాబాద్‌ను సాకారం చేస్తాయి. ప్రభుత్వమే స్పోర్ట్స్ కాంప్లెక్సులను ఆధునికీకరించాలని యువత కోరుతోంది. ప్రైవేటుకు ఇస్తే పేద, మధ్య తరగతి వారు మైదానానికి దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేస్తోంది.

ఖైరతాబాద్

● ఖైరతాబాద్ ● జూబ్లీహిల్స్

కుల గణన సర్వేకు సహకరించండి

● బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: త్వరలో ప్రారంభమయ్యే కులగణన సర్వేకు 80వేల మంది సిబ్బందిని నియమించామని, ఇళ్లకు వచ్చే అధికారులు, సిబ్బందికి ప్రజలు పూర్తి సమాచారం ఇవ్వాలని, లేకపోతే రిజర్వేషన్లలో నష్టపోయే ప్రమాదం ఉందని రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్ పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో 'వాల్మీకి జయంత్యుత్సవం' ఘనంగా నిర్వహించారు. ఆహ్వాన కమిటీ ఉపాధ్యక్షుడు బోయ నరేష్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథి నిరంజన్ మాట్లాడుతూ.. ఇది కేవలం బీసీ కులగణన మాత్రమే కాదని, అన్ని కులాలకు సంబంధించి సర్వే జరుగుతుందన్నారు. రాష్ట్ర బీసీ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్ కుల గణన విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహాత్మా జ్యోతిరావు పులే బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బి.సైదులు, కమిటీ ప్రతినిధులు గోపి బోయ, రేపల్లె కృష్ణ, గట్టు కృష్ణ, వెంకటేశ్, ఎ.కొండయ్య, మూర్తి నాయుడు, రమణ తదితరులున్నారు.

సదర్ వేడుకలకు ఆహ్వానం

ఎల్లారెడ్డిగూడ, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిగూడలో ఏటా వైభవంగా నిర్వహించే సదర్ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని స్థానిక కాంగ్రెస్ నేతలు కోరారు. మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, పార్టీ నేత కిరణ్‌యాదవ్ గురువారం సీఎంని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి వేడుక వివరాలు తెలియజేశారు.



సీఎం రేవంత్‌రెడ్డితో అంజన్‌కుమార్, కిరణ్‌యాదవ్

గౌడ హాస్టల్ భవనంపై మరో అంతస్తు

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: హిమాయత్‌నగర్ డివిజన్ గౌడ హాస్టల్ భవనంపై రూ.52 లక్షలతో మరో అంతస్తు నిర్మించనున్నారు. ఇటీవల కార్పొరేటర్ మహాలక్ష్మి మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ దృష్టికి ఈ విషయం తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. గురువారం జీహెచ్ఎంసీ అధికారులు కొలతలు తీసుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.1 గంట వరకు

ఖైరతాబాద్	80085 73345
జూబ్లీహిల్స్	80085 73352
బంజారాహిల్స్	80085 73348

బంజారాహిల్స్, ఖైరతాబాద్, న్యూస్‌టుడే

? బంజారాహిల్స్ రోడ్డు 5లోని ఓ వార్తా ఛానెల్ కార్యాలయం సమీపంలో పలు వీధిదీపాలు పగలు కూడా వెలుగుతున్నాయి.
– శ్రీకాంత్, ప్రైవేటు ఉద్యోగి, బంజారాహిల్స్

✓ సాంకేతికలోపం కారణం కావచ్చు. సమస్య పరిష్కరిస్తాం. – సుష్మ, మున్సిపల్ ఏఈ (విద్యుత్ విభాగం), సర్కిల్–18

? ఖైరతాబాద్, ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్ ప్రభుత్వ పాఠశాల వీధిలో రెండు వారాలుగా వీధి దీపాలు వెలగడం లేదు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేస్తే రెండో రోజు పరిష్కరించామని సందేశం వచ్చింది. ఈ విషయం అధికారికి చెప్తే చిరునామా పంపండి చూస్తామన్నారు. ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. – కృష్ణారెడ్డి, ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్

✓ బంజారాహిల్స్ రోడ్డు నం.4 నుంచి దేవరకొండబస్తీకి వెళ్లే దారిలో వీధిదీపాలు వెలగడం లేదు.
– రవి, స్థానికుడు, బంజారాహిల్స్.

? బంజారాహిల్స్ దేవరకొండబస్తీలోని పోచమ్మ గుడి పక్క వీధిలో వీధి దీపాలు వెలగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.
– ప్రజనీష్, బంజారాహిల్స్

✓ ఆయా సమస్యలను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
– సుష్మ, ఎలక్ట్రికల్ ఏఈ, జీహెచ్ఎంసీ

నెలలు గడుస్తున్నా.. మరమ్మతులు సున్నా

శ్రీకృష్ణానగర్ హనుమాన్ మందిరానికి వెళ్లే వీధిలో



● అధ్వానంగా రహదారులు

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: యూసుఫ్‌గూడ, సోమాజిగూడ, వెంకటేశ్వరకాలనీ పరిధిలోని కొన్ని చోట్ల రహదారులు అధ్వానంగా మారాయి. సోమాజిగూడ డివిజన్ పరిధిలోని శాలివాహననగర్ కాలనీలో రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గతనెలలో గణపతి నిమజ్జనం సమయంలో సమస్యను ఖైరతాబాద్ సర్కిల్ ఇంజినీరింగ్ విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్తే మరుసటిరోజే మరమ్మతులు చేయిస్తామన్నా ఇంతవరకు స్పందించలేదు.



ఎ-బ్లాకులోని పెద్దయ్య గిర్ని సమీపంలో..

ప్రస్తుతం దసరా సందర్భంగా మండపాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాల నిమజ్జనం సైతం పూర్తయ్యింది. అడపా దడపా కురుస్తున్న వర్షాలకు రహదారులపై గుంతల్లో నీరు నిలుస్తోంది. దసరా పండగకు బంధువుల ఇళ్లకు వచ్చిన వారు ఈ గుంతల కారణంగా ప్రమాదాలబారిన పడుతున్నారు.

కొన్నిచోట్ల ఇదీ పరిస్థితి

● శ్రీకృష్ణానగర్‌లోని ఏ-బ్లాకులో సమస్య తీవ్రంగా ఉంది. హనుమాన్ మందిరం వీధి, పెద్దయ్య పిండి గిర్ని వీధి గుంతలమయంగా మారాయి. శ్రీసాయి రామ్ పాఠశాల సమీపంలోని వీధుల్లో మ్యాన్‌హోళ్లు సైతం దెబ్బతిన్నాయి. అక్కడక్కడా మ్యాన్‌హోళ్లు పొంగుతుండటంతో మురుగు ఆయా గుంతల్లో చేరుతోంది. వాహనాలు రాకపోకలు సాగిస్తున్నప్పుడు మురుగు నీరు పాదచారులపై చిమ్ముతుండటంతో ఇబ్బందులు పడుతున్నారు.

● యూసుఫ్‌గూడ గణపతి కాంప్లెక్స్ చుట్టుపక్కల రహదారుల పరిస్థితి ఇదే విధంగా ఉంది. వర్షాలకు తారు రోడ్లు దెబ్బతిన్నాయి. రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతల వరద నిలిచి రాకపోకలకు స్థానికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

● శ్రీనగర్‌కాలనీ శ్రీసత్యసాయి నిగమాగమం ప్రధాన ద్వారం ఎదురుగా శాలివాహననగర్‌కాలనీ ప్రధాన రహదారి మధ్యలో రోడ్డు దెబ్బతింది. నెలరోజుల క్రితం అధికారులకు ఫిర్యాదు చేస్తే మరుసటి రోజే వస్తామని చెప్పినా ఇంతవరకు పట్టించుకోలేదని వాపోతున్నారు.

సరిచేయమంటే.. తవ్వి వదిలేశారు

శ్రీనగర్‌కాలనీ ప్రధాన పార్కు వెనుక ఇటీవల కొత్తగా సీసీ రోడ్డు నిర్మించారు. నిబంధనలు పాటించకపోవడంతో ఓ చోట పల్లంగా మారి వర్షం కురిసినప్పుడు నీరు నిలుస్తోంది. కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సమస్యను తెలియజేయంతో గుత్తేదారు మరమ్మతుల పేరిట ఓ చోట రోడ్డును ఇలా తవ్వి వదిలేశారు. దాదాపు పది రోజులు అవుతున్నా పనులు చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు.



ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు విడుదల చేయండి



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల ర్యాలీ

నారాయణగూడ, న్యూస్‌టుడే: ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాల ఆధ్వర్యంలో విద్యార్థులతో గురువారం ర్యాలీ నిర్వహించారు. నారాయణగూడ ఫ్లైఓవర్ కూడలి నుంచి వైఎంసీఏ కూడలి వరకు జరిగిన ఈ ర్యాలీలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, సహాయ కార్యదర్శి దామర కిరణ్, జిల్లా కార్యదర్శి అశోక్‌రెడ్డి మాట్లాడారు. ఏడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రూ.8,300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాల బకాయలు ఉన్నాయన్నారు. బకాయిలు రాక, నిర్వహణ భారమవుతోందని ప్రైవేటు యాజమాన్యాలు కళాశాలలకు తాళాలు వేసిన పరిస్థితి నెలకొందన్నారు. బకాయిలు విడుదల చేయకపోతే సచివాలయం, ప్రజాభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా, ఉపాధ్యక్షుడు స్టాలిన్, నాగేందర్, ప్రశాంత్, చరణ్, శ్రీ, జిల్లా కమిటీ సభ్యులు సహన, భగత్ శివ తదితరులున్నారు.

రహదారి విస్తరణ బాధితులకు తాఖీదులు

బోరబండ, న్యూస్‌టుడే: రహ్మత్‌నగర్ ప్రాంతంలో రహదారి విస్తరణలో ఆస్తులు కోల్పోయే వారికి జీహెచ్ఎంసీ భూసేకరణ విభాగం తాఖీదులు అందజేస్తోంది. యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ నుంచి రహ్మత్‌నగర్ కూడలి మీదుగా మధురానగర్ ఠాణా వరకు రహదారిని 80 అడుగులకు విస్తరించాలన్న ప్రతిపాదనపై దశాబ్దాలుగా కసరత్తు జరుగుతోంది. ఇందులో భాగంగా ప్రభావితమయ్యే 61 ఆస్తులకు సంబంధించి గతనెలలో కొంత మందికి నోటీసులు జారీచేసిన అధికారులు తాజాగా రెండురోజుల నుంచి మిగిలిన వారికి అందజేస్తున్నారు. విస్తరణలో భాగంగా రహ్మత్‌నగర్ కూడలి అభివృద్ధి ప్రణాళికను అమలు చేయనున్నారు. మొదటి విడతలో నోటీసులపై ఏమైనా అభ్యంతరాలుంటే నవంబరు 11న, రెండోవిడతలో తాఖీదులు అందినవారు 21న జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని భూసేకరణ విభాగంలో సంప్రదించవచ్చునని సర్కిల్-19 పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపి జనలీల కృష్ణవేణి తెలిపారు.

లాడ్జీలు, హోటళ్ల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి

పంజాగుట్ట: లాడ్జీలు, హోటళ్ల నిర్వాహకులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పంజాగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్ అన్నారు. గురువారం సాయంత్రం జయా గార్డెన్స్‌లో పంజాగుట్ట, మధురానగర్ పోలీసు స్టేషన్ల పరిధిలోని హోటళ్లు, లాడ్జీల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాడ్జీల్లో బస చేసేవారి పూర్తి వివరాలను, గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా సేకరించాలని సూచించారు. అనుమానితుల వివరాలను పోలీసులకు చేరవేయాలని సూచించారు. ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. నిబంధనలు పాటించని నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డైటీషియన్ అదృశ్యం

ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సోదరుడికి సందేశం పంపించి డైటీషియన్ అదృశ్యమైన ఘటన ఫిల్మ్‌నగర్ ఠాణాలో పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదియానగర్‌కు చెందిన యువతి (27) లోటస్‌పాండ్ పార్కు సమీపంలోని ఓ పునరావాస కేంద్రంలో డైటీషియన్‌గా పనిచేస్తోంది. ఈనెల 14న విధులకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లింది. అదే రోజు సాయంత్రం తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు సోదరుడు ప్రణయ్‌కుమార్ ఫోన్‌కు సందేశం పింపించింది. వెంటనే ఆమెకు ఫోన్ చేయగా, స్విచ్ఛాఫ్ వచ్చింది. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. యువతితో కొన్నాళ్లుగా చనువుగా ఉంటున్న ఓ యువకుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో యువతి..

యువతి అదృశ్యమైన ఘటన ఫిల్మ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జ్ఞానీజైల్‌సింగ్‌నగర్‌కు చెందిన ఓ యువతి ఫిల్మ్‌నగర్‌లోని ఓ రెస్టారెంట్‌లో వెయిటర్‌గా పనిచేస్తోంది. ఈనెల 10న ఉదయం విధులకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

పార్శిల్‌లో డ్రగ్స్ ఉన్నాయని మోసం

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: పార్శిల్‌లో మాదకద్రవ్యాలున్నాయని ఓ యువకుడిని బుడిరీ కొట్టించిన సైబర్ మోసగాళ్లు రూ.90వేలు కాజేశారు. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిగూడ ప్రాంతంలో నివాసముంటున్న శివకుమార్ ప్రైవేట్ ఉద్యోగి. ఈనెల 16న ఫెడెక్స్ కస్టమర్ కేర్ నుంచి మాట్లాడుతున్నామని సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. కాల్‌ను ముంబయిలోని సైబర్ క్రైమ్ బ్రాంచి పోలీసులకు బదిలీచేస్తున్నట్లు నమ్మించారు. మీరు పంపిన పార్శిల్‌లో మాదకద్రవ్యాలతో పాటు, ఆధార్ నంబరుతో ముంబయిలో 3 బ్యాంకు ఖాతాలున్నాయని, వాటి ద్వారా మనీ ల్యాండరింగ్ జరిగిందని బెదిరించారు. పోలీసు కేసు నుంచి మినహాయింపు కావాలంటే డబ్బు పంపాలని హెచ్చరించారు. దీంతో వారు చెప్పిన ఖాతాకు రెండు విడతలుగా రూ.90వేలు పంపించాడు. అనంతరం మోసపోయానని గ్రహించి ఆన్‌లైన్‌లో సైబర్ క్రైం విభాగానికి, మధురానగర్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చరవాణులు చోరీ చేస్తున్న యువతి రిమాండ్

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: రద్దీ ప్రదేశాల్లో చరవాణులు కొట్టేస్తున్న యువతిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. డీఐ మధుసూదన్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం... దసరా నవరాత్రుల్లో రద్దీగా ఉన్న పెద్దమ్మగుడి వద్ద సనత్‌నగర్‌లోని ఫతేనగర్ ప్రాంతానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి కొమ్మిరె మోర్లిన్ అలియాస్ మేరీ భక్తులకు చెందిన 13 చరవాణులను కాజేసింది. వాటిని బాలానగర్ ప్రాంతంలోని చరవాణులు మరమ్మతులు చేసే రాయలపురం వెంకటేష్, ఫతేనగర్‌కు చెందిన యుగంధర్ అలియాస్ యుగి, బాలానగర్ రాజుకాలనీకి చెందిన రేణుకకు ఇస్తోంది. ఈ ముగ్గురు చరవాణులను విక్రయించి వచ్చిన డబ్బులను మేరికి ఇచ్చారు. సీసీ కెమెరాల ఆధారంగా మేరీని గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. చోరీలకు పాల్పడింది తానేనని అంగీకరించింది. ఆమె నుంచి 7 చరవాణులను స్వాధీనం చేసుకొని, ఆమెతో పాటు వెంకటేష్‌ను అరెస్ట్ చేశారు. యుగంధర్, రేణుక పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. అడ్మిన్ ఎస్సై హరీశ్వర్‌రెడ్డి, డీఎస్సై రాజశేఖర్ ఉన్నారు.

ప్రవాస నర్తకి వశిష్ఠ నృత్య ప్రదర్శన 19న

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: ప్రవాసి యువ నృత్య కళాకారిణి వశిష్ఠ ఈనెల 19వ తేదీన సాయంత్రం 5 గంటలకు గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో భరత నాట్య ప్రదర్శన ఇవ్వనున్నట్లు నాట్యగురువు డా. జయశ్రీ రాజగోపాలన్ తెలిపారు. ముంబయికి చెందిన నృత్యోదయ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన ఉంటుందని, త్రిదండి చిన శ్రీమన్నారాయణ జీయర్ స్వామి, పద్మ విభూషణ్ డా.పద్మా సుబ్రహ్మణ్యం, సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, కళారత్న అశోక్ గుర్జాలే పాల్గొంటారని పేర్కొన్నారు.

ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ఇల్లు కూల్చివేత

బోరబండ, న్యూస్‌టుడే: రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ ప్రధాన రహదారిపై ఎన్ఎస్‌బీ నగర్ ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ఇంటిని ఖైరతాబాద్ మండల రెవెన్యూ సిబ్బంది గురువారం కూల్చివేశారు. తహసీల్దార్ ఎం.డి. నయీముద్దీన్ ఆదేశాల మేరకు ఎస్పీఆర్ హిల్స్‌కు చేరుకున్న ప్రత్యేక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్ రాజ్, చైన్‌మ్యాన్ మెహతాబ్ మధురానగర్ పోలీసుల బందోబస్తు మధ్య కూల్చివేత చేపట్టారు. ప్రభుత్వస్థలంలో బోర్డును తొలగించి ఇంటిని నిర్మించిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు ఆర్.ఐ.కిరణ్‌రాజ్ చెప్పారు.

తాగునీరు, సీవరేజీ పైపులు వేయండి

బంజారాహిల్స్: వెంకటేశ్వరకాలనీ డివిజన్‌లో అవసరమైన మంచినీటి, సీవరేజీ పైపులైను సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి జలమండలి అధికారులకు విజ్ఞప్తి చేశారు. గురువారం బంజారాహిల్స్‌లోని జలమండలి డీజీఎం ఇంద్రశీలరాణి, బంజారాహిల్స్ సెక్షన్ మేనేజర్ శివతో కార్పొరేటర్ సమావేశమయ్యారు. వెంకటేశ్వరనగర్‌లో అవసరమైన మంచినీటి పైపులైను, పాత వెంకటేశ్వరనగర్, గౌరీశంకర్‌నగర్ ప్రాంతాల్లో సీవరేజీ పైపులైన్ల పనులు పూర్తి చేయాలని కోరారు. చోటూభాయ్ గల్లీ సహా ఇతర ప్రాంతాల్లో అవసరమైన ఇతర ప్రాంతాల్లో ప్రతిపాదనలను రూపొందించాలని అధికారులను కోరారు.

రామాయణంలో నీతి ఆదర్శనీయం

నారాయణగూడ, న్యూస్‌టుడే: ఆదికవి వాల్మీకి మహర్షి జయంత్యుత్సవాన్ని వాల్మీకి కుల సంఘాల ఆధ్వర్యంలో గురువారం నారాయణగూడలోని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం కాంగ్రెస్ నాయకుడు జి.రామన్‌గౌడ్ మాట్లాడుతూ.. మానవ జీవన విధానం, నైతిక విలువలను రామాయణం చెబుతుందని, అందుకే ఆ మహాకావ్యం నేటికీ అందరికీ ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో కె.కొండయ్య, వెంకటేష్, సుధాకర్, బాబు, కె. మహేష్, వెంకటయ్య, నాగరాజు, జగదీష్, మల్లేష్, రాములు తదితరులున్నారు.

విద్యుత్తు శాఖ డీఈగా హనుమంతరెడ్డి



యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ బంజారాహిల్స్ డివిజన్ (ఆపరేషన్స్) నూతన డీఈగా పి.హనుమంతరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఆస్మాన్‌ఘడ్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన డీఈ ఎస్.నరేందర్‌రెడ్డి హైదరాబాద్ సౌత్ స్కాడా సర్కిల్‌కు వెళ్లారు.

ఆటో డ్రైవర్లకు అండగా ఉంటాం: కేటీఆర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కేటీఆర్

ఫిలింనగర్, న్యూస్‌టుడే: ఇందిరాపార్కు వద్ద తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్ (జేఏసీ) ఆధ్వర్యంలో నవంబరు 5న జరగనున్న మహాధర్నా పోస్టర్‌ను భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ బంజారాహిల్స్ నందినగర్‌లోని ఆయన నివాసంలో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు భారాస అండగా ఉంటుందన్నారు. ఆటో డ్రైవర్లకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బీఆర్‌టీయూ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వేముల మారయ్య, బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబుయాదవ్, టీఏడీఎస్ ప్రధాన కార్యదర్శి ఎ.సత్తిరెడ్డి, ఉపాధ్యక్షుడు శాతం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాంసం వ్యర్థాలు రోడ్డుపై వేయొద్దు



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

జూబ్లీహిల్స్: మాంసం వ్యర్థాలను దుకాణం ముందు, రోడ్డుపై పడేయవద్దని జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరెడ్డి సూచించారు. ఠాణా పరిధిలోని మాంసం దుకాణదారులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతి దుకాణం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: మాంసం దుకాణాల నిర్వాహకులకు మధురానగర్ పోలీసుల గురువారం సూచనలు చేశారు. వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పారవేయద్దని, చెత్తను తరలించే వాహనాలకు ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వర్మ తెలిపారు.

26న టీజీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం వద్ద మహాధర్నా

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఉద్యోగులు, ఆర్టిజన్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం మింట్ కాంపౌండ్‌లోని టీజీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం వద్ద తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల 1104 సంఘం ఆధ్వర్యంలో 26న మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి సాయిబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలపై గడిచిన నాలుగేళ్లుగా అనేక పర్యాయములు వినతులు ఇచ్చామని, స్పందన లేకపోవడంతో క్షేత్రస్థాయిలో ఉద్యోగులు, కార్మికులు, ఆర్టిజన్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. వెంటనే సమావేశం ఏర్పాటు చేసి సమస్యలన్నీ 25వ తేదీ లోపు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఎండీ కార్యాలయంలో ధర్నా నోటీస్ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

20న హరిణి వనస్థలిలో పద్మశాలీ దసరా మేళా



కరపత్రికను ఆవిష్కరించిన వనం దుష్యంతల, కందగట్ల స్వామి, గుంటక రూప తదితరులు

నారాయణగూడ, న్యూస్‌టుడే: పద్మశాలీ సంఘం (ఎల్బీనగర్ సర్కిల్) ఆధ్వర్యంలో ఈనెల 20న పద్మశాలి దసరా మేళా నిర్వహించనున్నట్లు అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ మహిళా అధ్యక్షురాలు వనం దుశ్యంతల వెల్లడించారు. జింకల పార్కులోని అనన్య ఎకో పార్కు ఆవరణలో జరిగే ఈ మేళాకు పద్మశాలి మహిళలు తరలిరావాలని కోరారు. గురువారం నారాయణగూడలోని పద్మశాలి భవనంలో మేళా వివరాలు వెల్లడించారు. తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గుంటక రూప, గ్రేటర్ మహిళా అధ్యక్షురాలు పొరండ్ల శారద, ఎల్బీనగర్ పద్మశాలి సంఘం మహిళా అధ్యక్షురాలు రావిరాల సంధ్యారాణి తదితరులతో కరపత్రాన్ని ఆవిష్కరించారు. స్థానిక ఎన్నికల్లో జనాభా ప్రాతిపాదికన పద్మశాలీ మహిళలకు అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు సముచిత స్థానం కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, ఎల్బీనగర్ సర్కిల్ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, సంఘ నాయకులు పాల్గొన్నారు.

డిగ్నిటీ హౌసింగ్ కాలనీలో సమస్యలు పరిష్కరించండి



అధికారికి వినతిపత్రం ఇస్తున్న కాలనీ అధ్యక్షుడు అనిల్

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఖైరతాబాద్‌లోని ఇందిర నగర్ 2బీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్ కాలనీలో ఆర్థిక సామాజిక సర్వే కోసం వచ్చిన అధికారుల బృందానికి కాలనీ సంక్షేమ సంఘం సమస్యల చిట్టా అందజేసింది. బుధవారం ఇంటింటికీ వెళ్లి సమాచారం సేకరించిన అధికారులు గురువారం మరోసారి అక్కడికి చేరుకుని స్థానికులతో సమావేశం ఏర్పాటుచేశారు. చాలా మంది ఇళ్లు అద్దెకు ఇచ్చినట్లు గుర్తించిన అధికారులు ఆరా తీయగా దూర ప్రాంతంలో ఉన్న యజమాని ఇక్కడ అద్దెకు ఇచ్చి అక్కడ అద్దె చెల్లిస్తున్నట్లు గుర్తించారు. వరుసగా ఇళ్లు ఖాళీగా ఉంటే సాంఘిక శక్తులు పెరిగే అవకాశం ఉండటంతో అక్యుపెన్సీ పెంచేందుకు చర్యలు తీసుకున్నట్లు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అనిల్ అధికారులకు వివరించారు. తాము సొంతంగా అన్ని వసతులు కల్పించుకొని పరిశుభ్రంగా ఉంచుతుంటే అధికారులు రోల్‌మోడల్‌గా చూపుతున్నారని, ఈ నేపథ్యంలో సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు. ప్రధానం తాగు నీటి సమస్య వేధిస్తోందని, 80 ఫ్లాట్ల బ్లాక్‌కు ఒకే ఓవర్ హెడ్ ట్యాంకు ఉందని, జనరేటర్ ఇచ్చినా బిగించలేదని తెలిపారు. ఇళ్లకు సౌర విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరారు. ఇళ్ల సముదాయం చుట్టూ ఆక్రమణలను నియంత్రించాలని విన్నవించారు. నాలుగు బ్లాకుల్లోనూ కామన్ ఏరియాలో విద్యుత్ బిల్లులు మినహాయించాలని లిఫ్ట్ ఏర్పాటు చేయాలని వినతి పత్రం సమర్పించారు. జీహెచ్ఎంసీ నోడల్ అధికారి పి.శ్రావణ్ కుమార్, సిటీ లెవల్ టెక్నికల్ అధికారులు నూర్జహాన్, కిషోర్ తదితరులు ఉన్నారు.

వానొస్తే.. నీరు తోడాల్సిందే



నిమ్స్ గేటు ముందు ఇలా..

పంజాగుట్ట, న్యూస్‌టుడే: చిన్నపాటి వర్షానికే నిమ్స్‌కు వెళ్లే దారిలో మోకాలి లోతు నీరు నిలుస్తోంది. ఆసుపత్రిలోకి వెళ్లాలన్నా, రావాలన్నా నీటిలోంచే నడవాల్సి వస్తోంది. చాలాకాలంగా ఈ సమస్య ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు ఎవరూ దృష్టి సారించడం లేదు. ప్రధాన రోడ్డు నుంచి నిమ్స్‌కు వెళ్లే గేటు వద్ద రోడ్డు పల్లంగా ఉండటంతో ఈ పరిస్థితి నెలకొంటోంది. వర్షం వెలిసినప్పటికీ రోజుల తరబడి నీరు, బురద ఉండటంతో ప్రతీసారి మోటార్లతో తోడిపోస్తున్నారు. ఇలా నీటి నిల్వ వల్ల దోమల బెడద ఎక్కువగా ఉంటోందని స్థానిక దుకాణదారులు చెబుతున్నారు. శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మోటారు ద్వారా ఇలా..

తొలి చూపే.. చివరిదైంది

● కుమారుడ్ని చూసేందుకు వచ్చి దుర్మరణం



సింహగిరి

కొమరాడ, న్యూస్‌టుడే: కుటుంబ పోషణ కోసం పొరుగు రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్నారు.. భార్య ప్రసవించినా.. సెలవులు దొరకకపోవడంతో సకాలంలో ఇంటికి రాలేకపోయారు. ఎట్టకేలకు దాదాపు మూడు వారాలు దాటాక స్వగ్రామానికి చేరుకున్నారు. కుమారుడ్ని కళ్లారా చూశారు. కానీ ఆ సంతోషం ఎంత సేపూ నిలవలేదు. చెరువు రూపంలో మృత్యువు వెంటాడింది. ఈ ఘటనలో హోంగార్డు దుర్మరణం చెందారు. ఏఎస్సై నాయుడు వివరాల ప్రకారం.. కొమరాడ మండలం చంద్రంపేట గ్రామానికి చెందిన జి.సింహగిరి(42) ఖైరతాబాద్ పోలీసు ఠాణాలో హోంగార్డుగా పనిచేస్తున్నారు. అతని భార్య భారతి ఇటీవల మగబిడ్డకు జన్మనిచ్చారు. దీంతో సింహగిరి సెలవుపై స్వగ్రామానికి వచ్చారు. గురువారం తెల్లవారుజామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు సమీపంలోని చెరువుకు వెళ్లారు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించగా. . ఈక్రమంలో చెరువులో విగతజీవిగా కనిపించారు. మృతదేహాన్ని బయటకు తీసి, జిల్లా ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

విద్యుత్తు చీఫ్ ఇంజినీర్ల బదిలీ

ఈనాడు, హైదరాబాద్: నగరంలో విద్యుత్తు చీఫ్ ఇంజినీర్లు సమూలంగా బదిలీ అయ్యారు. ఆపరేషన్ విభాగంలో ఉన్నవారిని కార్యాలయ పోస్టులకు, ఇన్నాళ్లు కార్యాలయాలకే పరిమితమైన వారిని ఆపరేషన్ విభాగాలకు బదిలీ చేస్తూ టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ బుధవారం అర్ధరాత్రి బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో పలువురు గురువారం ఉదయమే కొత్తపోస్టుల్లో బాధ్యతలు చేపట్టారు.

ఇందిరమ్మ కమిటీల్లో ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీలను విస్మరించారు



మాట్లాడుతున్న గడీల కుమార్ గౌడ్, చిత్రంలో మోహన్‌రెడ్డి, అశోక్ కుమార్, దేవి రవీందర్, సంగన్న, దేవేందర్, యాదగిరి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీలను విస్మరించిందని రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు గడీల కుమార్ గౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు దేవి రవీందర్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు పనిచేస్తామని చెప్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన తీసుకొచ్చిన ఎంపీటీసీలకు ఇందిరమ్మ కమిటీలో భాగస్వామ్యం లేకపోవడం వారిని అవమానించడమే అన్నారు. అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజల చేత ఎన్నికైన వారికి సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఎంపీటీసీల సంఘం నాయకులు మన్నె రాజు, తమన్నగారి సంగన్న, హరిగే అశోక్, మోహన్‌రెడ్డి, యాదగిరి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న ప్రొటెక్షన్ ఫోర్స్ సభ్యులు

బాచుపల్లి, న్యూస్‌టుడే: ఏడేళ్లుగా పెండింగులో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం ప్రొటెక్షన్ ఫోర్స్ సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ..ఫెస్ బకాయిలు కూడా పెండింగులో ఉన్నాయన్నారు. విద్యార్థులు ధ్రువపత్రాలు తీసుకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సభ్యులు రాహుల్, శివకృష్ణ, అనిల్‌కుమార్, అర్జున్, చంద్రశేఖర్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి

ముగిసిన పోచమ్మ ఆలయ రజతోత్సవాలు

మూసాపేట, న్యూస్‌టుడే: మూసాపేట పరిధి భవానీనగర్‌లో మూడు రోజులుగా కొనసాగుతున్న పోచమ్మ ఆలయ రజతోత్సవాలు గురువారం ముగిసాయి. భ్రమరాంబికా మల్లికార్జునస్వామి కల్యాణాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కృష్ణారావు పట్టువస్త్రాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. ఆలయ ఛైర్మన్ అంబటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి పట్టువస్త్రాలు ఊరేగింపుగా తీసుకొస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

నేడు మహిళలకు ఉద్యోగ మేళా


అల్లాపూర్, న్యూస్‌టుడే: మహిళల కోసం నేడు(శుక్రవారం) ప్రత్యేక జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని నిర్మాణ్ ఎన్జీవో సంస్థ ప్రతినిధి ప్రకాశ్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఆధ్యాత్మిక సంస్థ బ్రహ్మకుమారీస్‌తో సంయుక్తంగా నిర్వహించనున్న ఈ మేళాలో ఐటీ కంపెనీలతోపాటు ఉత్పాదక రంగం, ఐటీఈఎస్, రిటైల్, ఫార్మా, బ్యాంకింగ్, హెల్త్‌కేర్ తదితర రంగాల కంపెనీలు రిక్రూట్‌మెంట్ చేయనున్నాయని తెలిపారు. ఉదయం 8నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు అల్లాపూర్ డివిజన్ పరిధి గాయత్రీనగర్‌లోని హరిహర క్షేత్రం దేవస్థానం సమీపంలో గల ప్లాటు నంబరు.42లో జాబ్ మేళా ఉంటుందని, 91541 45734 నంబరులో సంప్రదించాలని చెప్పారు. వయసు 18నుంచి 28ఏళ్ల లోపు ఉండాలని, పదోతరగతి, ఇంటర్, డిగ్రీ ధ్రువపత్రాలు, ఆధార్, 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలని తెలిపారు.

కూకట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్‌గా గిరిధర్



మూసాపేట, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసర్(ఎస్‌ఆర్‌ఓ)గా ఎ.గిరిధర్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన బాశెట్టి సురేందర్‌ను ప్రభుత్వం నగరంలోని ఎంవీ-ఏ విభాగానికి బదిలీ చేసింది. రెండున్నర నెలల క్రితమే ఇక్కడికి వచ్చిన ఆయన తక్కువ వ్యవధిలోనే బదిలీ కావడం గమనార్హం. ఆయన స్థానాన్ని భర్తీ చేయడానికి వరంగల్ జిల్లా నర్సంపేట ఎస్‌ఆర్‌ఓను కూకట్‌పల్లికి బదిలీ చేశారు. ఆయన గురువారం కార్యాలయానికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

పట్టపగలు.. హైమాస్ట్ దీపాల వెలుగులు



అల్లాపూర్, న్యూస్‌టుడే: అల్లాపూర్ డివిజన్ పరిధి శ్రీవివేకానందనగర్ కూడలిలో మినీ హైమాస్ట్ దీపాలు పట్టపగలు వెలుగుతున్నాయి. కొన్ని రోజులుగా నెలకొన్న ఈ సమస్యపై అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చాలా చోట్ల వీధిదీపాలు పనిచేయటం లేదని, వెలగని దీపాలు మరమ్మతులు చేయడం లేదు సరేకదా, పట్టపగలు హైమాస్ట్ దీపాలు వెలుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

గ్రూప్-1 పరీక్షలకు ఏర్పాట్లు



జేఎన్‌టీయూలోని స్ట్రాంగ్‌రూమ్‌కు ప్రశ్నాపత్రాలు తీసుకొచ్చిన ట్రక్కు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: గ్రూప్-1 పరీక్షలకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. జేఎన్‌టీయూహెచ్‌లో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూమ్‌కు ప్రశ్నాపత్రాలు చేరుకున్నాయి. వీటిని పోలీసుల బందోబస్తు మధ్య అధికారులు భద్రపరిచారు. ఈ నెల 21వ తేదీ నుంచి పరీక్షలు మొదలు కానున్న విషయం తెలిసిందే.

10% స్థలాలు ఉన్నాయా? ఊడ్చేశారా?

జీహెచ్‌ఎంసీకి అప్పగించిన ప్రాంతాలపై సర్వేకు డిమాండ్

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆదేశాలతో హౌసింగ్‌బోర్డు స్థలాల సర్వే, జియో ట్యాగింగ్ శరవేగంగా జరుగుతోంది. ప్రజావసరాల కోసం హౌసింగ్‌బోర్డు ఏళ్ల క్రితం జీహెచ్‌ఎంసీకి అప్పగించిన 10శాతం స్థలాలు అందుబాటులో ఉన్నాయా లేదా అని ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. కొన్నిచోట్ల పార్కులు, క్రీడాప్రాంగణాలు, ఆలయాలు అభివృద్ధి చేశారు. పలుచోట్ల స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. ఏళ్లుగా ఇంత తంతు జరుగుతున్నా స్వాధీనం చేసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హౌసింగ్‌బోర్డు అప్పగించిన స్థలాలపై జీహెచ్‌ఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకే స్పష్టత లేకపోవడం గమనార్హం.



కేపీహెచ్‌బీ రమ్య మైదానం పక్క రోడ్డులో స్థలం

గుడి, బడి, ఆహ్లాదం కోసమే...

హౌసింగ్‌బోర్డు లేఅవుట్ ప్రకారం ఫేజ్‌లవారీగా గుడి, బడి, ఆహ్లాదం కోసమే స్థలాలను 25ఏళ్లకు ముందే జీహెచ్‌ఎంసీకి అప్పగించామని హౌసింగ్‌బోర్డు అధికారులు చెబుతున్నారు. కాలనీ అభివృద్ధి చెందుతున్న తొలినాళ్లలో పూర్తిగా జనావాసాలే ఉండేవి. క్రమేణ వ్యాపారాలు జోరందుకున్నాయి. ఈ క్రమంలో 10శాతం స్థలాలను ఆనుకుని భవన యజమానులు ఆ స్థలాలను వ్యాపారాలకు అద్దెకిచ్చి సొమ్ము చేసుకుంటుండటంతో గుడి, బడి, ఆహ్లాదం ఉద్దేశం నీరుగారింది. హైటెక్ సిటీ, మెట్రోరైలు.. ఇలా ఒక్కొక్కటిగా వస్తుండటంతో ఈ ప్రాంతాల్లోని భూమికి ఊహించని డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ అధికారులు 10శాతం స్థలాలను సర్వే చేసి ప్రజావసరాలకు వినియోగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఫేజ్‌లవారీగా అప్పగించిన 10% స్థలాలు (ఎకరాల్లో)

ఫేజ్	విస్తీర్ణం	10% స్థలం
దర్గారెడ్డి ఫేజ్-1	21.087	2.212
దర్గారెడ్డి ఫేజ్-2	15.59	1.60
కేపీహెచ్‌బీ ఫేజ్ 1, 2	222.97	22.32
ఫేజ్-3	38.375	4.69
ఫేజ్-4	61.88	6.15
ఫేజ్-5	55.34	6.03
ఫేజ్-6	91.15	9.15
ఫేజ్-7	34.54	3.65
ఫేజ్-9	61.19	6.48
ఫేజ్-14	50.02	5.03
ఫేజ్-15	54.29	5.65

సర్వే చేస్తాం

మల్లేశ్వర్, పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ

హౌసింగ్‌బోర్డు అప్పగించిన స్థలాలు ఎక్కడెక్కడున్నాయో తెలుసుకునేందుకు హౌసింగ్‌బోర్డు నుంచి వివరాలు తీసుకుని సర్వే చేస్తాం. స్థలాలకు రక్షణ కల్పించి ప్రజావసరాలకే వినియోగిస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

వివరాలు తెలపాల్సింది.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకే

కూకట్‌పల్లి, బాలానగర్, ఓల్డ్‌బోయిన్‌పల్లి, బాలాజీనగర్: 8008573418
కేపీహెచ్‌బీకాలనీ:8008573195, మూసాపేట:8008573423, అల్లాపూర్:9491124918

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు



మూసాపేట, న్యూస్‌టుడే: మోతీనగర్ ప్రధాన రహదారి సమీపంలోని రాయుడు హోటల్ వద్ద భూగర్భ మ్యాన్‌హోల్ వ్యవస్థ ధ్వంసమైంది. మురుగు రహదారిలో ప్రవహిస్తుండటతో రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నారు. వారం రోజులుగా కొనసాగుతున్న ఈ సమస్యపై ‘ఈనాడు’ జలమండలి ప్రాంతీయ మేనేజర్ విలియమ్స్ ప్రకాష్ దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన ఆయన గురువారం దానికి మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించారు.

మూత పునరుద్ధరణ



కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి డివిజన్ పరిధి మెట్రో క్యాష్ అండ్ క్యారీ వెనుక రోడ్డులో మంజీరా స్లూయిజ్‌వాల్వ్ మ్యాన్‌హోల్ మూత కుంగి ప్రమాదకరంగా మారింది. రాకపోకలకు వాహనదారులు ఇబ్బంది పడుతూ వస్తున్నారు. ఈ విషయాన్ని జలమండలి అధికారుల దృష్టికి ‘ఈనాడు’ తీసుకెళ్లగా వారు సత్వరమే స్పందించి సిబ్బందితో మరమ్మతులు చేయించి మూత పునరుద్ధరించి సమస్యను పరిష్కరించారు.

రోడ్డును నిర్మించారు.. వ్యర్థాలు మరిచారు!



నాలా వైపు వెళ్లే మార్గంలో..



వసుంధరా ఆసుపత్రి నుంచి వచ్చేమార్గంలో..

మూసాపేట, న్యూస్‌టుడే: ఎదైనా అభివృద్ధి చేపడితే అది వినియోగంలోకి వచ్చేసరికి అక్కడి వ్యర్థాలను తొలగించాల్సిన బాధ్యత గుత్తేదారుడిపై ఉంటుంది. అయితే, మూసాపేట పరిధిలో రోడ్డు నిర్మాణం పూర్తయినా వ్యర్థాలను మాత్రం తొలగించడం లేదు. రెండు నెలలుగా ఈ దుస్థితి కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. బాలాజీనగర్ డివిజన్‌లోని ముంబయి జాతీయ రహదారి నుంచి వసుంధరా ఆసుపత్రి రోడ్డులోని కల్వర్టు పక్క నుంచి ప్రగతినగర్ రోడ్డు నంబరు-8 మార్గం ఉంది. కల్వర్టు పక్కన మిగిలిపోయిన రోడ్డు నిర్మాణం కోసం అధికారులు 6 నెలల క్రితం పనులు ప్రారంభించారు. ఆ రోడ్డు విషయంలో ప్రైవేటు వ్యక్తి తెరమీదకు రావడంతో నాలుగు నెలల పాటు తవ్వకాల్ని వదిలేశారు. దీనిపై ‘ఈనాడు’లో వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు రెండు నెలల క్రితం అక్కడ సిమెంట్ రోడ్డు నిర్మించారు. రోడ్డు కోసం 6 నెలల క్రితం చేపట్టిన తవ్వకాలకు సంబంధించిన వ్యర్థాలను రోడ్డుకు ఇరువైపులా కుప్పలుగా పోసి వదిలేశారు. రాకపోకలకు అవరోధంగా మారాయి. ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి వ్యర్థాలను తొలగించాలని పరిసర వాసులు కోరుతున్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్


ఓపెన్ జిమ్ ఏర్పాటుకు చర్యలు

బాలానగర్, న్యూస్‌టుడే: ఓపెన్ జిమ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. గురువారం ఓల్డ్‌బోయిన్‌పల్లి పీవీ ఎన్‌క్లేవ్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటు స్థలాన్ని పరిశీలించారు. పాత సామాజిక భవనానికి మరమ్మతులు చేయలన్నారు. ఏఈ ఆశ, కాలనీవాసులు నారాయణ, వేణుగోపాల్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జేఎన్‌టీయూలో యోగాసనాల పోటీలు

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: విశ్వమానవతా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 19న జేఎన్‌టీయూ మైదానంలో యోగ సూర్యనమస్కారాల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు పోటీలుంటాయన్నారు.

ప్రాంగణ నియామకాల్లో సత్తాచాటిన విద్యార్థులు



పి.సనితారెడ్డి, కె.సాయిహేమంత్ నారాయణ్, ఎస్.గ్రీష్మా, బి.స్ఫూర్తి, కె.శ్రీఉమాదేవి



హెచ్.కేశరాజు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రాంగణ నియామకాల్లో సత్తాచాటారు. తాజాగా జరిగిన ఇన్ఫోసిస్ నియామకాల్లో ఆరుగురు రూ.9.5లక్షల చొప్పున ప్యాకేజీతో ఎంపికయ్యారు. మొత్తం బీటెక్ నుంచి 234, ఎంటెక్, ఎంసీఏ నుంచి 249మంది ఇన్ఫోసిస్‌కు దరఖాస్తు చేసుకోగా ఇందులో సీఎస్‌ఈ నుంచి పి.సనితారెడ్డి, కె.సాయిహేమంత్‌నారాయణ్, ఎస్.గ్రీష్మా, హెచ్.కేశరాజు, సీఎస్‌ఈ ఐడీపీ నుంచి బి.స్ఫూర్తి, ఎంసీఏ నుంచి కె.శ్రీఉమాదేవి ఉద్యోగాలు సాధించారు.

వాల్మీకి జయంతి



కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాప్‌లో గురువారం వాల్మీకి జయంతి నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రమేశ్ హాజరై నివాళులర్పించారు. నేతలు, కార్యకర్తలున్నారు.

19.7టన్నుల వ్యర్థాలు తొలగింపు



కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి జోన్ పరిధిలో గురువారం మొత్తం 19.7టన్నుల వ్యర్థాలను తొలగించారు. కూకట్‌పల్లి, మూసాపేట, అల్వాల్ సర్కిళ్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్ల పక్కన పేరుకున్న చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు, చెట్లకొమ్మలు తీశారు. మొదటి ఫేజ్‌లో కార్యక్రమం ఈ నెల 23వ తేదీ వరకు కొనసాగుతుందని జోన్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ డీసీ ఉదయ్‌కుమార్ చెప్పారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు.. గంజాయికి బానిసలు

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: వారంతా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే. ప్రముఖ కంపెనీల్లో ఆకర్షణీయమైన జీతం అందుకుంటున్నారు. కానీ, గంజాయికి బానిసై జైలు పాలయ్యారు. కేపీహెచ్‌బీ ఎస్సై సుమన్ వివరాల ప్రకారం..గురువారం కేపీహెచ్‌బీ అయిదోఫేజ్ డీమార్ట్ సమీపంలోని ఖాళీస్థలంలో పలువురు యువకులు గంజాయి పొట్లాలతో ఉన్నారన్న సమాచారంతో బాలానగర్ ఎస్వోటీ పోలీసులు చేరుకున్నారు. యువకులు పారిపోయేందుకు యత్నించగా పట్టుకుని కేపీహెచ్‌బీ పోలీసులకు అప్పగించారు. పనిఒత్తిడి నుంచి ఉపశమనం కోసమే గంజాయి తాగుతున్నట్లు పోలీసులకు వారు చెప్పడం గమనార్హం. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన తోరటి రాజేశ్(24), కొత్తపల్లి మండలానికి చెందిన నక్కా నాగవంశీ(23), రాజమండ్రి టౌన్ పరిధికి చెందిన తంగెళ్ల రమేశ్‌కృష్ణ(27), పల్నాడు జిల్లాకు చెందిన జంపని సాయిగోపి విహారి(26) సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. వీరు కైత్లాపూర్‌లో, మూడోఫేజ్‌లోని వసతిగృహాల్లో ఉంటున్నారు. కొంతకాలంగా వీరు గంజాయి తాగుతూ తెల్లకాగితాల్లో చుట్టి విక్రయిస్తున్నారు. రాజేశ్ తూర్పుగోదావరి నుంచి గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తుంటాడు. బీటెక్ చదివే రోజుల్లోనే గంజాయికి అలవాటు పడ్డ రాజేశ్ మిగతావారికి అలవాటు చేశాడు. పోలీసులు నిందితుల నుంచి సుమారు 1300గ్రాముల గంజాయి, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.



గంజాయితో పట్టుబడ్డ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి అదృశ్యం



మూసాపేట, న్యూస్‌టుడే: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యమైన ఘటన కూకట్‌పల్లి ఠాణా పరిధిలో జరిగింది. ఎస్సై రామకృష్ణగౌడ్ తెలిపిన ప్రకారం..అంబర్‌పేట పరిధి రాంరెడ్డినగర్‌లోని రోడ్డు నంబరు-6కు చెందిన **మహ్మద్ ఫయాజ్**(48) కూలీగా పనిచేస్తుంటారు. కూకట్‌పల్లి భాగ్యనగర్‌కాలనీలోని కావ్యా ఆసుపత్రి ఎదురుగా ఉన్న భవనం వద్దకి ఈ నెల 15న వచ్చి రాత్రి అక్కడే పడుకున్నాడు. 16న ఉదయం లేచి చూసేసరికి కన్పించలేదు. అంతటా వెతికిన కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- మూసాపేట పరిధి ప్రగతినగర్‌కు చెందిన గొట్టిపల్లి సాయికుమార్(23) తండ్రి వద్ద కాంట్రాక్టు పనులు పర్యవేక్షిస్తుంటాడు. 16న మధ్యాహ్నం నుంచి కన్పించకుండా పోయాడు. తండ్రి మన్మధరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.



సాయికుమార్

బాలానగర్: మానసిక పరిస్థితి సరిగాలేని వ్యక్తి అదృశ్యమైన ఘటన బాలానగర్ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..టీఐఈ బాలానగర్‌కు చెందిన మొహమ్మద్ తౌఫిక్ హుస్సేన్(42) కొంతకాలంగా మానసిక పరిస్థితి సరిగా లేక మందులు వాడుతున్నాడు. ఈ నెల 13న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో అతని తమ్ముడు అహ్మద్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



మొహమ్మద్ తౌఫిక్ హుస్సేన్

ముందుకు కదలక.. వాహనాల నత్తనడక



వై జంక్షన్‌లో మెట్రోస్టేషన్ కింద నిలిచిన వాహనాలు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి జాతీయ రహదారిపై కొన్ని రోజులుగా ట్రాఫిక్ ఇబ్బందులు పెరిగాయి. వాస్తవంగా ఇటీవల కొంత పరిస్థితిలో మార్పు వచ్చినట్లు కనిపించినా.. తాజాగా మళ్లీ సమస్య పునరావృతమైంది. పలు యూటర్న్‌లలో సమస్య కనిపిస్తున్నప్పటికీ.. ముఖ్యంగా వై జంక్షన్‌లో తలెత్తుతున్న ట్రాఫిక్ ఇబ్బంది.. అత్యంత సమస్యాత్మకంగా మారుతుంది. గురువారం కూడా ఈ సమస్య కొనసాగింది. కూకట్‌పల్లి బస్టాపు నుంచి వై జంక్షన్ వరకు వాహనాలు బారులు తీరి కనిపించాయి. దీంతో గంటల కొద్ది ట్రాఫిక్‌లో గడపాల్సి వచ్చింది. నత్తకడన వాహనాలు ముందుకు సాగుతుండడంతో వెనుక వచ్చే వాహనాల క్యూ పెరుగుతూ వెళ్లింది. ట్రాఫిక్ సిబ్బంది రోడ్లపై ఉన్నా.. నియంత్రించలేక నానాయాతన పడడం గమనార్హం. వై జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్య నియంత్రణకు ఉన్నతాధికారులు చొరవ చూపాల్సి ఉంది. సిగ్నల్ సమయంలో కొంత మార్పు చేసి రద్దీగా ఉండే వైపు ఎక్కువ సేపు వాహనాలను వదిలేలా ఏర్పాట్లు చేస్తే కొంత ఉపశమనం లభించే వీలుందని పలువురు సూచిస్తున్నారు.



కూకట్‌పల్లి బస్టాపు నుంచి జాతీయ రహదారిపై బారులు

పర్యవేక్షణ లోపం.. ప్రమాదకరంగా నిర్మాణం

జేఎన్‌టీయూలో వేగ నియంత్రికల కహానీ

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: వేగ నియంత్రికలు.. వీటిని ఎక్కడ పడితే అక్కడ.. ఎలా పడితే అలా నిర్మించకూడదు. అవసరమైన చోట్ల ఇండియన్ రోడ్ కాంగ్రెస్(ఐఆర్‌సీ) నిబంధనలకు అనుగుణంగానే ఏర్పాటుచేయాల్సి ఉంటుంది. నిబంధనలు పాటించకపోతే ప్రమాదాలను ఆహ్వానించినట్లే. వీటి నిర్మాణంలో తప్పిదాలు జరగడంపై పలుమార్లు కోర్టులు అధికారులపై అక్షింతలు వేసిన ఉదంతాలు సైతం ఉన్నాయి. కోర్టుల జోక్యంతో వేగ నియంత్రికలను తొలగించిన ఘటనలు సైతం వెలుగుచూశాయి. ఇక్కడ అందరూ ఇంజినీర్లే ఉన్న సాంకేతిక విశ్వవిద్యాలయం ఆవరణలో వేగ నియంత్రికల నిర్మాణంలో తప్పిదం జరగడం విమర్శలకు తావిస్తోంది. రెక్టార్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో నిర్మించిన వాటి తొలగింపు చర్యలకు శ్రీకారం జరగడం గమనార్హం.



వేగ నియంత్రికను పొక్లెయిన్‌తో తవ్వకం

ప్రమాదాలను నివారించేందుకు

జేఎన్‌టీయూలో ఇటీవల వరుస రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. క్యాంటీన్ ఎదుట ఓ విద్యార్థి వేగంగా కారు నడిపి పలువురిని ఢీకొట్టడంతో ఓ విద్యార్థినికి తీవ్ర గాయాలవ్వగా.. మరో ఇద్దరు త్రుటిలో తప్పించుకున్నారు. మరికొందరు విద్యార్థులు తప్పతాగి డ్రైవర్‌తో క్యాంపస్‌లోకి వచ్చి ప్రమాదాలకు కారణమయ్యారు. గతంలోనూ పలుమార్లు ప్రమాదాలు త్రుటిలో తప్పాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని వేగ నియంత్రికల నిర్మాణానికి అధికారులు ఆదేశాలు జారీచేశారు. ఇంజినీరింగ్ విభాగం అధికారులు మొత్తం క్యాంపస్‌లో ఏర్పాటుచేయాల్సిన వేగ నియంత్రికలకు సంబంధించి రూ.4లక్షలు ఆమోదం తీసుకొని గుత్తేదారుకు పనులు అప్పగించారు. ఐదారుచోట్ల నిర్మాణం జరిగింది. వీటి నిర్మాణంలో ఐఆర్‌సీ నిబంధనల ప్రకారమే.. ఎత్తు, వెడల్పు, రేడియస్ ఉండేలా చూసుకోవాలి. కానీ, ఇదేమీ లేకుండా ఇంజినీర్ల పర్యవేక్షణ లోపం కారణంగా గుత్తేదారు ఇష్టానుసారం ప్రమాదకరంగా నిర్మించాడు. ఒక్కటి మాత్రం సక్రమంగా ఉండగా.. మిగతా వాటితో ఇప్పటికే పలువురు కింద పడ్డారు.

రెక్టార్ ఆగ్రహంతో దిద్దుబాటు చర్యలు

రెక్టార్ డాక్టర్ కె.విజయ్‌కుమార్‌రెడ్డి వేగ నియంత్రికల నిర్మాణంలో జరిగిన తప్పిదాలను గుర్తించి ఇంజినీరింగ్ విభాగం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కారు కింది భాగంలో నియంత్రికకు తగలడం.. వాహనాలు స్కిడ్ అవుతుండడం.. నిబంధనలు తుంగలో తొక్కడాన్ని ప్రశ్నించారు. రేడియం స్టిక్కర్లు అతికించాలి. హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలి. వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా స్లోప్ ఉండాలి. వాటిని తొలగించి నిబంధనలు పాటిస్తూ ఏర్పాటుచేయాలని రెక్టార్ ఆదేశించడంతో ఆఘమేఘాల మీద గురువారం దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టారు.

తప్పిదాన్ని సరిచేయిస్తున్నాం: వెంకటేశ్వరరెడ్డి, సీఈ

వేగ నియంత్రికల నిర్మాణంలో తప్పిదం జరిగింది. ఎత్తు ఎక్కువగా ఉండడంతో సమస్యాత్మకంగా మారినట్లు గుర్తించాం. వాటిని సరిచేయిస్తున్నాం. స్లోప్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. పర్యవేక్షణ లోపంతోనే ఇది జరిగిందని ప్రశ్నించగా.. నిర్మించిన తర్వాత ఏఈ చూశారని సమాధానమిచ్చారు.


గ్రామీణ బాలికలకు ల్యాప్‌టాప్‌ల వితరణ

మాదాపూర్: రాయదుర్గంలోని క్లారనెట్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ రూ.32 లక్షలు విలువచేసే 25 అత్యాధునిక ల్యాప్‌టాప్‌లను విరాళంగా ఇచ్చింది. పీపుల్ ఫర్ అర్బన్ అండ్‌రూరల్ ఎడ్యుకేషన్(ప్యూర్) స్వచ్ఛంద సంస్థ ద్వారా వీటిని గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు అందించనున్నారు. హోమ్ సర్వీస్‌తో పూర్తి వారంటీ ఉన్న ఈ ల్యాప్‌టాప్‌లు విద్యార్థినులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని క్లారనెట్ హెచ్‌ఆర్ విభాగం హెడ్ సృజని చౌదరి తెలిపారు. కంపెనీ ఫైనాన్స్ హెడ్ సయ్యద్ వాసే, ఐటీ అండ్ సెక్యూరిటీ ఇన్‌ఛార్జ్ అక్షయ్, ప్యూర్ సంస్థ ప్రతినిధి అరుణ పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి

•శేరిలింగంపల్లి •పటాన్‌చెరు

యువత రాజకీయాల్లోకి రావాలి: ఎంపీ


మాట్లాడుతున్న ఎం.కె.ప్రేమచంద్రన్

పటాన్‌చెరు: జాతి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో విద్యార్థుల పాత్ర కీలకమని కొల్లం (కేరళ) పార్లమెంటు సభ్యుడు ఎన్.కె. ప్రేమచంద్రన్ అన్నారు. గురువారం రుద్రారంలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన గీతం చేంజ్ మేకర్స్ కార్యక్రమంలో మాట్లాడారు. యువత రాజకీయాల్లోకి రావాలని, విముఖత చూపడం సరి కాదన్నారు. చదువుకుంటున్న సమయంలోనే విద్యార్థులకు పార్లమెంటరీ వ్యవహారాలపై అవగాహన పెంచాలన్నారు. తద్వారా రాజకీయ వ్యవస్థలు బలోపేతం అవుతాయని తెలిపారు. మూడు దశాబ్దాల కాలంలో వార్డు సభ్యుడి నుంచి ఎమ్మెల్యే, మంత్రి, అయిదుసార్లు లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికయ్యానని చెప్పారు. గీతం అధ్యక్షుడు శ్రీ భరత్, సమన్వయకర్త చంద్రశేఖర్, అదనపు ఉపకులపతి డి.ఎస్.రావు పాల్గొన్నారు.

సామాజిక చైతన్యంలో రచయితలు కీలకం


మాట్లాడుతున్న జగదీశ్వర్ గౌడ్

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: సమాజంలో రచయితలు, కవులు, కళాకారుల పాత్ర కీలకమని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి జగదీశ్వర్ గౌడ్ అన్నారు. నల్లగండ్లలో శేరిలింగంపల్లి సాహితీ సాంస్కృతిక కళా సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం కవి సమ్మేళనం, ఇష్టాగోష్ఠి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ... సమాజాన్ని చైతన్యవంతం చేయడంలో రచయితల పాత్ర ఎంతో ఉందన్నారు. సమితి గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఆలపాటి, అధ్యక్షులు మోటూరి నారాయణరావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవీంద్రనాథ్, గనుల శాఖ విశ్రాంత డైరెక్టర్ రాజగోపాల్, రామస్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సర్కిల్ కార్యాలయంలో వాల్మీకి జయంతి

మాదాపూర్, న్యూస్‌టుడే: చందానగర్ సర్కిల్ కార్యాలయంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. ఉప కమిషనర్ పి.మోహన్‌రెడ్డి వాల్మీకి చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఇంజినీరింగ్ విభాగం ఈఈ రాజు, ఏఎంసీ విజయ్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వ నమోదు

చందానగర్, న్యూస్‌టుడే: చందానగర్‌లో గురువారం భాజపా సభ్యత్వ నమోదు చేపట్టారు. పీజేఆర్ స్టేడియం ముందు బీజేవైఎం నాయకుడు మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రవి కుమార్‌యాదవ్ పాల్గొన్నారు. పలువురికి సభ్యత్వ రసీదులు అందజేశారు.

రికార్డులు సాధించిన యువకుడికి ఎమ్మెల్యే సత్కారం

వివేకానందనగర్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌కు చెందిన సుజిత్‌మోహన్‌ను గురువారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అభినందించారు. అనాథ పిల్లలు, పాఠశాలల్లో నిరుపేద విద్యార్థుల చదువు కోసం సాయం చేస్తున్నందుకు నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి భారత్ విభూషణ్ అందుకోవడం, లండన్ బుక్ ఆఫ్ రికార్డు సాధించడం, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో ముంబయి యూరో ఏషియన్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నందుకు సుజిత్‌మోహన్‌ను సత్కరించారు. ● ఎంఏజీకాలనీకి చెందిన సాయినాథ్‌కు రూ.18వేల సీఎం సహాయ నిధి చెక్కును గురువారం ఎమ్మెల్యే అందజేశారు.

ఇళ్ల స్థలాల దరఖాస్తుల స్వీకరణ

చందానగర్: సొసైటీలతో సంబంధం లేకుండా పని చేసే జర్నలిస్టులను గుర్తించి వారికి ఇళ్ల స్థలాలు వచ్చేలా యూనియన్ పనిచేస్తుందని టీయూడబ్ల్యూజే-ఐజేయూ రాష్ట్ర కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం చందానగర్ పీజేఆర్ స్టేడియంలో శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో మాట్లాడారు. క్లబ్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు సలీంపాషా పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

రామచంద్రాపురం రూరల్: శ్రీనివాస్‌నగర్ కాలనీ బస్సు రూట్‌లో , కాకతీయనగర్ కాలనీల్లో సీసీ రోడ్లు వేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. గురువారం డివిజన్ కార్యాలయంలో అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. బాలవిహార్ పార్క్ అభివృద్ధి పనులు, జ్యోతి నగర్ కాలనీలో బాక్స్ డ్రెన్ నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మయూరినగర్ కాలనీలో సీసీ రోడ్డు ఏర్పాటుకు రూ.61.50 లక్షలు మంజూరైనట్లు చెప్పారు.

చిత్రామృతం సంగీత విభావరి డిసెంబరు 22న

మాదాపూర్: ప్రముఖ గాయని కె.ఎస్.చిత్ర 45 ఏళ్ల సినీ రంగ ప్రస్థానాన్ని పురస్కరించుకొని డిసెంబరు 22న మాదాపూర్ శిల్పకళావేదికలో చిత్రామృతం పేరిట సంగీత విభావరి నిర్వహించనున్నారు. ఎమ్ 3 ఎంటర్‌టైన్‌మెంట్, ఎన్‌ఛాంట్ మీడియా సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో గురువారం గాయని చిత్ర, సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్, గాయకుడు శ్రీకృష్ణ ఆవిష్కరించారు. తొలుత ఇండియన్ ఐడల్ తెలుగు గాయకులు రజని, ధృతి, రజనీపూర్ణిమ, కీర్తన, శ్రీకీర్తి, వల్లభ, కుశాల్, సాయిమాధవ్ పాడిన సినీ గీతాలు శ్రోతలను అలరించాయి.

విస్తరణ వేగంగా.. ట్రాఫిక్ ఇక సజావుగా

న్యూస్‌టుడే, శేరిలింగంపల్లి

శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో అతి పెద్ద సవాలుగా మారిన సమస్య ట్రాఫిక్. అనేక ప్రాంతాల నుంచి వస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు వేలాదిమంది నిత్యం ట్రాఫిక్ చట్రంలో చిక్కుకొని అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలో పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవడంపై యంత్రాంగం దృష్టి సారించడంతో అనేక సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న అభివృద్ధి పనులు కొన్ని ప్రారంభమయ్యాయి. మరి కొన్నింటిని మొదలుపెట్టాల్సి ఉంది. వీటిని త్వరగా పూర్తి చేసేందుకు జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, ఇతర అధికారులు కృషి చేస్తున్నారు.

మాదాపూర్-కె.పి.హెచ్.బి. రోడ్డు

తీవ్ర ట్రాఫిక్ రద్దీని ఎదుర్కొంటున్న మార్గాల్లో ఇది ఒకటి. ఈ రోడ్డును విస్తరించాలని వేల మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎంతోకాలంగా కోరుతున్నారు. ఎట్టకేలకు పనులు ఆరంభమయ్యాయి.


మాదాపూర్-కేపీహెచ్‌బీ మార్గంలో మొదలైన పనులు

శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం ఎదురుగా ఉన్న మసీద్‌బండ చౌరస్తా ప్రాంతాన్ని విస్తరించాల్సిన అవసరాన్ని 'ఈనాడు' ఇటీవలే కార్పొరేషన్ అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లింది. ఈ క్రమంలో ఇక్కడ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం వేగంగా కొనసాగుతున్నాయి.

గచ్చిబౌలి డీఎల్ఎఫ్ చౌరస్తా, మల్కం చెరువు ఎదురు ప్రాంతాల్లో అభివృద్ధి చేయడానికి పనులు మొదలుపెట్టారు. తద్వారా ట్రాఫిక్ సమస్యలు చాలా వరకు కొలిక్కి వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఈ రహదారి నిర్మాణం పూర్తయితే...

చందానగర్ ఎంఎంటీఎస్ స్టేషన్ పక్కన పాపిరెడ్డి కాలనీ వైపు రహదారి ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. త్వరగా పనులు మొదలై రోడ్డు నిర్మాణం పూర్తయితే లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద వాహనాల రద్దీ కొంత తగ్గనుంది.


కొనసాగుతున్న మసీద్‌బండ చౌరస్తా అభివృద్ధి

గుల్‌మొహర్ పార్క్ కాలనీ చౌరస్తా అభివృద్ధికి తొలగని అడ్డంకులు..

ఈ చౌరస్తా అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేశారు. సర్వే నిర్వహించడం, స్థానికులతో చర్చించడం తదితర అన్ని ప్రక్రియలు పూర్తయ్యాయి. ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోని కారణంగా విస్తరణకు అడుగులు ముందుకు పడటం లేదు. వారు చొరవ చూపితేనే ఈ చౌరస్తా అభివృద్ధి జరిగి ట్రాఫిక్ అవస్థల నుంచి వాహనదారులకు విముక్తి లభించనుంది. ఇదే విధంగా పలు రహదారులు, చౌరస్తాలకు సంబంధించి గతంలో తీసుకున్న నిర్ణయాలు అమలు చేస్తే సజావుగా వాహనాలు రాకపోకలు సాగే వీలుంటుంది.

సమస్యల పరిష్కారానికి సహకరించండి: ఎమ్మెల్యే


బీహెచ్‌ఈఎల్ ఈడీ ధరణి రాజాకు వినతిపత్రమిస్తున్న మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం రూరల్, న్యూస్‌టుడే: తెల్లాపూర్ మున్సిపాలిటీలోని భారతి నగర్ డివిజన్ పరిధిలో ఉంటున్న ప్రజల రాకపోకల విషయంలో బీహెచ్ఈ ఎల్ ఎస్టేట్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి గురువారం కంపెనీ ఈడీ ధరణి రాజా బృందంతో సమావేశమై ఈ అంశంపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లోని ఎంఐజీ కాలనీ ముఖద్వారం ఏర్పాటు, మురుగు పైపులైన్ నిర్మాణ విషయంలో అభ్యంతరం, విద్యుత్‌నగర్ నుంచి అన్నమయ్య కాలనీ మీదుగా ఉన్న రోడ్డును మూసేయడం, అంతర్గత రోడ్ల మరమ్మతులు విషయంలో అడ్డంకుల వంటి సమస్యలతో అభివృద్ధి చేయడం కష్టమన్నారు. ఇప్పటికైనా బీహెచ్ఈఎల్ అధికారులు సహకారం అందించాల్సిన అవసరం ఉందని వివరించినట్లు తెలిపారు. మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు రాములు గౌడ్. మాజీ సర్పంచి సోమిరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రయాణ ప్రాంగణం గుంతలమయం


పటాన్‌చెరు బస్టాండ్ స్వాగత ద్వారం వద్ద ఇదీ పరిస్థితి. రాకపోకల వేళ బస్సులు కుదుపునకు గురవు తున్నాయి. ప్రయాణికుల తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

దారిని ముంచెత్తిన మురుగు



వరద, మురుగు కలిసి తెల్లాపూర్ మున్సిపల్ పరిధి రేడియల్ రోడ్డుపై నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారుల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. మరోవైపు దుర్గంధం వెలువడుతుండటంతో అటుగా వెళ్లే వారి వెతలు వర్ణనాతీతంగా మారాయి.

– న్యూస్‌టుడే, రామచంద్రాపురం రూరల్

కొత్తగూడలో బోనాల సమర్పణ


ఊరేగింపుగా వస్తున్న మహిళలు

మాదాపూర్, న్యూస్‌టుడే: కొత్తగూడ గ్రామంలో నిర్వహిస్తున్న నాభిశిల ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా గురువారం బోనాలు సమర్పించారు. ప్రతి ఇంట్లో బోనం సిద్ధం చేసి మహిళలంతా ఊరేగింపుగా నాభిశిల వద్దకు చేరుకొని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పటం వేయడం, రంగం ఎక్కే కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

శేరిలింగంపల్లి: 8008573411 మాదాపూర్: 8008573414
మియాపూర్- 7569067467 ఆల్విన్‌కాలనీ -9154945201
రాయదుర్గం - 9848990352,
పటాన్‌చెరు(రూ) - 8008573228
చందానగర్ - 8008555322

రామచంద్రాపురం రూరల్, పటాన్‌చెరు అర్బన్, ఆల్విన్ కాలనీ, శేరిలింగంపల్లి, చందానగర్, న్యూస్‌టుడే

? తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి రేడియల్ రహదారి పక్కన నల్లగండ్ల నుంచి వచ్చే మురుగునీరు నిలిచి దుర్వాసన వెలువడుతోంది. కాలువలోకి మళ్లించే ఏర్పాటు చేయాలి. –శ్రీనివాస్‌రావు, తెల్లాపూర్ గ్రామస్థుడు

✓ పైప్‌లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మురుగు శుద్ధి ప్లాంట్ ఏర్పాటు తర్వాత మళ్లింపు జరుగుతుంది. – సంగారెడ్డి, కమిషనర్

? రేషన్‌కార్డు చాలాకాలంగా ఉన్నప్పటికీ అందులో పుట్టిన పిల్లలు చేర్చక పదేళ్లపైనే అవుతుంది. చేర్చేలా చర్యలు తీసుకోవాలి.
–బేబి, పటాన్‌చెరు

✓ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే పేర్ల నమోదుకు చర్యలు చేపడతాం. –రంగారావు, తహసీల్దార్

? ధరణి నగర్ కాలనీలో వీధి కుక్కల సమస్య ఎక్కువగా ఉంది. ఒంటరిగా రోడ్డుపై వెళుతున్న వారిపై దాడి చేస్తున్నాయి.
– ప్రసాద్, స్థానికుడు

✓ కాలనీలో పర్యటించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటాం. – నాగార్జున, బల్దియా వైద్యాధికారి

? చందానగర్ ఎమ్మెన్నార్ స్కూల్ ఎదురు ప్రాంతంలో కోతులు బెడద ఎదుర్కొంటున్నాం. –సుజాత, చందానగర్.

✓ పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. –విల్సన్, వెటర్నరీ అధికారి

? చందానగర్ వేమనరెడ్డి కాలనీలో మళ్లీ కోతులు గుంపులుగా చేరి ఇబ్బంది పెడుతున్నాయి. – సుజాత, చందానగర్

✓ వెంటనే చర్యలు తీసుకుంటాం – అబ్దుల్ బాసిత్, వెటర్నరీ ఆఫీసం

గంజాయి రవాణా కట్టడికి పకడ్బందీ చర్యలు: ఎస్పీ

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో గంజాయి రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ రూపేష్ హెచ్చరించారు. జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి రవాణా, హస్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మనూరు మండలం డొవ్వూరు కూడలి వద్ద టీఎస్-న్యాబ్ పోలీసులు, మనూరు ఎస్సై, సిబ్బంది కలిసి వాహనాలు తనిఖీ చేయగా, కారు డిక్కీలో 40 కిలోల ఎండు గంజాయి లభించింది. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నాం. బీదర్ జిల్లా బసవేశ్వర్ చౌక్‌కు చెందిన మల్లగొండగా గుర్తించాం. చోరీ కేసుల్లో బీదర్ జిల్లాలో జైలుకు వెళ్లాడు. ఆ సమయంలో ఒడిశాకు చెందిన రాహుల్ చక్రవర్తి, బాల్కికి చెందిన మల్లేశ్ యాదవ్, మహారాష్ట్రకు చెందిన దాదా పాటిల్‌తో పరిచయం ఏర్పడింది. జైలు నుంచి ఇటీవల బయటకు వచ్చారు. సెప్టెంబరులో జహీరాబాద్ సమీపంలోని చిరాగ్‌పల్లిలో 140 కిలోల ఎండు గంజాయి తరలించే క్రమంలో తప్పించుకున్నట్లుగా మల్లగొండ నేరం అంగీకరించడంతో, రిమాండ్‌కు తరలించామన్నారు. మిగతా వారికోసం గాలింపు చేపట్టామన్నారు.

హష్ ఆయిల్ స్వాధీనం: బీరంగూడ వేంకటేశ్వర ఆలయం సమీపంలో హష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వివరించారు. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై విజయ్‌రావు ఘటన స్థలానికి చేరుకుని కోయిలకండ్ల అఖిలేష్, అమీన్‌పూర్‌కు చెందిన మంద్రగుట్టి ప్రేమ్, ముత్తంగి వాసి దాసుసాయి శివను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. వీరు కళాశాల విద్యార్థులే లక్ష్యంగా హష్ ఆయిల్‌ను సరఫరా చేస్తున్నట్లు తేలింది. జిల్లాలో అక్రమంగా గంజాయి సాగు చేసినా, రవాణా చేసిన 87126 56777 నంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు.




కూడళ్ల చెంత.. ప్రమాదాల చింత

తెల్లాపూర్ పరిధిలోని అవుటర్ కూడళ్ల వద్ద గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. కొల్లూరు జంక్షన్ కూడలిలో వరద కాలువపై కప్పు రోడ్డుకు సమాంతరంగా వేయకపోవడంతో.. మలుపు తిరిగే సమయంలో అజాగ్రత్తగా ఉంటే ప్రమాదం తప్పదు. ముత్తంగి జంక్షన్ నుంచి పోచారం వైపు వెళ్లే సర్వీస్ రోడ్డు ప్రారంభంలో ఎడమ వైపు పెద్ద గుంత ఏర్పడింది. వేగంగా వాహనం వెళ్తే ఒకవైపు ఒరిగిపోయే ప్రమాదం ఉంది.
– న్యూస్‌టుడే, రామచంద్రాపురం రూరల్

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు.. గంజాయికి బానిసలు

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: వారంతా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే. ప్రముఖ కంపెనీల్లో పనిచేస్తూ ఆకర్షణీయమైన జీతం అందుకుంటున్నారు. కానీ, గంజాయికి బానిసలై జైలు పాలయ్యారు. కేపీహెచ్‌బీ ఎస్సై సుమన్ వివరాల ప్రకారం..గురువారం మధ్యాహ్నం కేపీహెచ్‌బీ అయిదోఫేజ్ డీమార్ట్ సమీపంలోని ఖాళీస్థలంలో పలువురు యువకులు గంజాయి పొట్లాలతో ఉన్నారన్న సమాచారంతో బాలానగర్ జోన్ ఎస్వోటీ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. యువకులు పారిపోయేందుకు యత్నించగా చాకచక్యంగా పట్టుకుని కేపీహెచ్‌బీ పోలీసులకు అప్పగించారు. యువకులు పని ఒత్తిడి నుంచి ఉపశమనం కోసమే గంజాయి తాగుతున్నట్లు పోలీసులకు చెప్పడం గమనార్హం. తూర్పుగోదావరి జిల్లా ఆలమూరు మండలానికి చెందిన తోరటి రాజేశ్(24), అదే జిల్లా కొత్తపల్లి మండలానికి చెందిన నక్కా నాగవంశీ(23), రాజమండ్రి టౌన్ పరిధి నరేంద్రపురం గ్రామానికి చెందిన తంగెళ్ల రమేశ్‌కృష్ణ(27), పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన జంపని సాయిగోపి విహారి(26) సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. రాజేశ్ కైత్లాపూర్‌లో, మిగతా ముగ్గురు కేపీహెచ్‌బీ మూడోఫేజ్‌లోని వసతిగృహాల్లో ఉంటున్నారు. కొంత కాలంగా వీరు గంజాయి తాగుతూ అనుమానం రాకుండా గంజాయిని తెల్ల కాగితాల్లో చుట్టి విక్రయిస్తున్నారు. రాజేశ్ తూర్పుగోదావరి జిల్లా నుంచి గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తుంటాడు. బీటెక్ చదివే రోజుల్లోనే గంజాయికి అలవాటుపడ్డ రాజేశ్ మిగతావారికి అలవాటు చేశాడు. పోలీసులు నిందితుల నుంచి సుమారు 1300గ్రాముల గంజాయి, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.


పట్టుబడ్డ ఉద్యోగులు, స్వాధీనం చేసుకున్న పొట్లాలు

8వ అంతస్తు నుంచి పడి కార్మికుడి మృతి

రామచంద్రాపురం రూరల్, న్యూస్‌టుడే: పనిచేస్తున్న చోట 8వ అంతస్తు నుంచి పడి ఓ కార్మికుడు మృత్యువాత పడిన సంఘటన కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ రవీందర్ తెలిపిన వివరాలు.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం పురూలియా జిల్లా చక్షన్ గ్రామానికి చెందిన ప్రసంజీ మహతి (20) తెల్లాపూర్ పట్టణం హర్ష నిర్మాణ సంస్థలో కార్మికుడు. విధి నిర్వహణలో భాగంగా బుధవారం రాత్రి 8వ అంతస్తులో బాల్కనీ వద్ద స్లాబ్ పనులు చేస్తూ కిందపడ్డాడు. పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి బావ కిట్సున్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని కూలీ దుర్మరణం

పటాన్‌చెరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నాగరాజు కథనం ప్రకారం... సుల్తాన్‌పూర్ గ్రామంలో ఉంటున్న నాయికోటి వెంకటేష్ (35) కూలి పని చేసుకుని జీవనం సాగిస్తున్నారు. బుధవారం రాత్రి సుల్తాన్‌పూర్ ఓఆర్ఆర్‌పై నుంచి పటాన్‌చెరు వైపు నడిచి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో దుర్మరణం పాలయ్యాడు. మృతదేహం పైనుంచి చాలా వాహనాలు వెళ్లడంతో శరీరభాగాలు నుజ్జయ్యాయి. ఓ వాహనదారుడు గమనించి టోల్ గేట్ నిర్వహణదారులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆ భాగాలని సేకరించి పటాన్ చెరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంకటేష్ తండ్రి అశోక్ కుమారుడి కోసం వెతుకుతూ గురువారం అవుటర్‌పై టోల్‌గేట్ సిబ్బందిని విచారించారు. వారిచ్చిన సమాచారంతో ఆసుపత్రికెళ్లి వెంకటేష్ మృతదేహాన్ని గుర్తించారు.

ఫిర్యాదుదారుల పిల్లలకు ఠాణాలో ఆటస్థలం

అమీన్‌పూర్ ఠాణాకు పనిపై వచ్చే వారి పిల్లలు ఆడుకోవడానికి వీలుగా ప్రత్యేకంగా గది నిర్మించారు. దీన్ని యూనిసెఫ్ ప్రోత్సాహంతో 'ఛైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్' పేరుతో సిద్ధం చేశారు. ఫిర్యాదు చేయడానికి వచ్చే వారి పిల్లలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆడుకోవడానికి ఏర్పాట్లు చేశారు. గదిలో మంచం, చిన్న టేబుల్, పలు రకాల ఆట బొమ్మలు, చిన్న సైకిల్, జారుడుబల్ల వంటివి ఉంచారు. గోడలపై ఆహ్లాదకరంగా కనిపించేలా పార్కు, చెరువు, ఇంద్రధనస్సు వంటి బొమ్మలు వేశారు. ఎస్పీ రూపేష్‌కుమార్ సూచనల మేరకు ఈ ఏర్పాటు చేశామని సీఐ నాగరాజు తెలిపారు.

– న్యూస్‌టుడే, పటాన్‌చెరు



చిన్నారుల కోసం నిర్మించిన గది


ఆడుకోవడానికి సమకూర్చిన వస్తువులు

డ్రంకెన్ డ్రైవ్.. ఐదుగురికి జైలు

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడిపిన వారిలో కొందరికి జరిమానా, మరికొందరికి జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సిబ్బంది నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 8 మంది పట్టుబడ్డారు. వీరిని సంగారెడ్డి కోర్టుకు తరలించగా ముగ్గురికి రూ.2 వేల చొప్పున జరిమానా, ముగ్గురికి రెండు రోజులు, ఒకరికి మూడు రోజులు, ఇంకొకరికి ఒకరోజు జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని సీఐ లాలూనాయక్ తెలిపారు.

భవనంపై నుంచి పడి బాలుడికి తీవ్రగాయాలు

హత్యాయత్నం అంటూ తండ్రి ఫిర్యాదు

పటాన్‌చెరు అర్బన్: భవనంపై బాలికతో బాలుడు మాట్లాడుతుండగా కింద పడటంతో తీవ్రగాయాలైన ఘటన పటాన్‌చెరు ఠాణా పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తంగిలో ఉంటూ అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించే హోంగార్డు రాజు కుమారుడు లోకేష్ తొమ్మిదో తరగతి విద్యార్థి. తనతోపాటు చదువుతున్న బాలికతో పరిచయం ఉంది. వీరు తరుచూ ఆమె నివాసం ఉంటున్న భవనంపై మాట్లాడుకునేవారు. గురువారం ఇద్దరూ మాట్లాడుకొంటుండగా దుస్తులు ఆరేసేందుకు ఓ మహిళ భవనంపైకి రావడంతో బాలుడు పక్కకు జరగబోయి కింద పడ్డాడు. గాయపడిన అతడిని బీరంగూడలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. యువతి కుటుంబ సభ్యులు తన కుమారుడు లోకేష్‌ను హత్య చేయబోయారని ఆరోపిస్తూ తండ్రి రాజు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుత్బుల్లాపూర్

విద్యార్థినికి అభినందన



నిజాంపేట, న్యూస్‌టుడే: గ్రీన్ వరల్డ్ ఆర్ట్స్ కాంపిటీషన్స్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో నిజాంపేట నారాయణ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని లాస్యప్రియ చిత్రలేఖన విభాగంలో బహుమతి సాధించింది. పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుహాసిని లాస్యప్రియను అభినందించారు. త్వరలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు సైతం లాస్య ఎంపికైనట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

గ్రామీణ బాలికలకు ల్యాప్‌టాప్‌ల వితరణ

మాదాపూర్, న్యూస్‌టుడే: రాయదుర్గంలోని క్లారనెట్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ రూ.32 లక్షలు విలువ చేసే 25 అత్యాధునిక ల్యాప్‌టాప్‌లను (పొదుపుగా ఉపయోగించినవి) విరాళంగా ఇచ్చింది. పీపుల్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ ఎడ్యుకేషన్(ప్యూర్) స్వచ్ఛంద సంస్థ ద్వారా వీటిని గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద బాలికలకు అందించనున్నారు. హోమ్ సర్వీస్‌తో పూర్తి వారంటీ ఉన్న ఈ ల్యాప్‌టాప్‌లు విద్యార్థినులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని క్లారనెట్ హెచ్ఆర్ విభాగం హెడ్ సృజని చౌదరి తెలిపారు. కంపెనీ ఫైనాన్స్ హెడ్ సయ్యద్ వాసే, ఐటీ అండ్ సెక్యూరిటీ ఇన్‌ఛార్జ్ అక్షయ్, ప్యూర్ సంస్థ ప్రతినిధి అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



నివాళులర్పిస్తున్న ఛైర్‌పర్సన్ కృష్ణవేణి

నిజాంపేట: దుండిగల్ పురపాలక సంఘంలో వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ సుంకరి కృష్ణవేణి, వైస్ ఛైర్మన్ పద్మారావు, కమిషనర్ సత్యనారాయణ, మేనేజర్ సునంద తదితరులు పాల్గొన్నారు.

షాపూర్‌నగర్: సంస్కృత సాహిత్యంలో ఆదికవిగా పేరొంది, రామాయణాన్ని రచించిన మహర్షి వాల్మీకి జయంతిని సూరారంలోని నార్త్‌సిటీ పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్ మాట్లాడుతూ వాల్మీకి గొప్పతనాన్ని, చరిత్రను విద్యార్థులకు వివరించారు.

వాస్తు పేరుతో.. వింత నిర్ణయం

● కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయ ప్రధాన గేటుకు తాళం



తాళం వేసి ఉన్న కార్యాలయ ప్రధాన గేటు

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: వాస్తు దోషం పేరుతో కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయానికి ఎడమవైపు ఉన్న ప్రధాన గేటుకు శాశ్వతంగా తాళం వేశారు. దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేకంగా నిర్మించిన ర్యాంపూ తొలగించారు. దీంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. వాస్తు అనేది కార్యాలయం అభివృద్ధికా లేక అధికారుల కోసమా అని పలువురు ఆరోపిస్తున్నారు.

నాలుగున్నర ఏళ్లుగా..

కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిల్ కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో కొనసాగుతున్నాయి. ముందు చూపుతో కార్యాలయాలకు వచ్చే వారి కోసం రెండు వైపుల గేట్లు ఏర్పాటు చేశారు. ఇందులో ఒకటి లోపలికి వెళ్లడానికైతే.. మరొకటి బయటికి రావడానికి ఉపయోగించేవారు. ఒకే ప్రాంగణంలో కొనసాగుతున్న కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చే వారి సంఖ్య అధికంగానే ఉంటుంది. గతంలో ఇక్కడ పనిచేసిన ఓ ఉప కమిషనర్ వాస్తు పేరుతో నాలుగున్నరేళ్ల క్రితం బయటికి వెళ్లడానికి ఉపయోగించే గేటుకు తాళం వేయించారన్న ఆరోపణ ఉంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒకే గేటు నుంచే లోపలికి, బయటకు రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

ఉసూరుమంటున్న దివ్యాంగులు..

దివ్యాంగులు కార్యాలయంలోకి వెళ్లడానికి ప్రధాన ద్వారం వద్ద గతంలో ర్యాంపు నిర్మించి గేటు పక్కనే ఒక వీల్ ఛైర్‌ను అందుబాటులో ఉంచేవారు. కాని వాస్తు పేరుతో ర్యాంపును తొలగించి కార్యాలయం వెనక వైపు ఏర్పాటు చేశారు. దీంతో దివ్యాంగులను వారి కుటుంబ సభ్యులు చేతుల మీద ఎత్తుకుని లోపలికి తీసుకెళ్లాల్సి వస్తోంది. ర్యాంపును తొలగించడంతో దివ్యాంగులు, వృద్ధులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. కార్యాలయం ప్రహరీపై అమర్చిన ముళ్ల కంచె ధ్వంసమైంది. దీంతో పలు సార్లు దొంగలు లోపలికి ప్రవేశించి కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్లు తస్కరించిన సంఘటలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో భద్రతపై మరింత దృష్టి సారించాల్సి ఉంది. గతంలో ఇక్కడ పనిచేసిన ఉప కమిషనర్లు పూర్తికాలం విధులు నిర్వహించిన దాఖలాలు లేవు. దీంతో ఓ ఉప కమిషనర్ ఇక్కడే పాతుకుపోవాలన్న లక్ష్యంతో గేటుకు తాళం వేయించారన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

కుత్బుల్లాపూర్ - 80085 73403, దుండిగల్ - 80085 73410
షాపూర్‌నగర్: 8008573404, పేట్‌బషీరాబాద్: 8008573405
నిజాంపేట: 8008573423, జీడిమెట్ల: 8008574405

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే:

? జీడిమెట్ల సుచిత్ర వెంకటేశ్వరకాలనీలోని ప్రధాన రహదారిపై మట్టి కుప్పలు పేరుకుపోయాయి. – బత్తిన రామ్‌కుమార్‌గౌడ్

✓ క్షేత్రస్థాయి పరిశీలన చేయించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటా. – గణేశ్, ఈఈ కుత్బుల్లాపూర్ సర్కిల్

? రంగా, భుజంగా థియేటర్ వద్ద కూడలిలో రహదారి విస్తరణ పనులకోసం తవ్వకాలు నిర్వహించి వదిలేశారు. – కిషన్ సిర్వీ, షాపూర్‌నగర్

✓ కూడలి విస్తరణకు తవ్వకాలు నిర్వహించిన స్థలం తమదంటూ ఓ వ్యక్తి అభ్యంతరం చెప్పడంతో పనులను నిలిపివేయాల్సి వచ్చింది. త్వరలో పనులు ప్రారంభించి పూర్తి చేస్తాం.
– నర్సింహ, ఉప కమిషనర్ కుత్బుల్లాపూర్ సర్కిల్

ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి హాని



చేతిసంచులను ఆవిష్కరిస్తున్న తహసీల్దారు

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో వస్త్రంతో తయారుచేసిన చేతిసంచులను గురువారం కుత్బుల్లాపూర్ తహసీల్దారు అబ్దుల్ రహమాన్‌ఖాన్ ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణ సమితి ఛైర్మన్ లయన్ కోటిరెడ్డి వీటిని రూపొందించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ.. నిత్యం వాడే కూరగాయలు, నిత్యావసరాలు తీసుకురావడానికి వస్త్రం, కాగితంతో తయారుచేసిన బ్యాగులను మాత్రమే ఉపయోగించాలని తెలిపారు. ప్లాస్టిక్ వాడకంతో విపరీతంగా పెరిగిపోయి పర్యావరణానికి హాని చేకూరుతుందని, క్యాన్సర్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. పర్యావరణ ప్రేమికులు మరింతగా ముందుకొచ్చి ప్రజలను అవగాహన కల్పించాలన్నారు. లయన్ తనూజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలకు నిలయం.. హెచ్ఎంటీ ఖాళీ స్థలం

● ఘాటైన వాసనలతో శ్వాసకోస వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు



వ్యర్థాలకు నిప్పుపెట్టడంతో వ్యాపిస్తున్న పొగ

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: జగద్గిరిగుట్ట, చింతల్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ ఖాళీ స్థలం వ్యర్థ ఘన రసాయనాలకు నిలయంగా మారుతోంది. స్థానికంగా 200 ఎకరాల్లో హెచ్ఎంటీ పరిశ్రమకు సంబంధించిన ఖాళీ స్థలం ఉంది. పరిశ్రమ మూసివేయడంతో కొందరు ఇతర పరిశ్రమల నిర్వాహకులు వ్యర్థ రసాయనాలను గుట్టుచప్పుడు కాకుండా ఇక్కడ డంపింగ్ చేస్తున్నారు. కొందరు చికెన్, మటన్ వ్యర్థాలనూ ఇక్కడే పారబోస్తుండటంతో ఆ ప్రాంతమంతా దుర్గంధం వ్యాపిస్తోంది. దీంతో ఈ స్థలాన్ని ఆనుకుని ఉన్న వివేకానందనగర్, రోడామిస్త్రీనగర్, శ్రీరాంనగర్, బీరప్పనగర్, దేవమ్మబస్తీ, సంజయ్‌గాంధీనగర్, మల్లాపూర్‌నగర్, సీసలబస్తీ తదితర ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర అసౌకర్యాన్ని గురవుతున్నారు. రసాయనాలను డంపింగ్ చేసి నిప్పు అంటించడంతో దట్టమైన పొగలు వ్యాపించి చుట్టుపక్కల బస్తీలను కమ్మేస్తున్నాయి. ఘాటైన వాసనలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ గాలిని పీల్చడం ద్వారా శ్వాసకోస వ్యాధుల బారిన పడుతున్నామని, ఆసుపత్రులకు డబ్బులు వెచ్చించలేక ఆర్థికంగా చితికిపోతున్నామని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు.

మాజీ ఎమ్మెల్యేకు వినతి..

స్థానిక బస్తీవాసులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను గురువారం కలిసి వ్యర్థాల డంపింగ్ అరికట్టాలని శ్రీరాంనగర్ పోచమ్మదేవాలయం వద్ద నుంచి ఖాళీ స్థలంలోకి వెళ్లే మార్గాన్ని మూసివేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంబంధిత హెచ్ఎంటీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నవయుగ వెల్ఫేర్ అసోసియేషన్ ఛైర్మన్ జహంగీర్ హుసేన్, అధ్యక్షుడు బలరాం, రాజు, సలీం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు



డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న సతీశ్, తదితరులు

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: గాజులరామారంలోని సర్వే నంబరు 307లో రూ.150 కోట్ల విలువైన 16 ఎకరాల స్థలాన్ని ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారని, ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ భాజపా నాయకులు గురువారం కుత్బుల్లాపూర్ డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునరావుకు ఫిర్యాదు చేశారు. స్థానికంగా బాలయ్యబస్తీని ఆనుకుని ఉన్న క్వారీ గుంతలను కబ్జాదారులు మట్టితో నింపి చదును చేసి అక్రమంగా లేఅవుట్ రూపొందించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు నిర్వాహకులు తప్పుడు పత్రాలతో అన్ని అనుమతులు తీసుకున్నట్లు వెబ్‌సైట్‌లో చూపిస్తూ 477 ప్లాట్లుగా వెంచర్ ఏర్పాటు చేశారని తెలిపారు. అమాయక పేద ప్రజలు ఇక్కడ ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోతారని వారు నష్టపోకముందే కబ్జాదారులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల సతీశ్, శ్రీనివాస్‌గౌడ్, అరుణ్ రావు, చందు, బలరాం తదితరులు పాల్గొన్నారు.

భాజపా నుంచి సతీశ్ సస్పెన్షన్

నిజాంపేట, న్యూస్‌టుడే: భాజపా నుంచి ఆకుల సతీశ్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి ఎస్.మల్లారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ నిజాంపేట నగర శాఖ అధ్యక్షుడిగా కొనసాగిన సతీశ్ పార్టీ కార్యకలాపాలను వ్యతిరేకిస్తూ గతంలో రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. పార్టీ పేరుతో ఆయన పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అర్జీలు పెడుతున్నారని, ఆయన చేపట్టే కార్యక్రమాలకు పార్టీకి సంబంధం లేదని పేర్కొన్నారు.

తొలగించే అధికారం మల్లారెడ్డికి లేదు..

తనను తొలగించే అధికారం మల్లారెడ్డికి లేదని సతీశ్ ఓ ప్రకటనలో ఆరోపించారు. తనపై వ్యక్తిగత కక్షతోనే ఆయన ఇలా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై తాను పార్టీ కేంద్ర క్రమశిక్షణ సంఘానికి ఫిర్యాదు చేస్తానని చెప్పారు. పార్టీలోనే కొనసాగుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

సంక్షేమ పథకాల అమలుకు కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న నేతలు కార్యకర్తలు

కొంపల్లి(పేట్‌బషీరాబాద్), న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా అధికారులు కృషి చేయాలని పలువురు కాంగ్రెస్ నేతలు అభిప్రాయపడ్డారు. కొంపల్లిలోని ఏఎంఆర్ గార్డెన్‌లో ఆ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ.. కొందరు మున్సిపల్ అధికారులు నేటికీ భారాస ప్రభుత్వం అధికారంలో ఉందని భావిస్తున్నారని ఆరోపించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సంక్షేమ కార్యక్రమాల అమలుకు కృషి చేయాలన్నారు. కొంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరి ప్రశాంత్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెమ్మి దేవేందర్, శివకుమార్‌గౌడ్, మోహన్‌రెడ్డి, ఇబ్రహీం, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మిక సహకార సంఘ కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గ సభ్యులతో శ్రీశైలంగౌడ్

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: సుభాష్‌నగర్ కల్లుగీత కార్మిక సహకార సంఘం(టీటీసీఎస్) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అంతటి శ్రీనివాస్‌గౌడ్, కమిటీ సభ్యులు కె.రాజేష్, నర్సింహగౌడ్, నాగభూషణం, పద్మజ తదితరులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా సభ్యులను శ్రీశైలంగౌడ్ సత్కరించారు.

'ఈ బాజా' సంస్థతో బీవీఆర్ఐటీ ఒప్పందం



ఒప్పంద పత్రాలను ప్రదర్శిస్తున్న విష్ణురాజు, బాల్‌రాజ్ సుబ్రమణ్యం

నిజాంపేట, న్యూస్‌టుడే: ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన సంస్థ 'ఈ బాజా సొసైటీ ఫర్ ఆటోమోటివ్ ఇంజినీర్స్ ఇండియా' సంస్థతో బీవీఆర్ఐటీ కళాశాల అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు బాచుపల్లి రాజీవ్ గాంధీనగర్‌లోని కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ప్రతినిధులు ధ్రువపత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానాన్ని పరస్పరం అందించుకొని విద్యార్థుల అభ్యున్నతికి దోహదపడేలా కృషి చేస్తామన్నారు. రెండేళ్ల పాటు ఒప్పందం కొనసాగుతుందన్నారు. కళాశాల ఛైర్మన్ కె.వి.విష్ణురాజు, సంస్థ ప్రతినిధి బాల్‌రాజ్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

అధికారులూ.. ఇదేం సమీక్ష?

● ప్రజా ప్రతినిధుల భర్తలు సైతం హాజరు



సమావేశంలో మేయర్ భర్త గోపాల్‌రెడ్డి, కార్పొరేటర్ల భర్తలు వెంగయ్య, జగన్‌యాదవ్

నిజాంపేట, న్యూస్‌టుడే: మహిళా ప్రజాప్రతినిధుల కార్యకలాపాల్లో భర్తల అజమాయిషీ చెలాయిస్తుండటం చర్చనీయాంశమైంది. నిజాంపేట నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ కొలను నీలారెడ్డి అధ్యక్షతన అభివృద్ధి పనుల నిర్వహణపై గురువారం ప్రత్యేక సమీక్షా సమావేశం జరిగింది. ఇందులో డిప్యూటీ మేయర్ శనిగల ధన్‌రాజ్ యాదవ్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు. వీళ్లతోపాటుగా ముగ్గురు మహిళా కార్పొరేటర్ల భర్తలు సైతం పాల్గొనడం చర్చనీయాంశమైంది. అందులో మేయర్ భర్త కొలను గోపాల్‌రెడ్డి, 13, 14 డివిజన్ల కార్పొరేటర్ల భర్తలు వెంగయ్యచౌదరీ, ఆవుల జగన్‌యాదవ్ పాల్గొన్నారు.

అష్టోత్తర కలశాభిషేకం ఈనెల 20న

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: జీడిమెట్ల డివిజన్ పరిధి శ్రీదుర్గాఎస్టేట్స్ కాలనీలోని దుర్గాదేవి ఆలయంలో ఈ నెల 20న 108 కలశాలతో అష్టోత్తర కలశాభిషేకం నిర్వహించనున్నట్లు దేవాలయ ప్రధాన ర్చకులు శ్రీరంగం గోపికృష్ణమాచార్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు కార్యక్రమంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ఆ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు.. గంజాయికి బానిసలు



గంజాయితో పట్టుబడిన ఉద్యోగులు

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: వారంతా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే. ప్రముఖ కంపెనీల్లో పనిచేస్తూ ఆకర్షణీయమైన జీతం అందుకుంటున్నారు. కానీ, గంజాయికి బానిసై జైలు పాలయ్యారు. కేపీహెచ్‌బీ ఎస్సై సుమన్ వివరాల ప్రకారం. .గురువారం మధ్యాహ్నం కేపీహెచ్‌బీ అయిదోఫేజ్ డీమార్ట్ సమీపంలోని ఖాళీస్థలంలో పలువురు యువకులు గంజాయి పొట్లాలతో ఉన్నారన్న సమాచారంతో బాలానగర్ జోన్ ఎస్వోటీ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. యువకులు పారిపోయేందుకు యత్నించగా చాకచక్యంగా పట్టుకుని కేపీహెచ్‌బీ పోలీసులకు అప్పగించారు. యువకులు పని ఒత్తిడి నుంచి ఉపశమనం కోసమే గంజాయి తాగుతున్నట్లు పోలీసులకు చెప్పడం గమనార్హం. తూర్పుగోదావరి జిల్లా ఆలమూరు మండలానికి చెందిన తోరటి రాజేశ్(24), అదే జిల్లా కొత్తపల్లి మండలానికి చెందిన నక్కా నాగవంశీ(23), రాజమండ్రి టౌన్ పరిధి నరేంద్రపురం గ్రామానికి చెందిన తంగెళ్ల రమేశ్‌కృష్ణ(27), పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన జంపని సాయిగోపి విహారి(26) సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. రాజేశ్ కైత్లాపూర్‌లో, మిగతా ముగ్గురు కేపీహెచ్‌బీ మూడోఫేజ్‌లోని వసతిగృహాల్లో ఉంటున్నారు. కొంతకాలంగా వీరు గంజాయి తాగుతూ అనుమానం రాకుండా గంజాయిని తెల్లకాగితాల్లో చుట్టి విక్రయిస్తున్నారు. రాజేశ్ తూర్పుగోదావరి జిల్లా నుంచి గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తుంటాడు. బీటెక్ చదివే రోజుల్లోనే గంజాయికి అలవాటుపడ్డ రాజేశ్ మిగతావారికి అలవాటు చేశాడు. పోలీసులు నిందితుల నుంచి సుమారు 1300గ్రాముల గంజాయి, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

ప్రాంగణ నియామకాల్లో సత్తాచాటిన విద్యార్థులు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రాంగణ నియామకాల్లో సత్తాచాటారు. తాజాగా జరిగిన ఇన్ఫోసిస్ నియామకాల్లో ఆరుగురు రూ.9.5లక్షల చొప్పున ప్యాకేజీతో ఎంపికయ్యారు. మొత్తం బీటెక్ నుంచి 234, ఎంటెక్, ఎంసీఏ నుంచి 249మంది ఇన్ఫోసిస్‌కు దరఖాస్తు చేసుకోగా ఇందులో సీఎస్ఈ నుంచి పి.సనితారెడ్డి, కె.సాయిహేమంత్‌నారాయణ్, ఎస్.గ్రీష్మా, హెచ్.కేశరాజు, సీఎస్ఈ ఐడీపీ నుంచి బి.స్ఫూర్తి, ఎంసీఏ నుంచి కె.శ్రీఉమాదేవి ఉద్యోగాలు సాధించారు.

దుగ్గిరాల సోమేశ్వరరావు ఆత్మీయ పురస్కారాల ప్రదానం



అవార్డు గ్రహీతలతో రమణాచారి, హెచ్.జె.దొర, సారిపల్లి కొండలరావు

నారాయణగూడ, న్యూస్‌టుడే: పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీలో గురువారం రాత్రి రసరంజని-హైదరాబాద్, దుగ్గిరాల ఫ్యామిలీ సంయుక్తాధ్వర్యంలో దర్శకుడు దుగ్గిరాల సోమేశ్వరరావు జయంతి వేడుకల సందర్భంగా ఆత్మీయ పురస్కారాల ప్రదానం జరిగింది. అక్కినేని నాటక కళా పరిషత్తు అధ్యక్షుడు సారిపల్లి కొండలరావు అధ్యక్షతన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విశ్రాంత ఐఏఎస్ అధికారి డా.కె.వి.రమణాచారి మాట్లాడుతూ.. మంచి మనసున్న మహారాజు దుగ్గిరాల సోమేశ్వరరావు అని కొనియాడారు. విశ్రాంత డీజీపీ హెచ్.జె.దొర, దర్శకుడు బీఎం రెడ్డి మాట్లాడారు. సీనియర్ నటులు సీహెచ్ నారాయణస్వామి, సుసర్ల కామేశ్వరశర్మ, నటుడు కేతినీడి నటరాజ్, సత్కళా భారతి అధ్యక్షుడు సత్యనారాయణ, తెలుగువర్సిటీ రంగస్థల కళల శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ డా.బీహెచ్ పద్మప్రియలకు దుగ్గిరాల సోమేశ్వరరావు ఆత్మీయ పురస్కారాలు ప్రదానం చేశారు.

బాణసంచా దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

నిజాంపేట: దీపావళి సందర్భంగా ప్రగతినగర్‌లోని బతుకమ్మ ఘాట్‌లో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు వ్యాపారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిజాంపేట నగర పాలక సంస్థ మేనేజర్ కె.పవన్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. బతుకమ్మ ఘాట్ వద్ద 22 స్టాళ్లకు ఏర్పాట్లు చేశామన్నారు. ఔత్సాహికులు ఈ నెల 21న సాయంత్రం 5 గంటలలోపు నగర పాలక సంస్థ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. దరఖాస్తుతో పాటు రూ.60 వేల డీడీ జతచేయాల్సి ఉంటుందన్నారు. 22న మధ్యాహ్నం 3 గంటలకు డ్రా పద్ధతిన నిర్వాహకుల ఎంపిక ఉంటుందన్నారు.

'సాబూరి ఫార్మా నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి'

జీడిమెట్ల, న్యూస్‌టుడే: జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని సాబూరి ఫార్మా నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైకాపా ఎస్సీసెల్ ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నెలపూడి స్టాలిన్ బాబు డిమాండ్ చేశారు. రసాయనాల ట్యాంకులో పడి కవలలు మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని గురువారం బాధిత కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. ఫార్మా సంస్థ నిర్లక్ష్యం కారణంగా రామ్‌లక్ష్మణ్‌లు మృతి చెందారని ఆరోపించారు. బాధిత కుటుంబానికి నష్ట పరిహారం అందించేలా తెలంగాణ ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. * ఫార్మా సంస్థలో ఇద్దరు కవలలు మృతి చెందిన ఘటన తనను ఎంతగానో కలిచి వేసిందని రాష్ట్ర కార్మిక సంఘం నేత ముద్దాపురం మదన్ గౌడ్ అన్నారు. మృతుల కుటుంబాలకు ఆర్థికంగా ప్రయోజనం కలిగించేలా తన వంతు చొరవ తీసుకుంటానని చెప్పారు.

గోవా.. రైలు వేళలు మారవా?

ప్రయాణికుల అసహనం.. మార్చాలని వినతులు

ఈనాడు, హైదరాబాద్



కొత్తగా ప్రారంభించిన సికింద్రాబాద్ - గోవా (వాస్కోడిగామ) రైలు ప్రయాణంపై ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు. రైలు వేళలతో ప్రయాస పెరుగుతోందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. సెలవు రోజుల్లో ప్రయాణం పెట్టుకుంటే రెండు రోజులు రాకపోకలకే సరిపోతోందని, రైళ్ల వేళలు మారిస్తే ఉపయుక్తంగా ఉంటుందని చెబుతున్నారు. ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్ స్టేషన్‌లో రైలెక్కితే మరుసటి రోజు ఉదయం 5.45 గంటలకు గోవా (వాస్కోడిగామ) చేరుతుందని, హోటల్ బుకింగ్, ఇతర ప్రయాణాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైళ్ల వేళలు మార్చడంతోపాటు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను వేయాలని డిమాండ్ చేస్తున్నారు.

సాయంత్రానికి మార్చితే..

ఏటా 80 లక్షల మంది గోవా వెళ్తుంటే అందులో 20 శాతం తెలుగు రాష్ట్రాల వారున్నారు. దమ రైల్వే అక్టోబరు మొదటివారంలో గోవాకు బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసును ప్రారంభించింది. బుధ, శుక్రవారాల్లో గోవాకు, గురు, శని వారాల్లో సికింద్రాబాద్‌కు ఈ రైలు రాకపోకలు సాగిస్తోంది. ప్రారంభించిన వారం రోజుల్లోనే ఆక్యుపెన్సీ 70 శాతం చేరుకునాన వేళలు అనుకూలంగా లేవంటున్నారు. వెళ్లి వచ్చేందుకు 38 గంటలు పడుతోందంటున్నారు. ఉదయాన్నే 5.45 గంటలకు వాస్కోడిగామ స్టేషన్‌లో దిగిన తర్వాత హోటల్ బుకింగ్‌కు మధ్యాహ్నం వరకు వేచి చూడాల్సి వస్తోందట. హోటళ్లలో మధ్యాహ్నం 2 వరకు కొత్త బుకింగ్‌లు తీసుకోవడం లేదన్నారు. సాయంత్రం 5 గంటలకు మార్చితే మరుసటిరోజు ఉదయం 11కల్లా గోవా చేరుకోవచ్చంటున్నారు.

వేళలు మార్చేందుకు ప్రయత్నిస్తున్నాం

– శ్రీధర్, సీపీఆర్వో, దక్షిణమధ్య రైల్వే



రైలు వేళలు మార్చాలంటూ ప్రయాణికుల నుంచి వినతులు వస్తున్నాయి. ఈ అంశంపై సౌత్ వెస్టర్న్ రైల్వే అధికారులకు గతంలోనే లేఖ రాశాం. అక్కడి రైళ్ల వేళలు, ట్రాఫిక్‌కు అనుగుణంగా సర్దుబాటు జరిగితే ప్రస్తుత సమయం మార్చడానికి వీలవుతుంది. వారి సమన్వయంతో ప్రయాణికులకు అనుకూలంగా ఉండే సమయానికి మార్చేందుకు ప్రయత్నిస్తున్నాం.

అగ్నిమాపక.. శ్రద్ధ చూపక..



కేంద్రాల్లో అరకొర వసతులు.. సిబ్బందికి ఇబ్బందులు

3 జిల్లాల్లోని అగ్నిమాపక కేంద్రాలు **31**

గ్రేటర్‌లో ఏటా ప్రమాదాలు సుమారు **1300**

5 అంతస్తులకంటే ఎత్తైన భవనాలు **లక్షకుపైగా**

ఈనాడు, హైదరాబాద్: అగ్నిమాపక సిబ్బందికి సరైన వసతులు లేక బిక్కుబిక్కుమంటూ పనిచేస్తున్నారు. 10 నుంచి 15 మంది సిబ్బంది పనిచేసే కేంద్రాల్లో తాగు నీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేదు. రేకుల షెడ్డులో అగ్నిమాపక కేంద్రం, స్టేషన్ ఫైర్ అధికారికి ఒక గది మినహా ఇతర సదుపాయాలుండవు. రాత్రివేళ అగ్నిప్రమాదం జరిగితే నీటి సేకరణ కష్టమే. జలమండలి నుంచి వాహనాలు అందుబాటులో ఉన్నా రాత్రివేళ డ్రైవర్లు అందుబాటులో లేక సకాలంలో నీరు దొరకని పరిస్థితి.



లంగర్‌హౌజ్‌లో ఇరుకైన గది ఉండటంతో స్టేషన్ బయటే వంట

లంగర్‌హౌజ్‌లో దయనీయ పరిస్థితులు..

- లంగర్‌హౌజ్‌లోని ఫైర్‌స్టేషన్‌లో 15 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. స్టేషన్‌కు అవసరమైన పరికరాలు, సామగ్రి అంతా అదే ఇరుకైన గదిలో భద్రపరచాలి. గత 20 ఏళ్లుగా ఈ స్టేషన్‌ను అద్దె గదిలో నిర్వహిస్తుండడం గమనార్హం. అగ్నిమాపక శాఖకు అత్యవసరమైన నీటి సంపు ఇక్కడ లేదు.
- గతంలో గాంధీ ఆసుపత్రి వద్ద అగ్ని ప్రమాదం సంభవించిన సమయంలో ఆసుపత్రుల వద్ద అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు చేయాలని అప్పట్లో ఉన్నతాధికారులు నిర్ణయించారు. అక్కడే ఆసుపత్రి అధికారులు స్థలాన్ని ఇవ్వగా అక్కడే అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.
- ఉస్మానియా ఆసుపత్రిలోనూ రోగుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ప్రమాదాల నివారణకు అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే అప్పటికే యాకుత్‌పురాలో ఏర్పాటు చేయాలనుకున్న స్టేషన్‌ను ఆసుపత్రి ఆవరణకు మార్చారు. తాత్కాలికంగా అక్కడ స్థలం ఇవ్వగా షెడ్డు ఏర్పాటు చేసి అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

'సదర్' సమ్మేళనం 27న



నృత్యం చేస్తున్న అంజన్‌కుమార్ యాదవ్, ఆయన మిత్రుడు

నారాయణగూడ, న్యూస్‌టుడే: ఇందిరాపార్కు వద్ద ఉన్న ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 27న ఉదయం 11 గంటలకు 'సదర్ సమ్మేళనం' నిర్వహించనున్నట్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ ఎం.అంజన్ కుమార్ యాదవ్ తెలిపారు. గురువారం సాయంత్రం హైదరాబాద్ ఆదర్శనగర్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం నిర్వహించనున్న సమ్మేళనానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రజాప్రతినిధులతోపాటు అఖిలేష్ యాదవ్, తేజస్వీ యాదవ్ తదితరులు పాల్గొంటున్నారన్నారు. 'ధనక్.. ధనక్.. ధనక్ త్రూ'.. ప్రత్యేక బ్యాండ్ వాయిద్య సంగీతానికి అనుగుణంగా హాకీ కర్రతో మాజీ ఎంపీ స్టెప్పులేశారు.

మహిళా వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ బాధ్యతల స్వీకరణ



ధనావత్ సూర్య

సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం(సీఐఎంవీ) ఇన్‌ఛార్జి ఉపకులపతి(వీసీ)గా ధనావత్ సూర్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ప్రొ.విజ్జులత బదిలీ అయ్యారు. పూర్వ ఇన్‌ఛార్జి వీసీ ప్రొ.విజ్జులతను సన్మానించి వీడ్కోలు పలికారు.

తెలుగు వర్సిటీలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ 23 నుంచి

నారాయణగూడ: తెలుగు విశ్వవిద్యాలయం 2024-25 విద్యా సంవత్సరానికి గాను యూజీ, పీజీ కోర్సుల కౌన్సెలింగ్ ఈనెల 23 నుంచి నిర్వహించనున్నట్లు వర్సిటీ సెంట్రల్ అడ్మిషన్ కమిటీ డైరెక్టర్ డా.బి.రాధ ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడొచ్చన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. రిజర్వేషన్ పొందే విద్యార్థులు కుల ధ్రువీకరణ, ప్రస్తుత సంవత్సర ఆదాయ పత్రాలతో రావాలన్నారు. 23న వరంగల్ ప్రాంగణంలో ఎంఏ తెలుగు, హైదరాబాద్ బాచుపల్లి ప్రాంగణంలో ఎంఏ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, 24న ఎంఏ హిస్టరీ, కల్చర్ అండ్ టూరిజం, 25న ఎంఏ తెలుగు, ఎంఏ జ్యోతిష్యంలో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

కన్న కూతుర్ని కీచకులకు అప్పగించాలని..

అల్వాల్, న్యూస్‌టుడే: నోరులేని పక్షులు, జీవాలు సైతం తమ పిల్లలను ప్రకృతి విపత్తుల నుంచి, శత్రువుల బారి నుంచి నిరంతరం కాపాడుకుంటాయి. కానీ కొందరు మనుషులు మాత్రం తమ పిల్లలను బలిపశువులుగా మార్చేందుకు సిద్ధమవుతున్నారు. అల్వాల్ జేజేనగర్ సమీపంలో నివసించే మహిళ(37)కు ఇద్దరు కుమార్తెలు. మహిళను భర్త వదిలేయడంతో చిరు వ్యాపారాలు చేసుకుంటూ కుమార్తెలను పోషిస్తోంది. ఆర్థికంగా ఎదగాలన్న ఆశతో పెద్ద కుమార్తెను ఇప్పటికే వ్యభిచారంలోకి దింపింది. చిన్న కుమార్తె(14)ను ఐదో తరగతి వరకూ చదివించి ఇంటి వద్దనే ఉంచుతోంది. వ్యభిచారం చేయాలని కొన్నిరోజులుగా వేధిస్తోంది. దీంతో బాలిక ఇంట్లో నుంచి వెళ్లిపోయి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. ఆత్మహత్య చేసుకోవాలనుకుంది. మనసు మార్చుకొని తల్లికి బుద్ధి చెప్పాలని బుధవారం రాత్రి పోలీసులను ఆశ్రయించడంతో బాధితురాలిని సఖి కేంద్రానికి తరలించారు. విషయం తెలుసుకున్న తల్లి గురువారం ఠాణాకు వచ్చి పోలీసులపై దురుసుగా ప్రవర్తించింది. కానిస్టేబుళ్లు, ఎస్సైలను దుర్భాషలాడింది. అనంతరం పరారైంది. నిందితురాలిపై పోక్సో కేసు నమోదైంది.

బాలికను చంపాడు.. తెలివిగా నటించాడు

ఈనాడు, హైదరాబాద్: సూరారం ఠాణా పరిధిలో ఏడేళ్ల బాలిక హత్య కేసులో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. బాలికను దారుణంగా చంపాననే కనీస పశ్చాత్తాపం నిందితుడికి లేదు. కనిపించకుండా పోయిన బిడ్డ కోసం కుటుంబ సభ్యులు తల్లడిల్లుతుంటే వారితోనే ఉన్నాడు. బాలికను వెతుకుతున్నట్లు నటించాడు. బాలిక తల్లిని సొంతం చేసుకోవడానికి ఆమె ఇద్దరు కుమార్తెలు, సహజీవనం చేస్తున్న ప్రభాకర్‌ను అడ్డు తొలగించుకోవాలన్నది నిందితుడి పథకం. ఇందులో భాగంగా ఈనెల 12న ఇంటి ముందు ఆడుకుంటున్న పెద్దకుమార్తె(7)ను కిడ్నాప్ చేసి మేడ్చల్‌లోని బాసరగడి ప్రాంతంలో హత్య చేశాడు. మరుసటిరోజు సాయంత్రం వరకూ వారితోనే ఉన్నాడు. చివరకు ఈనెల 15న పోలీసులకు చిక్కాడు.

'బీసీ మహిళలకు ఉప కోటా కల్పించేలా చొరవ చూపండి'



కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న భాగ్యలక్ష్మి

గోల్నాక, న్యూస్‌టుడే: పార్లమెంటులో ఆమోదం పొందిన మహిళా బిల్లులో బీసీ మహిళలకు ఉప కోటా కల్పించాలని తెలంగాణ బీసీ మహిళా సంఘాల సమాఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు, జాతీయ వెనుకబడిన కులాల మహిళా సమాఖ్య ఛైర్‌పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి విజ్ఞప్తి చేశారు. ఈ అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూడాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని అభ్యర్థించారు. గురువారం ఆయన్ను కలిసి వినతిపత్రాన్ని అందజేశామన్నారు.

గ్రంథాలయంతో విజ్ఞానం



నాగారం సెరినిటీ పాఠశాలలో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఆకర్షణ, జంగిరెడ్డి

నాగారం, న్యూస్‌టుడే: చిన్ననాటి నుంచే పుస్తకాలను సేకరించి చదవడం అలవాటని, తోటి విద్యార్థులకు ఏదైనా చేయాలన్న తపనతో గ్రంథాలయాల్ని ఏర్పాటు చేస్తున్నట్లు 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్' సాధించిన ఆకర్షణ సతీష్ పేర్కొన్నారు. గురువారం నాగారంలో సెరినిటీ పాఠశాలలో తన 13వ ఏట 17వ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఇప్పటికే తెలంగాణలో 14, తమిళనాడులో 3 గ్రంథాలయాలను ఏర్పాటు చేశానన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాంలా తాను శాస్త్రవేత్త కావాలనుకుంటున్నానంది. 25వ గ్రంథాలయ ప్రారంభోత్సవానికి వస్తానని ప్రధాని మోదీ హామీ ఇచ్చారని తెలిపింది.

అవగాహనతోనే రోడ్డు ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న డా.ఎ.వి.గురువారెడ్డి

బేగంపేట, న్యూస్‌టుడే: సరైన అవగాహనతోనే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని బేగంపేటలోని కిమ్స్-సన్‌షైన్ ఆసుపత్రి ఎండీ డా.ఎ.వి.గురువారెడ్డి అన్నారు. ప్రపంచ ట్రామాడే సందర్భంగా గురువారం ఆసుపత్రిలో అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఏటా 1.3 మిలియన్ల మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ చట్టాల అమలు, మౌలిక సదుపాయాలు, వాహనాలు, రహదారి భద్రతా చర్యలపై దృష్టిసారించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. సర్వేజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో సొసైటీ టూ ప్రివెంట్ ఆక్సిడెంట్ అనే నినాదంతో రానున్న దశాబ్దకాలంలో దేశంలో 5 శాతం రోడ్డు ప్రమాదాలను తగ్గించే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు.

17 ఏళ్ల నాటి ప్రాజెక్టుకు మోక్షం

ఈనాడు, హైదరాబాద్: దాదాపు 17 ఏళ్ల నాటి ప్రాజెక్టు.. కేవలం 0.6 కిలోమీటర్ల టన్నెల్ పూర్తిచేస్తే చాలు ఏళ్ల నాటి మురుగు సమస్యకు పరిష్కారం దొరకుతుంది. గుత్తేదారు మధ్యలోనే చేతులెత్తేయడంతో ఏళ్లుగా ఆగిపోయింది. జీహెచ్‌ఎంసీ కార్యాలయంనుంచి నింబోలిఅడ్డా వరకు చేపట్టిన సివరేజ్ ట్రంక్ మెయిన్ ప్రాజెక్టుదీ పరిస్థితి. ఎట్టకేలకు దీనికి మోక్షం లభిస్తోంది. 90 రోజుల సీవరేజ్ డ్రైవ్ పనుల్లో భాగంగా ఈ ప్రాజెక్టు పనులు పూర్తిచేయాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి నిర్ణయించారు. ఓ ఏజెన్సీకి పనులప్పగించారు. గతంలో జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి నింబోలి అడ్డా వరకు 1800 ఎంఎం వ్యాసంతో సివరేజ్ ట్రంక్ మెయిన్ ప్రాజెక్టు చేపట్టాలని జలమండలి నిర్ణయించింది. రాజ్‌భవన్, సచివాలయం నుంచి అబిడ్స్, హిమాయత్‌నగర్, నారాయణగూడ, బర్కత్‌పుర, బాగ్‌లింగంపల్లి ప్రాంతాల్లోని మురుగు నీరు నాలాల్లో నేరుగా కలవకుండా అంబర్‌పేట్ ఎస్టీపీకి తరలించి, అక్కడ శుద్ధిచేసి మూసీలోకి వదలాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో, నింబోలి అడ్డా నుంచి అంబర్‌పేట్ వరకు రోడ్డు తవ్వకుండా టన్నెల్ నిర్మించాలని నిర్ణయించారు. 2007లో పనులు ప్రారంభించి 5 కి.మీ.కిగాను 4.4 కి.మీ. మేర పూర్తిచేశారు. చాలా ప్రాంతాల్లో భూగర్భంలో బండలు తేలడంతో ప్రాజెక్టు వ్యయం పెరిగి గుత్తేదారు చేతులెత్తేశాడు. గురువారం ఎండీ అశోక్‌రెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్ రవికుమార్ పనులను పరిశీలించారు.



ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న ఎండీ అశోక్‌రెడ్డి ఇతర అధికారులు

పన్ను పెంపు నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలి

అంబర్‌పేట, న్యూస్‌టుడే: దేవాలయాల సొమ్ముపై పన్ను పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని భాజపా ధార్మిక సెల్ రాష్ట్ర కన్వీనర్ అన్నావజ్జుల సూర్య ప్రకాష్ డిమాండ్ చేశారు. ఇప్పటికే 5 శాతం ఉన్న కామన్ గుడ్‌ఫండ్(సీజీఎఫ్) కాంట్రిబ్యూషన్‌ను 12 శాతానికి పెంచాలని నిర్ణయించడం అన్యాయమని.. ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. గురువారం అంబర్‌పేటలో మాట్లాడుతూ.. సీజీఎఫ్ కాంట్రిబ్యూషనే రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. ఆలయాల అభివృద్ధికి నిధులివ్వకుండా.. శిథిలావస్థకు చేరినవాటిని పునరుద్ధరించకుండా తిరిగి వాటి నుంచే పన్నును ఎలా వసూలు చేస్తారంటూ ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు.

బాధ్యతలు సమర్థంగా నిర్వహించాలి

సుల్తాన్‌బజార్: ఉద్యోగులు బాధ్యతలు సమర్థంగా నిర్వహిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని టీజీవోఏ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు సూచించారు. నూతన టీఎంహెచ్‌జీవోఏ కార్యవర్గం గురువారం కొలువుదీరింది. కోఠి డీఎంహెచ్ఎస్ ఆవరణలోని సంఘ కార్యాలయంలో టీజీవోఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఏలూరి శ్రీనివాసరావు, జి.సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు బి.శ్యామ్ సమక్షంలో టీఎంహెచ్‌జీవోఏ అధ్యక్షుడు కె.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి సునీల్‌రాజ్, అసోసియేట్ అధ్యక్షుడు ఎస్.రామాంజనేయులు, కోశాధికారి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు ఎ.చంద్రప్రకాశ్ బాధ్యతలు చేపట్టారు.



డీఎంఈ డా.వాణికి కార్యవర్గ జాబితా ఇస్తున్న ఏలూరి శ్రీనివాసరావు, సత్యనారాయణ తదితరులు

ప్రజా సంబురాలకు సిద్ధం



ఈనెల 20న నిర్వహించనున్న 'ప్రజా సంబురాలు' సందర్భంగా కేబీఆర్ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన భారీ బెలూన్ ఆకట్టుకుంటోంది. ఆరోజు మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు కార్యక్రమం నిర్వహించనున్నారు.

దవాఖానా.. ఇంత రద్దీనా?



ఇది జాతీయ రహదారి కాదు. నిమ్స్ ప్రాంగణమే. కొత్త నిర్మాణాల కారణంగా పార్కింగ్ స్థలం తగ్గడంతో వాహనాలను ఇలా రహదారికి ఇరువైపులా నిలిపారు. మరోవైపు పంజాగుట్ట నుంచి బంజారాహిల్స్ వెళ్లే వాహనదారులు నిమ్స్‌లో నుంచి వెళ్తుండటంతో ఇలా రద్దీ నెలకొంది.

చిరాకుల్లేని చిరాన్ కుంట



నగరం నడిబొడ్డున కబ్జాదారుల కన్ను పడని, 'హైడ్రా' అవసరం లేని చెరువుందంటే నమ్మగలరా? కేబీఆర్ పార్కులోని చిరాన్‌కుంట చెరువు ఇది. 15 ఎకరాల ఎఫ్‌టీఎల్, 3 ఎకరాల బఫర్ జోన్ ఉన్న ఈ చెరువుపై 140 రకాల పక్షులు, 15 రకాల ఇతర జీవజాలం ఆధారపడి ఉంది.

చికెన్ ధరలు				
	ఫాంరేటు	120–00	డ్రెస్డ్	206–00
	రిటైల్	142–00	స్కిన్‌లెస్	234–00

విద్యుత్తు చీఫ్ ఇంజినీర్ల బదిలీలు

ఈనాడు, హైదరాబాద్: నగరంలో విద్యుత్తు చీఫ్ ఇంజినీర్లు సమూలంగా బదిలీ అయ్యారు. ఆపరేషన్ విభాగంలోని వారిని కార్యాలయ పోస్టులకు, ఇన్నాళ్లు కార్యాలయాలకే పరిమితమైన వారిని ఆపరేషన్ విభాగాలకు బదిలీ చేస్తూ టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ బుధవారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

ఏటీసీ.. భవితకు దశదిశ

ప్రభుత్వ ఐటీఐలకు మహర్దశ ● 19 వరకు తక్షణ ప్రవేశాలు



రోబో వెల్డింగ్ మెషీన్లు


కార్వాన్, విజయనగర్‌కాలనీ: ప్రభుత్వ ఐటీఐల్లో పారిశ్రామిక రంగ అవసరాలను తీర్చేలా ఏటీసీ (అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్లు) అందుబాటులోకి వస్తున్నాయి. మల్లేపల్లి ప్రభుత్వ మోడల్ ఐటీఐలో ఏర్పాటు చేసిన ఏటీసీలో తరగతులు ప్రారంభమయ్యాయి.

ఇవీ కోర్సులు.. మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆర్టిసీయన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్ (మెకానికల్), మెకానికల్ బ్యాటరీ, ఎలక్ట్రికల్ వాహనాలు తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తారు. మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐతో పాటు ఇదే ప్రాంగణంలోని శాంతినగర్, సనత్‌నగర్, ఖైరతాబాద్, విజయనగర్‌కాలనీ ఐటీఐల్లోనూ ఏటీసీలు కేంద్రాలను నెలకొల్పుతున్నారు.

రూ.36 కోట్లతో నిర్మాణం.. ఒక్కో ఏటీసీ కేంద్రాన్ని 13500 చదరపు అడుగుల స్థలంలో ఏర్పాటు చేస్తున్నారు. భవనం, సామగ్రికి కలిపి రూ.36 కోట్లు ఖర్చు పెడుతున్నారు. ఏటీసీల్లో శిక్షణ పొందే వారికి మన దేశంలోనే కాకుండా విదేశాల్లో సైతం మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయని నిపుణులు చెబుతున్నారు.

విద్యార్థులకు అవకాశాలు

– పి.నర్సయ్య, డిప్యూటీ డైరెక్టర్, ఉపాధి శిక్షణ శాఖ



ఏటీసీల్లో శిక్షణ పొందే విద్యార్థులకు వంద శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయి. ఈ నెల 19 వరకు తక్షణ ప్రవేశాలు పొందొచ్చు. ప్రస్తుత పరిశ్రమల అవసరాలకు తగ్గట్లు కొత్త కోర్సుల్ని ప్రవేశపెట్టాం.

సైన్స్‌లో ఇప్పటికీ వెనకబడే ఉన్నాం

త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచంలోని పలు చిన్నదేశాలు విభిన్న అంశాల్లో ఆధిపత్యం ప్రదర్శిస్తున్నాయని, 140 కోట్లకుపైగా జనాభా కలిగిన భారత్ ఈ విషయంలో ఇంకా వెనకబడి ఉందని త్రిపుర గవర్నర్ ఇంద్రాసేనారెడ్డి అన్నారు. రక్షణ శాఖ మంత్రి, మాజీ శాస్త్రీయ సలహాదారు, డీఆర్‌డీవో మాజీ డైరెక్టర్ జనరల్, బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ మాజీ డైరెక్టర్, ఓయూ మొదటి తెలుగు ఉపకులపతి డాక్టర్ సూరి భగవంతం 115వ జయంతి గురువారం ఓయూలోని దూరవిద్యాకేంద్రం ఆడిటోరియంలో జరిగింది. ఈ సందర్భంగా ఇంద్రాసేనారెడ్డి మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం ఏఎన్‌ఆర్‌ఎఫ్ 2023లో శాస్త్ర, పరిశోధనలకు రూ.50 వేల కోట్లు కేటాయించిందని.. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రక్షణ రంగంలో అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా మన దేశం స్వయం సమృద్ధి సాధించడం వెనక డీఆర్‌డీవో డీజీగా డాక్టర్ సూరి భగవంతం వేసిన పునాదే కారణమని డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి కొనియాడారు. అన్ని ప్రాంతాల్లో భౌగోళిక ప్రాంతాలనుబట్టి 25 వరకు ప్రయోగశాలలు ఏర్పాటు ఆయన హయాంలోనే జరిగిందన్నారు.

ఐదుగురికి ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం.. ఈ సందర్భంగా డాక్టర్ సూరి భగవంతం ఎక్సలెన్స్ అవార్డులను ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బి.ఎస్.మూర్తి, ఇస్రో-ఎన్‌ఆర్‌ఎస్‌సీ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్‌చౌహాన్, ఇంటిలిజెంట్ డిజైన్ ఏఐ సీఈవో, సీటీవో రవి నిమ్మగడ్డకు ప్రదానం చేశారు. డీఆర్‌డీవో మిసైల్స్ అండ్ స్ట్రాటజిక్ సిస్టమ్స్ డీజీ యు.రాజబాబు స్థానంలో డీఆర్‌డీఎల్ డైరెక్టర్ జి.ఏ.ఎస్.మూర్తికి, రవి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్ మొచ్చెర్ల శశిభూషణ్ స్థానంలో శరత్‌కు అవార్డులను బహూకరించారు. ఓయూ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ, డీఆర్‌డీవో మాజీ డీజీ వి.భుజంగరావు, డాక్టర్ సూరి భగవంతం ఫౌండేషన్ వ్యవస్థాపక డైరెక్టర్ ఎస్.బి.రామ్ మాట్లాడారు.



మాట్లాడుతున్న ఇంద్రసేనారెడ్డి



అవార్డులు పొందిన బి.ఎస్.మూర్తి, జి.ఏ.ఎస్.మూర్తి, ప్రకాశ్‌చౌహాన్, రవి నిమ్మగడ్డ

'మంద కృష్ణమాదిగ 60 రోజులు ఓపిక పట్టండి'



మాట్లాడుతున్న రవి


బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసి 60 రోజుల గడువుతో ఏక సభ్య కమిషన్ వేయడం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమని మాదిగ జేఏసీ ఛైర్మన్ పిడమర్తి రవి తెలిపారు. మంద కృష్ణమాదిగ సహా మాదిగ సంఘాలు అప్పటివరకు ఉద్యమాలకు దూరంగా ఉండి సహకరించాలని కోరారు. ఈ నెల 22 నుంచి 60 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 'మాదిగ సమ్మేళనాలు' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. గజ్జల కాంతం, గోర రాజయ్య, ఓ.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చెట్టు కూలి వ్యక్తి దుర్మరణం

ఐఎస్ సదన్, న్యూస్‌టుడే: చెట్టు కూలి వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన ఐఎస్ సదన్ ఠాణా పరిధిలో బుధవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు వివరాల ప్రకారం.. జియగూడకు చెందిన బాలప్రకాశ్(57), కుమారుడు నవనీత్(27)తో కలిసి బంధువుల పెళ్లికి రాత్రి 10 గంటల సమయంలో సాగర్ రింగ్ రోడ్డు వైపు బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో నైటింగేల్ ఆసుపత్రి దాటుతుండగా రోడ్డు పక్కన ఉన్న వేప చెట్టు వారిపై కూలింది. బాలప్రకాశ్ తలకు తీవ్ర గాయం కావడంతో డీఆర్‌డీవో అపోలో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందారని వైద్యులు ధ్రువీకరించారు. వాహనం నడుపుతున్న కుమారుడు శిరస్త్రాణం ధరించడంతో త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. నవనీత్ సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

వేగంగా ఎందుకెళ్తున్నావని ప్రశ్నించినందుకు దాడి

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



అల్వాల్: వేగంగా ఎందుకు వెళ్తున్నావని ఓ యువకుడిని ప్రశ్నించడమే ఆ వృద్ధుడికి మరణశాసనమైంది. పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం.. టెంపుల్ అల్వాల్‌కు చెందిన **ఆంజనేయులు**(69) సెప్టెంబరు 30న బస్సు దిగి రోడ్డు దాటుతుండగా ప్రైవేటు సెక్యూరిటీ సంస్థలో పనిచేసే దీపక్(35) బైక్‌పై వేగంగా వెళ్తూ ఆంజనేయులును స్వల్పంగా ఢీకొట్టాడు. నెమ్మదిగా వెళ్లొచ్చుగా అని ఆంజనేయులు ప్రశ్నించడంతో ఆగ్రహం చెందిన దీపక్ దాడి చేసి తోసేయడంతో పడిపోయాడు. తలకు గాయం కావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

ఫైర్, హెల్త్‌సేఫ్టీ కోర్సుల్లో శిక్షణ

అంబర్‌పేట, న్యూస్‌టుడే: నేషనల్ సెంటర్ ఫర్ ఫైర్, సేఫ్టీ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో ఫైర్, హెల్త్ సేఫ్టీ కోర్సులలో గ్రేటర్ పరిధిలోని విద్యార్థుల శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 25లోపు www.ncttindia.com వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 63023 55872 ఫోన్‌నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గ్రూప్-I పరీక్షలకు 17,762 మంది

మేడ్చల్ కలెక్టరేట్: జిల్లా నుంచి గ్రూప్-1 మెయిన్ పరీక్షలకు 17,762 మంది హాజరవుతున్నారని,అన్ని ఏర్పాట్లు పక్కాగా చేపట్టినట్లు జిల్లా (స్థానిక సంస్థల) అదనపు కలెక్టర్ రాధికాగుప్తా తెలిపారు. గురువారం కలెక్టరేట్ నుంచి డీఆర్వో హరిప్రియతో కలిసి టీజీపీఎస్సీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి, చీఫ్ సెక్రటరీ శాంతికుమారి నిర్వహించిన జిల్లా వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి

కాచిగూడ: రైల్వేలోని ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని రైల్వే మజ్దూర్ యూనియన్ (ఆర్ఎంయూ) దక్షిణ మధ్య రైల్వే జోనల్ ప్రధాన కార్యదర్శి టి.ప్రభుచరణ్ డిమాండ్ చేశారు. ఉద్యోగులు, కార్మికులకు నష్టం కలిగిస్తున్న రైల్వే ప్రైవేటీకరణను అడ్డుకుంటామన్నారు. దేశవ్యాప్తంగా డిసెంబరు 4, 5, 6 తేదీల్లో జరగనున్న రైల్వే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల నేపథ్యంలో.. గురువారం ఉద్యోగులు, కార్మికులతో సమావేశం నిర్వహించారు.

నిర్వాసితులకు అన్నివిధాలా తోడ్పాటు: ఎమ్మెల్యే

చంచల్‌గూడ, సైదాబాద్: మూసీ నిర్వాసితులకు అన్నివిధాల తోడ్పాటునందిస్తామని మలక్‌పేట శాసనసభ్యుడు అహ్మద్ బలాల తెలిపారు. చావుని చంచల్‌గూడ చౌరస్తాలోని రెండు పడకల గృహ సముదాయంలో గురువారం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మూసీ నిర్వాసిత కుటుంబాలకే కాకుండా వారి పిల్లల చదువుల కోసం ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. చార్మినార్ జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి పావని, చావుని కార్పొరేటర్ సలాం షాహిద్, పట్టణ సామాజిక అభివృద్ధి అధికారి యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు. చార్మినార్ పంజేషాలోని తన క్యాంపు కార్యాలయంలో 28 మంది లబ్ధిదారులకు రూ.11,22,000 విలువ చేసే సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బలాల

ఎల్.బి.నగర్

•ఎల్.బి.నగర్ • మలక్‌పేట

మూసీ బాధితుల పోస్టు కార్డు ఉద్యమం

నాగోలు: మూసీ నదీ పరీవాహక ప్రాంత ప్రజలు ప్రభుత్వం చేపడుతున్న కూల్చివేతలకు వ్యతిరేకంగా పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. చైతన్యపురి డివిజన్ న్యూమారుతీనగర్ నార్త్‌లో గురువారం రాత్రి బాధితులంతా ఒక్క చోటుకు చేరి ఉత్తరాలు రాశారు. ఏళ్లుగా నివాసాలు ఏర్పాటు చేసుకొని, నివసిస్తున్న పేదలు, మధ్యతరగతి ప్రజల ఇళ్లు తొలగించకుండా, నదిని ప్రక్షాళన చేస్తే తమకేమీ అభ్యంతరం లేదన్నారు. సుందరీకరణ పేరిట తమ ఇళ్లను కూల్చి.. రోడ్డున పడేస్తే ఊరుకోబోమన్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలకు ఉత్తరాలు రాసి.. ఏకకాలంలో పోస్టు చేశారు.



శివారు కాలనీల్లో మురుగు సమస్యలు

వనస్థలిపురం: శివారు కాలనీల్లో నూతన భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనుల కోసం నిధులు కేటాయించాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం జలమండలి ఎండీ అశోక్ రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని శివారు కాలనీలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే నిధులు మంజూరు చేసి, పనులు చేపట్టాలని కోరారు.

పాదచారుల వంతెనలు నిర్మించాలి

హయత్‌నగర్: జాతీయ రహదారిపై రోడ్డు దాటేందుకు వీలుగా అవసరమైన ప్రదేశాల్లో పాదచారుల వంతెనలు నిర్మించాలని మన్సూరాబాద్, హయత్‌నగర్ డివిజన్ల కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం ట్రాఫిక్ డీసీపీ శ్రీనువాసులు, ఏసీపీ నవీన్‌రెడ్డి, సీఐ గట్టుమల్లు, ఆర్అండ్‌బీ డీఈ వెంకటేశ్వరరెడ్డి, ఏఈ శరత్ చంద్ర తదితరులతో కలిసి జాతీయ రహదారిపై పాదచారుల వంతెనలు నిర్మించాల్సిన ప్రదేశాలను పరిశీలించారు. భాగ్యలత, హెచ్‌డీఎఫ్‌సీ వద్ద నిర్మించాలని కోరారు. వనస్థలిపురం, మన్సూరాబాద్, హయత్‌నగర్ ప్రాంతాల అభివృద్ధి దృష్ట్యా పిల్లర్లతో కూడిన వంతెనలు నిర్మించాలని ఇప్పటికే కేంద్రమంత్రి నితిన్ గడ్కరి, మల్కాజిగిరి ఎంపీ రాజేందర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

సాయిసంస్థాన్‌లో చండీహోమం

దిల్‌సుఖ్‌నగర్: పౌర్ణమి సందర్భంగా గురువారం దిల్‌సుఖ్‌నగర్ సాయిసంస్థాన్‌కు భక్తులు బారులు తీరారు. బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సంస్థాన్ ప్రతినిధుల ఆధ్వర్యంలో బాబా సన్నిధిలో చండీహోమం నిర్వహించారు. అన్నదానం చేశారు. గడ్డిఅన్నవర క్షేత్రంలో సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు.

కృష్ణారెడ్డికి తెదేపా నేతల సత్కారం

కర్మన్‌ఘాట్: మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డిని గురువారం హస్తినాపురం తెదేపా నేతలు కలిశారు. హస్తినాపురం తెదేపా అధ్యక్షుడు గిరి యాదవ్ ఆధ్వర్యంలో ఆయనను సత్కరించారు.

పింఛనుదారుల సమస్యలు పరిష్కరించండి

మూసారాంబాగ్: పింఛనుదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల అసోసియేషన్ అధ్యక్షుడు మారం భరత్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఆర్‌లను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈహెచ్ఎస్ పథకాన్ని వర్తింపజేయాలని పేర్కొన్నారు.

యాదాద్రి ఆలయానికి విరాళం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ దివ్య విమానాన్ని స్వర్ణమయం చేసేందుకు హైదరాబాద్ సైదాబాద్‌కు చెందిన దాత కంకర్ సుధీర్‌రెడ్డి రూ.10,00,116 విరాళాన్ని చెక్కు రూపేణా గురువారం ఆలయ ఈవో భాస్కర్‌రావుకు అందజేశారు. అధికారులు, పూజారులు దాతకు ప్రత్యేక దైవ దర్శనం కల్పించి, ఆశీస్సులను అందజేశారు.

స్థలం ఉంది.. శ్రద్ధ కరవైంది!

బండ్లగూడ, న్యూస్‌టుడే

బండ్లగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పక్కా భవనం లేదు. నేటికీ రేకుల నిర్మాణంలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. సమీపంలోనే ప్రభుత్వం స్థలం కేటాయించినా.. పక్కా భవన నిర్మాణం చేపట్టడం లేదు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంపై కబ్జాదారుల కన్ను పడింది. ఇటీవల స్థలం ప్రహరీ సైతం ధ్వంసం చేశారు.



ప్రహరీ కూల్చారిలా..

పక్కా భవనం లేక విద్యార్థుల అవస్థలు

ఇదీ పరిస్థితి..

బండ్లగూడ ప్రభుత్వ పాఠశాలకు ఏళ్ల తరబడి సొంత భవనం లేదు. ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా. . అందుకు తగ్గట్టు వసతులు సమకూరడం లేదు. రేకులతో కూడిన రెండు గదులు, ఓ వరండాలోనే ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే 1999లో బండ్లగూడ సర్వే నంబర్-36/6లోని ప్రభుత్వ స్థలంలో 1.04 ఎకరాలను ఉప్పల్ మండల అధికారులు కేటాయించారు. తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాల భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. గోడల మొదలుకాగానే, 2000లో కొందరు వ్యక్తులు.. అది తమ ఆస్తిగా పేర్కొంటూ కోర్టును ఆశ్రయించారు. 2012లో అప్పటి తహసీల్దార్ సర్వే చేపట్టి ప్రభుత్వ భూమిగా కోర్టును నివేదిక సమర్పించడంతో, కోర్టు ప్రభుత్వం భూమిగా తేల్చింది. తదుపరి సర్వశిక్ష అభయాన్ ఆధ్వర్యంలో స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించారు. తరగతి గదుల నిర్మాణానికి పునాదులు, దిమ్మెల నిర్మాణం ప్రారంభించారు. ఇంతలో మరోసారి ప్రైవేటు వ్యక్తులు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయాయి. పాఠశాలకు ప్రభుత్వం కేటాయించిన 1.04 ఎకరాల భూమి విలువ.. ప్రస్తుతం రూ.20 కోట్ల వరకు ఉంటుంది. మూడు వైపుల ప్రభుత్వ స్థలం, ఒకవైపు రోడ్డు ఉన్న స్థలం ప్రైవేటు వ్యక్తులకు ఎలా చెందుతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. హద్దులు, రికార్డులు పక్కాగా ఉన్నా.. అధికారుల్లో చొరవ లోపించడంతో సమస్యకు పరిష్కారం లభించడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. తాజాగా దసరా సెలవుల్లో కొందరు వ్యక్తులు పాఠశాల స్థలం ప్రహరీ కూల్చివేశారు. లోపలికి చొరబడి చెట్లను కొట్టివేశారు.

పాఠశాల స్వరూపమిలా..

తరగతులు: 1 నుంచి 5 వరకు

విద్యార్థుల సంఖ్య: 106

ఉపాధ్యాయులు: ముగ్గురు

గదులు: రెండు రేకుల షెడ్డు, ఒక వరండా



బండ్లగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

పాఠశాలకు దక్కేలా కృషి..

- రామారావు, మండల విద్యాధికారి, ఉప్పల్

నేను ఇటీవల బదిలీపై ఉప్పల్ మండలానికి వచ్చాను. బడికి కేటాయించిన స్థలానికి సంబంధించిన పూర్తి రికార్డులు తెప్పించుకొని పరిశీలిస్తా. రెవిన్యూ అధికారులను కలుపుకొని వెళ్లి స్థలం ప్రభుత్వ బడికి దక్కేలా చర్యలు తీసుకుంటాం.

మళ్లీ రాలేదు.. - అశ్విని, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్, ఉప్పల్

దసరా సెలవుల్లో కొందరు వ్యక్తులు ప్రభుత్వ పాఠశాలలకు కేటాయించిన స్థలంలో పనులు చేస్తున్నారనే సమాచారం అందింది. వెంటనే పనులు నిలిపి వేయించారు. తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, వారు చెప్పడంతో..ఆ దస్త్రాలు తీసుకోని మండల కార్యాలయానికి రమ్మని సూచించగా, నేటికీ రాలేదు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.1 గంట మధ్య

ఎల్బీనగర్: 76759 19030

మలక్‌పేట: 80085 73284

హయత్‌నగర్: 98336 64897

కర్మన్‌ఘాట్: 94400 32872

బండ్లగూడ: 96034 78579

మూసారాంబాగ్: 79933 00559

న్యూస్‌టుడే, సైదాబాద్

? సైదాబాద్ లోకాయుక్త కాలనీ ఉద్యానం ఎదుట నెల కిందట ఏర్పాటు చేసిన మండపం నేటికీ తొలగించలేదు. ఉత్సవాలు ముగిసినా స్పందించడం లేదు. – శోభారాణి, సైదాబాద్

✓ క్షేత్రస్థాయిలో పరిశీలించి, తగిన పరిష్కార చర్యలు తీసుకుంటాం.
–అజయ్‌కుమార్, ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్, సైదాబాద్

యువతిపై అత్యాచారం.. దోషికి 20 ఏళ్ల కారాగారం

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ యువతిపై అత్యాచారానికి పాల్పడిన యువకుడికి న్యాయస్థానం 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.6,000 జరిమానా విధించింది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.మంజులాదేవి కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌కు చెందిన మహ్మద్ ఫరీద్(25) స్థానికంగా సైకిళ్ల వ్యాపారం నిర్వహించేవాడు. 2017లో ఓ యువతి (21)తో చనువు పెంచుకొని నిత్యం చరవాణిలో మాట్లాడేవాడు. 2017 సెప్టెంబరు 12 అర్ధరాత్రి ఆమె ఇంటిలోకి చొరబడి పెళ్లి చేసుకుంటానని నమ్మించి, అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అనంతరం పెళ్లికి నిరాకరించడంతో యువతి ఫిర్యాదు మేరకు ఆర్జీఐ విమానాశ్రయ పోలీసులు నిందితుడిని రిమాండుకు తరలించారు. కేసు విచారించిన జిల్లా 13వ అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి వాణి గురువారం తుది తీర్పు వెలువరించారు.

చెల్లని చెక్కులిచ్చిన వ్యక్తికి ఆరు నెలల జైలు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: తీసుకున్న అప్పు తిరిగి తీర్చడానికి రెండు చెల్లని చెక్కులిచ్చి మోసం చేసిన వ్యక్తికి న్యాయస్థానం ఆరు నెలల జైలు శిక్ష, రూ.1.50 లక్షల జరిమానా విధించింది. జరిమానాలో ఫిర్యాదీ రూ.1.40 లక్షలు పరిహారంగా పొందొచ్చని రంగారెడ్డి జిల్లా 6వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ శ్రద్ధాసెహగల్ గురువారం తీర్పునిచ్చారు. ఫిర్యాదీ తరఫు న్యాయవాది యాసాని చంద్రారెడ్డి కథనం ప్రకారం.. బాలాపూర్ పరిధి ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీకి చెందిన నాగరాజు 2014లో మీర్‌పేటలోని బృందావన్ కాలనీకి చెందిన ఎం.లక్ష్మి వద్ద రూ.85,000 అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీర్చేందుకు నాగరాజు ఇచ్చిన రెండు చెక్కులు చెల్లలేదు. ఈ విషయమై లక్ష్మి లీగల్ నోటీస్ పంపినప్పటికీ, నాగరాజు స్పందించలేదు. దీంతో బాధితురాలు న్యాయస్థానంలో కేసు దాఖలు చేశారు.

ఇంటి నుంచి వెళ్లి.. చెరువులో శవమై తేలి..



దిల్‌సుఖ్‌నగర్, న్యూస్‌టుడే: మతిస్థిమితం లేని యువకుడు సరూర్‌నగర్ చెరువులో శవమై కనిపించిన ఘటన సరూర్‌నగర్ ఠాణా పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రకు చెందిన కాట్రమోని కిశోర్‌కుమార్ (34) తల్లిదండ్రులు, సోదరులతో కలిసి కొంతకాలంగా నగరంలోని నందనవనంలో నివసిస్తున్నారు. కూలీ పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. అయితే కొంతకాలంగా మతిస్థిమితం లేకపోవడంతో కూలీ పనులు మానేశాడు. ఈ నెల 15న ఇంటి నుంచి బయటకు వెళ్లి.. తిరిగిరాలేదు. గురువారం చెరువులో మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం.. ఇద్దరిపై కేసు

హయత్‌నగర్, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేస్తున్న ఇద్దరు వ్యక్తులపై హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక పోలీసుల కథనం ప్రకారం.. హయత్‌నగర్ పరిధిలో జాతీయ రహదారిపై ఉన్న ఓ బేకరీ టీ స్టాల్‌లో టీ తయారీపై.. ఇద్దరు యువకులు వీడియో ద్వారా సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేశారు. బేకరీ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

ప్రో కబడ్డీ పోటీల్లో నాగోలు విద్యార్థుల ముందంజ



నాగోలు, న్యూస్‌టుడే: నాగోలు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రోకబడ్డీ జూనియర్స్ పోటీల్లో ముందంజ వేశారు. ఇటీవల ఉప్పల్ మండల స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి ప్రోకబడ్డీ నిర్వాహకుల దృష్టిని ఆకర్షించిన విషయం తెలిసిందే. ఆల్మాస్‌గూడలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో రెండు జట్లపై విజయం సాధించారు. అక్టోబరు 31న గచ్చిబౌలి స్టేడియంలో జరిగే ఫేజ్-2 పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను నాగోలు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీదేవి, పీఈటీ శంకర్‌నాయక్, ఉపాధ్యాయులు అభినందించారు.

చిన్నారులకు క్విజ్ ..

కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి క్విజ్ పోటీలు దోహదపడతాయని పలువురు పేర్కొన్నారు. బాలాపూర్ ఆర్చ్ ఫౌండేషన్, ఇఫ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కర్మన్‌ఘాట్‌లో గురువారం 'యురేకా' పేరిట క్విజ్ పోటీలు నిర్వహించారు. మీర్‌పేట, బడంగ్‌పేట, మల్లాపూర్, బాలాపూర్, నాదర్‌గూల్, చంపాపేట, కర్మన్‌ఘాట్, అల్మాస్‌గూడ, జిల్లాల్‌గూడ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. మల్లాపూర్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విజేతలకు జ్ఞాపికలు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఆయా సంస్థల ప్రతినిధులు శ్యామ్, ప్రవీణ్, శ్రీనివాస్‌రెడ్డి, సాంకిషా, నివేదితారెడ్డి, అర్రా, రద్ది, నవ్య, మాధవి పాల్గొన్నారు.



జిమ్నాస్టిక్‌లో అక్కాతమ్ముళ్లకు పతకాలు



సైదాబాద్, న్యూస్‌టుడే: మలక్‌పేట పరిధి ఆనంద్‌నగర్‌కు చెందిన అక్కాతమ్ముళ్లు జిమ్నాస్టిక్ పోటీలో బంగారు, కాంస్య పతకాలు సాధించారు. హైదరాబాద్ డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇంటర్ స్కూల్స్ డిస్ట్రిక్ట్ జిమ్నాస్టిక్ పోటీలు హనుమాన్ వ్యాయామశాల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. 17 ఏళ్లలోపు విభాగంలో అక్క కావలి పూజిత బంగారు, తమ్ముడు రణదీప్ కాంస్య పతకాలు సాధించినట్లు హైదరాబాద్ జిల్లా స్థాయి పాఠశాలల ఇన్‌ఛార్జి శ్రీనివాస్ తెలిపారు. కోచ్ చంద్రకాంత్, క్రీడాకారులను పలువురు అభినందించారు.

భూసేకరణ చట్టం-2013 అమలుకు వినతి



వెంకటయ్యకు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, దళిత కుటుంబాలు

నారాయణగూడ, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూసేకరణ చట్టం-2013 అమలు చేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కోరారు. చైతన్యపురి డివిజన్ పరిధిలోని లక్ష్మీనరసింహ కాలనీవాసులతో కలిసి గురువారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్‌పర్సన్ బక్కి వెంకటయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు తాము వ్యతిరేకం కాదని, కానీ అక్కడి నివాసితులకు న్యాయం చేయాలని విన్నవించారు. ఆ ప్రాంతంలో సుమారు 30 దళిత కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. గత 15 రోజులుగా అధికారులు కాలనీలో ఇళ్లను కూల్చివేస్తామని చెబుతుంటే.. నివాసితులు భయాందోళనకు గురి అవుతున్నారన్నారు. స్పందించిన ఛైర్మన్.. బాధితులకు అన్యాయం జరగకుండా చూస్తామన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి..

కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: నగరంలోని ఆలయాల అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. దీపావళి ఉత్సవాలను పురస్కరించుకుని చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆలయంలో నిర్వహించే వేడుకల్లో పాల్గొనాలని కోరుతూ ఆలయ ట్రస్టీ శశికళ ఆధ్వర్యంలో గురువారం ప్రతినిధులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగాలని సూచించారు. ధ్యానాంజనేయ ఆలయ పాలక మండలి మాజీ ధర్మకర్త మధుసాగర్ పాల్గొన్నారు.

అండర్-14 క్రికెట్ విజేత మహబూబ్‌నగర్

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే: గద్వాల ఇండోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు నిర్వహించిన అండర్-14 బాలుర రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. రాష్ట్రం నుంచి పది జిల్లాల జట్లు హాజరు కాగా, మహబూబ్‌నగర్ ప్రథమ, రంగారెడ్డి, హైదరాబాద్ సంయుక్తంగా ద్వితీయ, నల్గొండ తృతీయ స్థానాలు దక్కించుకున్నాయని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జితేందర్ తెలిపారు. అనంతరం విజేతలకు జోగులాంబ గద్వాల జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్ ట్రోఫీ అందజేశారు. ఈ క్రమంలో పతకాలను, ప్రశంసా పత్రాలను ఆయన చేతులమీదుగా బహూకరించారు. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని కన్వీనర్ శ్రీనివాసులు తెలియజేశారు. జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి బీఎస్ ఆనంద్, సూపరింటెండెంట్ రామకృష్ణారావు, విజయ్‌పాల్, కృష్ణయ్య, బీసన్న పాల్గొన్నారు.

అడ్డగోలుగా తవ్వకాలు

కనీస అవగాహన లేకుండా తవ్వకాలు చేపట్టడంతో బండ్లగూడ చౌరస్తాలో భూగర్భ డ్రైనేజీ పైపులైను ధ్వంసమైంది. శ్రావణశ్రీ ఎన్‌క్లేవ్ సమీప ప్రాంతాల్లో ముంపు నివారణకు జీహెచ్ఎంసీ నాలా పనులు చేపట్టింది. గతంలో మధ్యలో నిలిచిన పనులను రెండు నెలల తర్వాత గురువారం ప్రారంభించారు. తవ్వకాలు చేస్తుండగా, బండ్లగూడ గ్రామానికి చెందిన భూగర్భ డ్రైనేజీ పైపులైను ధ్వంసమైంది. సమాచారం అందుకున్న జలమండలి అధికారులు క్షేత్ర స్థాయికి వచ్చి.. పరిస్థితిని పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడామని, వారే మరమ్మతులు చేస్తారని జలమండలి డీజీఎం మాధవి తెలిపారు. - న్యూస్‌టుడే, బండ్లగూడ



ధ్వంసమైన డ్రైనేజీ పైపులైన్

హరిణి వనస్థలిలో పద్మశాలీ దసరా మేళా 20న

నారాయణగూడ, న్యూస్‌టుడే: పద్మశాలీ సంఘం (ఎల్బీనగర్ సర్కిల్) ఆధ్వర్యంలో ఈ నెల 20న పద్మశాలి దసరా మేళా నిర్వహించనున్నట్లు అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ మహిళా అధ్యక్షురాలు వనం దుశ్యంతల వెల్లడించారు. జింకల పార్కులోని అనన్య ఎకో పార్కు ఆవరణలో జరిగే ఈ మేళాకు పద్మశాలీ మహిళలు తరలిరావాలని కోరారు. నారాయణగూడలోని పద్మశాలీ భవనంలో గురువారం మేళా వివరాలు వెల్లడించారు. తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గుంటక రూప, గ్రేటర్ మహిళా అధ్యక్షురాలు పొరండ్ల శారద, ఎల్బీనగర్ పద్మశాలీ సంఘం మహిళా అధ్యక్షురాలు రావిరాల సంధ్యారాణి తదితరులు పాల్గొని కరపత్రాన్ని ఆవిష్కరించారు. స్థానిక ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన పద్మశాలీ మహిళలకు.. అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు సముచిత స్థానం కేటాయించాలని డిమాండ్ చేశారు. అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, ఎల్బీనగర్ సర్కిల్ అధ్యక్షుడు పున్న గణేశ్ నేత, సంఘ నాయకులు పాల్గొన్నారు.



కరపత్రిక ఆవిష్కరణలో సంఘం ప్రతినిధులు

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

బండ్లగూడ, న్యూస్‌టుడే: ఆనంద్‌నగర్‌లో రోడ్డు పనులు జరుగుతున్నందున.. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టారు. చౌరస్తా వైపు వాహనాలు రాకుండా, గోపాలకృష్ణపురం కాలనీ రోడ్డు నంబరు-1, 2, 3 నుంచి మళ్లించారు. ఆనంద్‌నగర్ చౌరస్తాలో రోడ్డు పనుల కారణంగా వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను వివరిస్తూ బుధవారం 'ఆనంద్‌నగర్‌కెళ్తే అవస్థలే' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన సీఐ వెంకటేశ్వర్లు గురువారం జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ ఈఈ ఆశాలత, ఏఈ, దీపక్‌తో కలసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. సమస్య పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. వాహనాల దారి మళ్లింపునకు గోపాలకృష్ణపురం, ఆనంద్‌నగర్ రోడ్డు నంబర్-3, ఫత్తుల్లాగూడ కొత్త రోడ్డు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించారు. పనుల ప్రాంతంతో పాటు నాగోల్ చౌరస్తాలో బోర్డులు ఏర్పాటు చేయిస్తామన్నారు. చౌరస్తాలో రోడ్డుకు అడ్డంగా ఉన్న స్తంభాలు, దిమ్మెలు తొలగించాలని సూచించారు.



ఈఈ, ఏఈలతో చర్చిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

ఈనాడు కథనానికి స్పందన

ఆదర్శ వివాహం.. వధువు అదృశ్యం

సైదాబాద్, న్యూస్‌టుడే: యువతీయువకులు ప్రేమించుకొని ఆరు నెలల కిందట ఆదర్శ వివాహం చేసుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే చస్తానని బెదిరిస్తూ, ఉత్తరం రాసి ఈ నెల 10న ఇంట్లోంచి వెళ్లిపోయింది. తన భార్య తనవద్దకు వచ్చేలా చూడాలని కోరుతూ గురువారం భర్త పోలీసులను ఆశ్రయించాడు. సైదాబాద్ ఠాణా ఇన్‌ఛార్జి అజయ్‌కుమార్ కథనం ప్రకారం.. ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడు, ఓ యువతి ప్రేమ పెళ్లి చేసుకున్నారు. మనస్పర్థలు తీవ్రస్థాయికి చేరడంతో ఈ నెల 10న యువతి ఇంట్లోంచి వెళ్లిపోయింది. తన కోసం వెతకొద్దని, పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఆత్మహత్య చేసుకుంటానని లేఖ రాసింది. ఈ నెల 11న ఇన్‌స్టాగ్రాం ద్వారా భర్తకు ఓ సంక్షిప్త సందేశం పంపింది. తాను ఓ హాస్టల్‌లో చేరానని, స్వతంత్ర జీవితం గడపాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. భార్యకు కౌన్సెలింగ్ నిర్వహించి, తనవద్దకు వచ్చేలా చూడాలని భర్త పోలీసులను ఆశ్రయించాడు. ఎస్సై నాగిశెట్టి సాయికృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హయత్‌నగర్‌లో యువతి..

హయత్‌నగర్, న్యూస్‌టుడే: ఓ యువతీ అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీసు ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హయత్‌నగర్ గ్రీన్‌వుడ్ కాలనీలో నివాసముంటున్న యువతి(22) ఓ షాపింగ్ మాల్‌లో పనిచేస్తుంది. బుధవారం ఉదయం పనికి వెళ్లి, తిరిగి రాలేదు. యువతి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిపోయిన బాలుడిని కుటుంబసభ్యులకు అప్పగింత

సైదాబాద్: దసరా సెలవులకు మామయ్య వద్దకు వచ్చిన బాలుడు దారి తప్పి కనిపించకుండా పోయిన ఘటన మలక్‌పేట పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అన్నమయ్య జిల్లా మదనపల్లె పరిధి చిన్నతిప్ప సముద్రానికి చెందిన జంపాల చైతన్య (12) దసరా సెలవులకు మూసారాంబాగ్ డివిజన్ సలీమ్‌నగర్‌లో ఉండే మామయ్య ఇంటికి వచ్చాడు. గురువారం ఇంటి వద్దనే ఆడుకుంటూ దారితప్పి దిల్‌సుఖ్‌నగర్‌కు చేరాడు. ఏడుస్తున్న బాలుడిని మలక్‌పేట పోలీసులు గుర్తించి, వివరాలు తెలుసుకున్నారు. చిరునామాతో పాటు చరవాణి నంబర్ చెప్పలేకపోయాడు. కుటుంబసభ్యులు సైతం బాలుడి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు సమాచారం అందడంతో, ఎస్సై సురేశ్ వారిని ఠాణాకు రప్పించి బాలుడిని అప్పగించారు.

పేదలను కబ్జాదారులనడం దారుణం

మూసీ బాధితుల తరఫున పోరాటం చేస్తాం : కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్: మూసీ సుందరీకరణ పేరిట పేదల ఇళ్లు కూలుస్తామంటే ఊరుకునేది లేదంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హెచ్చరించారు. వారికి భారాస అండగా ఉంటుందన్నారు. అనుమతులిచ్చి కరెంట్ బిల్లులు, ఇంటి పన్నులు కట్టించుకున్న కాంగ్రెస్ వాళ్లే పేదలను కబ్జాదారులనడం దారుణమని మండిపడ్డారు. కాంగ్రెస్ 100 రోజుల్లో ప్రజలకు 6 గ్యారంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చి ఇప్పుడు పేద ప్రజల ఇళ్లను కూల్చేస్తుందని మండిపడ్డారు. బాధితులు ఏమాత్రం భయపడాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. మూసీ ప్రాజెక్ట్ పేరుతో కాంగ్రెస్ సర్కార్ తమ ఇళ్లను కూల్చే ప్రయత్నం చేస్తోందంటూ తెలంగాణ భవన్‌కు వచ్చిన బాధితులతో కేటీఆర్ సమావేశమయ్యారు. 50 ఏళ్లుగా మూసీ పరీవాహక ప్రాంతంలో ఉంటున్న తమ ఇళ్లను కూల్చివేస్తామంటే ఎక్కడికి వెళ్లేదంటూ బాధితులు వాపోయారు. ఓట్లేసి గెలిపించిన ప్రజాప్రతినిధులను నిలదీయాలని కేటీఆర్ వారికి సూచించారు.



మూసీ పరీవాహక ప్రాంతానికి చెందిన మహిళలతో మాట్లాడుతున్న కేటీఆర్

స్నేహపూర్వక పర్యాటక రాష్ట్రంగా తీర్చిదిద్దాలి

శంషాబాద్: తెలంగాణను పర్యాటక స్నేహపూర్వక రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో ఆటో, క్యాబ్, ట్యాక్సీ డ్రైవర్లు కీలక పాత్ర పోషిస్తారని శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ చీఫ్ ప్యాసింజర్స్ ఎక్స్‌పీరియన్స్ ఆఫీసర్ మిథుల్ శర్మ అన్నారు. విమానాశ్రయంలో గురువారం రాష్ట్ర పర్యాటక శాఖ, టీహెచ్ఎంఐసీఈలు సంయుక్తంగా నిర్వహించిన 'అతిథి దేవోభవ-2024' రెండో ఎడిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నిపుణుల సమక్షంలో 100 మంది క్యాబ్‌డ్రైవర్లకు శిక్షణ ఇచ్చారు. ప్రయాణంలో అస్వస్థతకు గురైన ప్రయాణికులకు చేయాల్సిన సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. భద్రత చర్యలతో క్యూఆర్ కోడ్లతో కూడిన స్టిక్కర్లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

రోడ్డు విస్తరణ పనుల్లో కదలిక

మెహిదీపట్నం-మల్లేపల్లి మార్గంలో తీరనున్న ట్రాఫిక్ వెతలు



మల్లేపల్లి చౌరస్తాలో ఇటీవల కూల్చివేసిన కట్టడం

– న్యూస్‌టుడే, ఆసిఫ్‌నగర్

రెండున్నర దశాబ్దాలుగా కొనసాగుతున్న మెహిదీపట్నం-మల్లేపల్లి రోడ్డు విస్తరణ పనుల్లో కదలిక ప్రారంభమైంది. రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ ఇబ్బందులు దూరం చేసేందుకు ఈ రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని బల్దియా, పోలీసులు అధికారులు నిర్ణయించారు. స్థానిక పరిస్థితులను అధిగమించి వచ్చే ఏడాది మార్చి నాటికి పనులు పూర్తి చేసేలా బల్దియా సర్కిల్ అధికారులు ముందుకు సాగుతున్నారు. ట్రాఫిక్ పరంగా నగరంలో మెహిదీపట్నం ఎంతో కీలకమైంది. వాహనాల రద్దీకి అనుగుణంగా రహదారులు విస్తరించాలని గతంలో నగరంలో పర్యటించిన ఉన్నత స్థాయి సమన్వయ కమిటీ నిర్ణయించింది. ఇందులో భాగంగా మెహిదీపట్నం-మల్లేపల్లి రహదారిని విస్తరించాలని అధికారులు నిర్ణయించారు.

170 కట్టడాల తొలగింపు

ఈ మార్గంలో దాదాపు 185 కట్టడాలు తొలగించాల్సి ఉంటుందని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు తేల్చారు. 2000లో ప్రారంభమైన రోడ్డు విస్తరణ పనులు 'ఒక అడుగు ముందుకు.. నాలుగు అడుగులు వెనక్కి' అన్నట్లు తయారైంది. ఇప్పటి వరకు 170 కట్టడాలను తొలగించి నష్టపరిహారం అందజేశారు. ఆసిఫ్‌నగర్ దీవాన్ అంజుమన్, సుల్తాన్‌మిల్లు చౌరస్తా, నొబుల్‌టాకీస్(మల్లేపల్లి చౌరస్తా) వద్ద ఇంకా కట్టడాలను కూల్చివేయాల్సి ఉంది.

మల్లేపల్లి చౌరస్తాలో..

మల్లేపల్లి చౌరస్తాలో రోడ్డు విస్తరణ పనులు దాదాపు పూర్తయ్యాయి. రోడ్డు మధ్యలో ఉన్న కొన్ని కట్టడాల కారణంగా పనులు నిలిచాయి. ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్, అధికారులు ఇటీవల మల్లేపల్లిలో పర్యటించారు. రోడ్డు విస్తరణ పూర్తి అయితే చౌరస్తా అందంగా తీర్చిదిద్దుతామని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో వారం కిందట చౌరస్తాలో రోడ్డుకు అడ్డుగా ఉన్న కట్టడాన్ని పోలీసు బందోబస్తు మధ్య టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. దీంతో మరోసారి రహదారి విస్తరణపై ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

చార్మినార్

• చార్మినార్ • కార్వాన్ • నాంపల్లి • గోషామహల్
• చాంద్రాయణగుట్ట • యాకుత్‌పుర • బహదూర్‌పుర

పేదలను కబ్జాదారులనడం దారుణం: కేటీఆర్



బాధితులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్: మూసీ ప్రాజెక్టు పేరుతో పేదల ఇళ్లు కూల్చుతామంటే ఊరుకునేది లేదంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హెచ్చరించారు. వారికి భారాస అండగా ఉంటుందన్నారు. అనుమతులిచ్చి కరెంట్ బిల్లులు, ఇంటిపన్నులు కట్టించుకున్న కాంగ్రెస్ వాళ్లే పేదలను కబ్జాదారులనడం దారుణమని మండిపడ్డారు. కాంగ్రెస్ 100 రోజుల్లో ప్రజలకు 6 గ్యారంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చి ఇప్పుడు పేద ప్రజల ఇళ్లను కూల్చేస్తుందని మండిపడ్డారు. బాధితులు ఏమాత్రం భయపడాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. తెలంగాణ భవన్‌కు వచ్చిన బాధితులతో కేటీఆర్ సమావేశమయ్యారు. 50 ఏళ్లుగా మూసీ పరివాహక ప్రాంతంలో ఉంటున్న తమ ఇళ్లను కూల్చివేస్తామంటే ఎక్కడికి వెళ్లేదంటూ బాధితులు వాపోయారు.

గుట్టుగా పారేసి.. గుట్టగా పేరి



ధూల్‌పేట: అబ్కారీ రాణా ఎదుట చెత్త గుట్టలా పేరింది. స్థానికులు రాత్రిపూట గుట్టుచప్పుడు కాకుండా పారేస్తున్నారు. దుర్వాసనతో వీధులు నిర్వహించడం కష్టంగా మారిందని ఉద్యోగులు వాపోతున్నారు.

స్తంభం పడిందో.. ప్రాణం గోవిందా



సాలార్‌జంగ్ మ్యూజియం రోడ్డులో విద్యుత్తు స్తంభం విరిగి ప్రమాదకరంగా ఉంది. అధికారులు త్వరగా స్పందించి మార్చాలని కోరుతున్నారు.

ఆలుగడ్డ కిలో రూ.37

మెహిదీపట్నం: రైతుబజార్‌లో (గురువారం నాటి ధరలు, కిలో రూ.లో) టమాటా 49, వంకాయ 35, బెండకాయ 55, పచ్చిమిర్చి 40, కాకరకాయ 35, బీరకాయ 45, క్యాబేజీ 26, బీన్స్ 125, క్యారెట్ 53, దొండ 35, చిక్కుడుకాయ 65, గోకరకాయ 40, బీట్‌రూట్ 32, క్యాప్సికం 70, ఆలుగడ్డ 37, కీర 23, దోసకాయ 35, సొరకాయ 17, పొట్లకాయ 23, ఉల్లిగడ్డ 45, చామగడ్డ 40.

బాల్య వివాహాలతో అనర్థాలు

ఆసిఫ్‌నగర్: మంగళ్‌హాట్ గుషానగర్, ఇందిరానగర్‌లో బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు, బాలకార్మికులపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంగళ్‌హాట్ ఎస్సై అష్రఫ్‌ఖాన్, ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. స్థానికుల చేత ప్రతిజ్ఞ చేయించారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది



కొత్తగా చేరిన ఉపాధ్యాయులతో డిప్యూటీ ఈఓ రమణరాజు

కార్వాన్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని ఆసిఫ్‌నగర్ మండల (గోల్కొండ జోన్) ఉప విద్యాశాఖాధికారి హెచ్‌వీ రమణరాజు పేర్కొన్నారు. కొత్తగా ఉపాధ్యాయులుగా ఎంపికైన 68 మంది గురువారం విజయనగర్‌కాలనీలోని డిప్యూటీ ఈఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శ విద్యాలయాలుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కొత్తగా విధుల్లో చేరిన వారు బాగా పనిచేసి మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. గుడిమల్కాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోలిపురం బాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు జయకుమార్, రామేశ్వర్, కె.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్తు చీఫ్ ఇంజినీర్ల బదిలీలు

ఈనాడు, హైదరాబాద్: రంగారెడ్డి జోన్ ఆపరేషన్ సీఈ ఆనంద్ కార్పొరేట్ కార్యాలయంలోని పీ అండ్ ఎంఎం విభాగానికి బదిలీ అయ్యారు. మాస్టర్‌ప్లాన్ సీఈ పాండ్య నాయక్ రంగారెడ్డి జోన్ సీఈగా బదిలీ అయ్యారు. మేడ్చల్ జోన్ సీఈగా కామేశ్ బాధ్యతలు చేపట్టారు. మేడ్చల్ జోన్ సీఈగా ఉన్న సాయిబాబు కార్పొరేట్ కార్యాలయం ఆర్‌ఏసీకి బదిలీ చేశారు. కమర్షియల్ నుంచి మాస్టర్‌ప్లాన్ సీఈగా నరసింహస్వామి బదిలీ అయ్యారు. రూరల్ జోన్ సీఈగా బాలస్వామి, కమర్షియల్ సీఈగా ప్రశాంతి, మెట్రోజోన్ సీఈగా చక్రపాణికి బాధ్యతలు అప్పగించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

చాంద్రాయణగుట్ట-8008573324, కార్వాన్-8008573341, నాంపల్లి-8008573338, గోషామహల్-8008573334, యాకుత్‌పుర-8008573307, చార్మినార్-9100581018

– న్యూస్‌టుడే, ఉస్మానియా ఆసుపత్రి

? ఉస్మానియా ఆసుపత్రి ప్రాంగణంలోని మార్చురీ పక్కన ఉన్న చెత్త నిల్వ కేంద్రంలో కొన్ని రోజులుగా చెత్త తరలించడం లేదు. విపరీతమైన దుర్వాసన వ్యాపిస్తోంది. – రాకేశ్, గోలిగూడ

✓ సమస్యను ఏఎంహెచ్ఓ దృష్టికి తీసుకెళ్లి.. సకాలంలో చెత్త తరలించేందుకు కృషి చేస్తాం. – డా.ఎం.డీ.రఫీ, ఆర్‌ఎంఓ, ఉస్మానియా ఆసుపత్రి

వీధి దీపాలకు మరమ్మతులు

స్పందనకు వందనం



ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: మెహిదీపట్నం దేవునికుంట హిందూ శ్మశానవాటికలో వీధి దీపాలు వెలగడం లేదు. బుధవారం రాత్రి చీకటిలోనే అంత్యక్రియలు నిర్వహించారు. సమస్యను బల్దియా విద్యుత్ విభాగం అధికారులు దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లింది. స్పందించిన ఆయన మరమ్మతులు చేయించారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి: డీసీపీ

సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: విద్యార్థులు మాదకద్రవ్యాలు, ర్యాగింగ్ ఉచ్చులో పడి ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని తూర్పు మండలం డీసీపీ డా.బాలస్వామి సూచించారు. కోఠిలోని ఉస్మానియా వైద్య కళాశాల(ఓఎంసీ)లో కొత్తగా చేరిన వైద్య విద్యార్థులకు గురువారం కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీసీపీ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు సేవించడం, ర్యాగింగ్ పేరిట వికృత చేష్టలకు పాల్పడటం చట్ట విరుద్ధమన్నారు. అదనపు డీసీపీ నరసయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణతో ముందుకు సాగుతూ ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి, ఓఎంసీ ప్రిన్సిపల్ డా.నరేంద్ర కుమార్, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాంసం వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ వేయకండి

మెహిదీపట్నం, న్యూస్‌టుడే: మాంసం వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ పారేయకూడదని ఆసిఫ్‌నగర్ ఏసీపీ విజయ శ్రీనివాస్ సూచించారు. హుమాయున్‌నగర్ ఠాణా పరిధిలోని చికెన్, మటన్ దుకాణాల యజమానులు, మసీదు, ఆలయ కమిటీల ప్రతినిధులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. దుకాణాల్లో వెలువడే వ్యర్థాలను పారిశుద్ధ్య సిబ్బందికి అప్పగించాలని ఏసీపీ సూచించారు. ఇన్‌స్పెక్టర్ సైదేశ్వర్, డీఐ బాలకృష్ణ, ఎస్సైలు శ్రీనివాస్‌రెడ్డి, వినోద్‌కుమార్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● బంజారాహిల్స్ పోలీసు డివిజన్ పరిధిలోని చికెన్, మటన్ యజమానులు, మసీదు, ఆలయ కమిటీ ప్రతినిధులతో బంజారాహిల్స్‌లో ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి సమావేశమయ్యారు. మాసబ్‌ట్యాంక్ ఇన్‌స్పెక్టర్ పరశురాం, బంజారాహిల్స్ డీఐ బషీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతి



అబిడ్స్ అబ్కారీ భవన్‌లో.. శాఖ అదనపు కమిషనర్ అజయ్‌రావు, డిప్యూటీ కమిషనర్ దశరథ్ తదితరులు



కలెక్టరేట్‌లో వాల్మీకి మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ కదిరవన్, బీసీ అభివృద్ధి అధికారి ఆశన్న, సీపీఓ సురేందర్ తదితరులు

నిరుద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి: భాజపా

గన్‌ఫౌండ్రీ: తెలంగాణలో గ్రూప్ 1 పరీక్షల నిర్వహణ విషయంలో నిరుద్యోగులు, అభ్యర్థుల్లో ఉన్న సందేహాలను తొలగించడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు విమర్శించారు. గ్రూప్ 1, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించకపోవడమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధకాండను అమలు చేస్తుందని, దీనిని తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సేవెళ్ల మహేందర్ తదితరులతో కలిసి మాట్లాడారు.

దుగ్గిరాల సోమేశ్వరరావు ఆత్మీయ పురస్కారాల ప్రదానం



అవార్డు గ్రహీతలతో రమణాచారి, హెచ్.జె.దొర, సారిపల్లి కొండలరావు

నారాయణగూడ: పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీలో గురువారం రాత్రి రసరంజని-హైదరాబాద్, దుగ్గిరాల ఫ్యామిలీ సంయుక్తాధ్వర్యంలో దర్శకుడు దుగ్గిరాల సోమేశ్వరరావు జయంతి వేడుకల సందర్భంగా ఆత్మీయ పురస్కారాల ప్రదానం జరిగింది. అక్కినేని నాటక కళా పరిషత్తు అధ్యక్షుడు సారిపల్లి కొండలరావు అధ్యక్షతన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశ్రాంత ఐఏఎస్ అధికారి డా.కె.వి.రమణాచారి మాట్లాడుతూ.. మంచి మనస్సున్న మహారాజు దుగ్గిరాల సోమేశ్వరరావు అని కొనియాడారు. ఎంతో మందిని నటీనటులుగా తీర్చిదిద్దారన్నారు. విశ్రాంత డీజీపీ హెచ్.జె.దొర మాట్లాడుతూ.. నాటక రంగానికి సేవ చేసిన మహానుభావుడు దుగ్గిరాల అని కొనియాడారు. దర్శకుడు బీఎం రెడ్డి మాట్లాడారు. సీనియర్ నటులు సీహెచ్ నారాయణస్వామి, సుసర్ల కామేశ్వరశర్మ, నటుడు కేఎస్‌డీ నటరాజ్, సత్యశారదాభారతి అధ్యక్షుడు సత్యనారాయణ, తెలుగువర్సిటీ రంగస్థల కళ శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ డా.బీహెచ్ పద్మప్రియలకు దుగ్గిరాల సోమేశ్వరరావు ఆత్మీయ పురస్కారాలు ప్రదానం చేశారు.

ముమ్మరంగా భాజపా సభ్యత్వ నమోదు



రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులతో సభ్యత్వం చేయిస్తున్న భాజపా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌కుమార్

గన్‌ఫౌండ్రీ, న్యూస్‌టుడే: నాంపల్లి రైల్వేస్టేషన్‌లో గురువారం రాత్రి భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. రైల్వే ప్రయాణికులతో సభ్యత్వం చేయించారు. కార్యక్రమానికి హాజరైన భాజపా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సేవెళ్ల మహేందర్, రాష్ట్ర కార్యదర్శి కె.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.




జియాగూడలో గీతామూర్తి, నేతలు

జియాగూడ: భాజపా సభ్యత్వ నమోదుకు అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని పార్టీ మహిళా మోర్చా మాజీ అధ్యక్షురాలు గీతామూర్తి పేర్కొన్నారు. గురువారం జియాగూడ, వివేకానందనగర్, నవోదయనగర్, గంగానగర్, మూసీ తీర ప్రాంతాలతో పాటు పురానాపూల్ పరిసర ప్రాంతాల్లో ఇంటింటా తిరిగి సభ్యత్వ నమోదు చేయించారు. గోల్కొండ జిల్లా ప్రధానకార్యదర్శి డిఙ్గర్‌సింగ్, చార్మినార్ అసెంబ్లీ కన్వీనర్ ప్రవీణ్, నేతలు శివ రత్నం, బి.శివకుమార్‌యాదవ్, పురానాపూల్ ఇన్‌ఛార్జి ఉమామహేందర్ ఉన్నారు.

భూసేకరణ చట్టం-2013 అమలు చేయండి

నారాయణగూడ, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూసేకరణ చట్టం-2013 అమలు చేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కోరారు. వైతన్యపురి డివిజన్‌లోని లక్ష్మీనరసింహ కాలనీవాసులతో కలిసి గురువారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు తాము వ్యతిరేకం కాదని, కానీ అక్కడి నివాసితులకు న్యాయం చేయాలని కోరారు. ఆ ప్రాంతంలో సుమారు 30 దళిత కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. గత 15 రోజులుగా అధికారులు కాలనీలో ఇళ్లను కూల్చివేస్తామని చెబుతుండటంతో.. నివాసితులు భయాందోళనకు గురి అవుతున్నారన్నారు. స్పందించిన ఛైర్మన్.. బాధితులకు అన్యాయం జరగకుండా చూస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో పత్రిక ఎడిటర్ దుర్మరణం



రాములుగౌడ్

గోల్కొండ, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై వెళ్తున్న పత్రిక ఎడిటర్‌ను టిప్పర్ ఢీకొట్టడంతో దుర్మరణం చెందిన ఘటన గోల్కొండ ఠాణా పరిధిలో గురువారం రాత్రి జరిగింది. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదర్‌గూడ ఎర్రబోడ ప్రాంతానికి చెందిన రాములుగౌడ్ (50) ప్రజాప్రైమ్ పత్రిక ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. గురువారం రాత్రి 7 గంటల ప్రాంతంలో లంగర్‌హౌస్ వైపు ఆయన ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. డిఫెన్స్‌ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఉన్న పెట్రోల్ బంకులో నుంచి బయటకు వచ్చిన టిప్పర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దాని వెనకాల టైరు కిందపడ్డ ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రేడింగ్‌లో చిట్కాలు చెబుతామని మోసం

నారాయణగూడ: స్టాక్ ట్రేడింగ్‌లో చిట్కాలు చెబుతామని నమ్మించి మోసం చేశారంటూ బాధితుడు హైదరాబాద్ సైబర్ పోలీసులను గురువారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ప్రైవేటు ఉద్యోగికి ట్రేడింగ్ చిట్కాలకు సంబంధించి వాట్సాప్ సందేశాలు వచ్చాయి. ట్రేడింగ్ కోసం ప్రత్యేక ఖాతా తెరిచాడు. అందులో తన బ్యాంకు ఖాతా, ఐఎఫ్ఎస్‌సీ నంబర్లు ఇతర వివరాలు పొందుపరిచాడు. సెప్టెంబరులో ఆ ఖాతాలో విడతలవారీగా రూ.8.65 లక్షలు డిపాజిట్ చేయడం మొదలుపెట్టాడు. ఆ తర్వాత విత్‌డ్రా చేయడానికి ప్రయత్నిస్తే సాధ్యపడలేదు. అనుమానం వచ్చి బాధితుడు టోటల్ సెక్యూరిటీస్ డాట్ కామ్, సైబర్ క్రైమ్ డాట్ జీవోవీ డాట్ ఇన్‌లో ఫిర్యాదు చేశాడు. సైబర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యూసెన్స్ కేసు.. ఇద్దరికి జైలు

ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: న్యూసెన్స్ కేసులో ఇద్దరు నిందితులకు న్యాయస్థానం జైలు శిక్షతో పాటు జరిమానా విధించింది. మాసబ్‌ట్యాంక్ ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగర్‌కాలనీ, పీఎస్‌నగర్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగులు ప్రదీప్‌కుమార్(36), వెంకటేశ్వర్‌రావు(35) బుధవారం రాత్రి స్థానికంగా న్యూసెన్స్ చేశారు. స్థానికుల ఫిర్యాదుతో పోలీసులు అరెస్టు చేసిన పోలీసులు.. గురువారం నాంపల్లిలోని 12వ ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. వారికి రెండు రోజుల జైలు, రూ.100 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి డి.రాజేంద్రకుమార్ తీర్పు ఇచ్చారు. ఎస్సై ఎం.సతీశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫలక్‌నుమాలో..

చాంద్రాయణగుట్ట: రోడ్డుపై గొడవ పడుతూ న్యూసెన్స్ చేసిన ఇద్దరు యువకులకు కోర్టు ఏడు రోజుల జైలు శిక్ష విధించింది. ఫలక్‌నుమా ఏసీపీ ఎం.ఏ.జావీద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫలక్‌నుమా ప్రాంతానికి చెందిన బినోద్ గుండే(23), బిసాల్(35)లు రోడ్డుపై గొడవ పడుతూ న్యూసెన్స్ సృష్టించగా పోలీసులు కేసు నమోదు చేసి, గురువారం నాంపల్లి 9వ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. ఇన్‌ఛార్జి మెజిస్ట్రేట్ ఎం.మురళీధర్ పైవిధంగా తీర్పు ఇచ్చారు.

అర్ధరాత్రి వ్యాపారాలు... కటకటాలపాలు

చాంద్రాయణగుట్ట: ఇద్దరు వ్యాపారులకు కోర్టు మూడు రోజుల జైలు శిక్ష విధించింది. ఫలక్‌నుమా ఏసీపీ ఎం.ఏ.జావీద్ తెలిపిన వివరాల ప్రకారం.. హఫీజ్‌బాబానగర్‌కు చెందిన మహ్మద్ ఇమ్రాన్(31) ఫలక్‌నుమా ప్రాంతంలో ఇమ్రాన్ హోటల్, ఫలక్‌నుమాకు చెందిన అబ్దుల్ హమీదుల్లా(27) నాగులబండలో జైబు స్నాక్స్ హోటల్ నిర్వహిస్తున్నారు. వారు నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి దాటిన తరువాత హోటళ్లు నిర్వహిస్తున్నారు. పోలీసులు ఈ పెట్టీ కేసులు నమోదు చేసి, గురువారం నాంపల్లి 9వ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా, ఇన్‌ఛార్జి మెజిస్ట్రేట్ ఎం.మురళీధర్ పైవిధంగా తీర్పు ఇచ్చారు.

టెట్ నిర్వహణపై కన్వీనర్‌కు వినతి



'టెట్' కన్వీనర్‌కు వినతిపత్రం ఇస్తున్న అభ్యర్థులు

పి.ఐడీసాక్, తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల లింగంగౌడ్‌లు విజ్ఞప్తి చేశారు. గురువారం బషీర్‌బాగ్‌లో టెట్ కన్వీనర్ రమేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. లాంగ్వేజ్ పండిట్ స్కూల్ అసిస్టెంట్‌గా తెలుగులో టీపీటీ చేసిన వారిని మాత్రమే నియమించాలని, హిందీ భాష పండితులుగా హెచ్‌పీటీ చేసిన వారికి మాత్రమే అవకాశం ఇవ్వాలని కోరారు. జేఏసీ నేతలు శ్రీనివాస్, సునీత, రమ్య, యాదయ్య, రాంబాబు, భాస్కర్ పాల్గొన్నారు.

బషీర్‌బాగ్: టెట్(ఉపాధ్యాయ అర్హత పరీక్ష)లో సాహిత్య శాస్త్రాన్ని తొలగించి, ఈ స్థానంలో తెలుగు, హిందీ సబ్జెక్టులు ప్రత్యేక పేపర్‌గా నిర్వహించాలని తెలంగాణ నిరుద్యోగ భాషా పండితుల జేఏసీ ఛైర్మన్

మ్యూజియంలో ప్రత్యేక ప్రదర్శన 19న

చార్మినార్: సాలార్‌జంగ్ మ్యూజియంలో ఈ నెల 19న ది ఆర్ట్ సాంస్కృతి ఆధ్వర్యంలో 'డైవర్స్ వాయిసెస్: ఆర్ట్ బియాండ్ బౌండరీస్' అంశంపై ప్రత్యేక ప్రదర్శన ప్రారంభమవుతుంది. విద్యార్థులు గీసిన కళాఖండాలు సుమారు వందకుపైగానే ప్రదర్శనలో చోటు చేసుకుంటాయని నిర్వాహకులు శాలినీగుప్తా తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు గీసిన కళాఖండాలను ఈ నెల 19 నుంచి 27 వరకు ప్రదర్శిస్తామన్నారు. ప్రదర్శనను గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ ప్రారంభిస్తారని వెల్లడించారు.

జియాగూడలో బాలుడిపై కత్తితో దాడి

జియాగూడ: బాలుడిపై ముగ్గురు ఆగంతకులు కత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన కుల్సుంపుర ఠాణా పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సునీల్ వివరాల ప్రకారం.. అత్తాపూర్ ప్రాంతానికి చెందిన బాలుడు(17) గురువారం సాయంత్రం జియాగూడలోని బాబాయి ఇంటికి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. సబ్జీమండి ఉడ్‌బ్రిడ్జ్‌పై రాగానే బాలుడి వాహనం.. ముందు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనానికి తగిలింది. దీంతో బైక్‌పై ఉన్న ముగ్గురు యువకులు ముకుమ్మడిగా బాలుడిపై దాడికిదిగారు. ఓ యువకుడు కత్తితో కడుపులో పొడిచాడు. స్థానికులు, పోలీసులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమురం భీంకు నివాళి



ఆసిఫ్‌నగర్: మాసబ్ ట్యాంక్‌లోని దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్‌లో కుమురం భీం వర్ధంతిని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగింది. శాఖ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి, సీఈ శంకర్, జీసీసీ డైరెక్టర్ డా.సముజ్వల, అధికారులు శంకర్‌రావు, సీతారామరాజు, ప్రభాకర్ పాల్గొని నివాళులర్పించారు.

20న హరిణి వనస్థలిలో పద్మశాలి దసరా మేళా

నారాయణగూడ: పద్మశాలి సంఘం (ఎల్బీనగర్ సర్కిల్) ఆధ్వర్యంలో ఈనెల 20న వనస్థలిపురం హరిణి వనస్థలి పార్కులో పద్మశాలి దసరా మేళా నిర్వహించనున్నట్లు అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ మహిళా అధ్యక్షురాలు వనం దుశ్యంతల వెల్లడించారు. జింకల పార్కులోని అనన్య ఎకో పార్కు ఆవరణలో జరిగే ఈ మేళాకు పద్మశాలి మహిళలు తరలిరావాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు విడుదల చేయండి



విద్యార్థుల ప్రదర్శన

నారాయణగూడ, న్యూస్‌టుడే: ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ, ప్రైవేటు డిగ్రీ కళాశాల యాజమాన్యాల ఆధ్వర్యంలో విద్యార్థులతో గురువారం ర్యాలీ నిర్వహించారు. నారాయణగూడ ఫ్లైఓవర్ కూడలి నుంచి వైఎంసీఏ వరకు జరిగిన ఈ ర్యాలీలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, సహాయ కార్యదర్శి దామెర కిరణ్, జిల్లా కార్యదర్శి అశోక్‌రెడ్డి మాట్లాడారు. ఏడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రూ.8,300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాల బకాయిలు ఉన్నాయన్నారు. బకాయిలు రాక, నిర్వహణ భారమవుతుండటంతో ప్రైవేటు యాజమాన్యాలు కళాశాలలను తెరవని పరిస్థితి నెలకొందన్నారు. బకాయిలు విడుదల చేయకపోతే సచివాలయం, ప్రగతిభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా, ఉపాధ్యక్షులు స్టాలిన్, నాగేందర్, ప్రశాంత్, చరణ్, శ్రీ, జిల్లా కమిటీ సభ్యులు సహన, భగత్ శివ తదితరులున్నారు.

దిల్లీలో గ్లోబల్ హెల్త్ సమ్మిట్ నేటి నుంచి

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: దేశంలో క్యాన్సర్, గుండెపోటు వ్యాధులను తగ్గించే లక్ష్యంతో ఈ నెల 18 నుంచి 20 వరకు గ్లోబల్ హెల్త్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్(ఆపి) అధ్యక్షుడు డాక్టర్ సతీశ్ కత్తుల వెల్లడించారు. దిల్లీలోని లీ మెరిడియన్ హోటల్‌లో సదస్సు ఉంటుందన్నారు. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

మురుగు సమస్యలు పరిష్కరిస్తాం

గోషామహల్: తాగునీరు, మురుగు సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని జలమండలి జీఎం జాన్ షరీఫ్ తెలిపారు. గోషామహల్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలపై భారాస నేత ఆనంద్‌కుమార్ గౌడ్ గురువారం జీఎంను కలిసి ఫిర్యాదు చేయగా జీఎం స్పందిస్తూ.. గౌడీబేబర్, గౌలిగూడ, బేగంబజార్ ప్రాంతాల్లో అధికారులను అప్రమత్తం చేసి సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

క్రీడల ప్రాధాన్యం ఎనలేనిది

కార్వాన్: క్రీడల ప్రాధాన్యం ఎనలేనిదని పలువురు కోచ్‌లు, విద్యాశాఖాధికారులు తెలిపారు. 68వ పాఠశాలల రాష్ట్ర రెజ్లింగ్ టోర్నమెంట్, ఎంపిక కార్యక్రమం గురువారం సబ్జిమండిలోని వీరాంజనేయ వ్యాయామశాల, గంగపుత్ర సంఘం మైదానంలో నిర్వహించారు. పోటీలో ప్రథమ స్థానంలో నిలిచిన మల్లయోధులను ఈ నెల 23 నుంచి 27 వరకు ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీరట్‌లో జరిగే జాతీయ పాఠశాలల రెజ్లింగ్ పోటీలకు పంపుతామని నిర్వాహకులు తెలిపారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి


గోల్కొండ: ప్రార్థనా మందిరాలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో సౌత్ వెస్ట్ డీసీపీ చంద్రమోహన్ గురువారం గోల్కొండ ఠాణాలో కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ సైదులు ఉన్నారు.

ఆధ్యాత్మిక ముసుగులో దురాగతాలు

బషీర్‌బాగ్: ఆధ్యాత్మిక ముసుగులో బాలలపై జరుగుతున్న దురాగతాలపై ప్రభుత్వాలు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ అధ్యాపకురాలు యామిని రాగాల డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్‌లో మాట్లాడారు.

రాజేంద్రనగర్

•రాజేంద్రనగర్ •షాద్‌నగర్ •చేవెళ్ల



పుస్తకావిష్కరణలో అదనపు డీసీపీ శ్రీనివాస్‌రావు, విద్యాసాగర్‌రెడ్డి, రమావిశ్వనాథ్ తదితరులు

ఇంద్రయజ్ఞం గ్రంథ ఆవిష్కరణ

అత్తాపూర్, న్యూస్‌టుడే: అత్తాపూర్ చిన్న అనంతగిరి శివాలయంలో గురువారం ఇంద్రయజ్ఞం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అదనపు డీసీపీ శ్రీనివాస్‌రావు, చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ విద్యాసాగర్‌రెడ్డి హాజరయ్యారు. వారితో పాటు ఆర్‌ఎస్ఎస్ నుంచి రమావిశ్వనాథన్, రమాదేవి హాజరయ్యారు. కుల, వర్గ, ప్రాంత వివక్ష లేకుండా ప్రజలంతా సరళమైన రీతిలో యజ్ఞం చేసుకొనే విధానాన్ని ఈ పుస్తకంలో వివరించినట్లు అతిథులు తెలిపారు. యజ్ఞం చేసుకొనే విధానాలను మంత్ర భాగములతో వివరించినట్లు గ్రంథకర్త సూర్యదరి మాదవ్ వివరించారు. పుస్తక ఆవిష్కరణకు ముందు ఇంద్రయజ్ఞం నిర్వహించారు.

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: అత్తాపూర్ డివిజన్ పాండురంగానగర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బస్తీ దవాఖానాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం వైద్యాన్ని పేద ప్రజలకు మరింత చేరువ చేస్తోందన్నారు. వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు. జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ... ఇటీవల జిల్లాలోని అన్ని బస్తీ దవాఖానాలకు వైద్యులను నియమించామన్నారు. పట్టణ ప్రాథమిక కేంద్రాలలో పూర్తిస్థాయి సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ వినోద్, డాక్టర్ రేఖ, డాక్టర్ అన్న, కేశవ్, స్థానిక నాయకులు అమరేందర్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు

సంక్షిప్త సమాచారం

రాజేంద్రనగర్‌కు ఐదుగురు ఉపాధ్యాయులు

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: నూతనంగా చేపట్టిన డీఎస్సీ నియామకాల్లో రాజేంద్రనగర్‌కు ఐదుగురు ఉపాధ్యాయులు వచ్చారని మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్ తెలిపారు. రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఇద్దరు, హసన్‌నగర్, భగవతిగూడలోని ప్రాథమిక పాఠశాలలు, గణేష్‌నగర్ ఉన్నత పాఠశాలకు ఒకరు చొప్పున ఐదుగురు మహిళా ఉపాధ్యాయులు గురువారం బాధ్యతలు చేపట్టారన్నారు.

కొనసాగుతున్న ఉస్మాన్‌సాగర్ నీటి విడుదల

నార్సింగి: ఉస్మాన్‌సాగర్ జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి వరద కొనసాగుతుండటంతో నీటివిడుదలను కొనసాగిస్తున్నారు. మంగళవారం రెండు గేట్లను అడుగు మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసిన విషయం తెలిసిందే. గురువారం జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 1790 అడుగులుగా అధికారులు తెలిపారు. జలాశయంలోకి వరద (ఇన్‌ఫ్లో) 300 క్యూసెక్కులుండగా ఔట్‌ఫ్లో 242 క్యూసెక్కులు ఉన్నాయి.

విద్యుత్ డీఈకి శుభాకాంక్షలు

నార్సింగి: ఇటీవల ఇబ్రహీంబాగ్ విద్యుత్ డీఈగా బాధ్యతలు చేపట్టిన సతీష్‌చంద్రను గురువారం విద్యుత్ ఉద్యోగుల సంఘం 1104 యూనియన్ నాయకులు నార్సింగిలోని కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అదనపు కార్యదర్శి విద్యుత్ సైబరసిటీ సర్కిల్ రీజనల్ సెక్రెటరీ ఎం.భాస్కర్‌రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బండ్లగూడజాగీర్: ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు 13వ డివిజన్ కార్పొరేటర్ రావులకోళ్ల మాలతి అన్నారు. గురువారం బండ్లగూడజాగీర్ కార్పొరేషన్ పరిధిలోని సంగంటిబస్టాయి-కాలనీలో రూ.20 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ భాజపా అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి రూ.4.15 కోట్లు మంజూరు

మొయినాబాద్: గండిపేట ఎస్టీయూ కుటీరంలోని హిమాయత్‌నగర్ ఎస్టీయూ మోడల్ పాఠశాల నుంచి గండిపేట వరకురోడ్డు నిర్మాణానికి పంచాయతీరాజ్‌శాఖనుంచి రూ.4.15 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈనిధులను పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మంజూరు చేశారని మొయినాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మలి మాణయ్య తెలిపారు. త్వరలోనే పనులు మొదలు కానున్నట్లు ఆయన వెల్లడించారు.

ముగిసిన వాల్మీకి క్రికెట్ టోర్నమెంట్

కొందుర్గు: గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యం వెలికితీయడంలో టోర్నమెంట్లు ఉపయోగపడతాయని పలువురు అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన వాల్మీకి క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. విజేతగా నిలిచిన జట్టుకు రూ.20వేలు మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్, ద్వితీయ స్థానం దక్కించుకున్న జట్టుకు రూ.10 వేలు కాంగ్రెస్ నాయకుడు కృష్ణ అందజేశారు. కార్యక్రమంలో శంకర్, వీరేశ్, శేఖర్ పాల్గొన్నారు.

చిలుకూరు సెక్షన్ ఏఈగా శివరామకృష్ణ

మొయినాబాద్: మొయినాబాద్ మండలం చిలుకూరు ఎస్పీడీసీఎల్ సెక్షన్ ఏఈగా విధులు నిర్వహించిన రాజేష్‌కుమార్‌ను ఏడీఈగా పదోన్నతి లభించింది. పదోన్నతిపై ఆయన వెళ్లగా సబ్‌డివిజన్‌కు వెళ్లారు. చిలుకూరు సెక్షన్ ఏఈగా శివరామకృష్ణ గురువారం విధుల్లో చేరారు.

దాత సహకారంతో విద్యార్థులకు సౌకర్యాలు

షాద్‌నగర్ న్యూటౌన్: దాత సహకారంతో పరూశ్‌నగర్ మండలంలోని కంసాన్‌పల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సౌకర్యాలు సమకూరాయి. మునవర్ గురువారం విద్యార్థులకు బూట్లు, టై పంపిణీ చేయగా మధ్యాహ్న భోజనానికి అవసరమైన వంటసామగ్రిని ఉపాధ్యాయులకు అందజేశారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

చేవెళ్ల: మినీ అంగన్‌వాడీ టీచర్లకు మెయిన్ అంగన్‌వాడీ టీచర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కమిటీ సభ్యురాలు రాధ డిమాండ్ చేశారు. గురువారం చేవెళ్ల ఐసీడీఎస్ కార్యాలయం ముందు అంగన్‌వాడీ టీచర్లతో కలిసి ధర్నా నిర్వహించారు. రాష్ట్రంలో 4వేల మంది మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా గుర్తిస్తూ జీవో 4 విడుదల చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

రెండు దుకాణాల్లో నగదు చోరీ

శంకర్‌పల్లి(చేవెళ్ల గ్రామీణం), న్యూస్‌టుడే: రెండు దుకాణాల్లో నగదు చోరీ అయిన సంఘటన శంకర్‌పల్లిలో చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాస్‌గౌడ్ వివరాల ప్రకారం... మండల కేంద్రంలోని వైష్ణవి హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్ దుకాణం యజమాని మల్లారెడ్డి, సంగమేశ్వర ఎరువుల దుకాణ యజమాని వాణా చెంద్ర బుధవారం రాత్రి రోజు మాదిరిగా దుకాణాలను మూసివేసి ఇంటికెళ్లారు. గురువారం ఉదయం దుకాణాలు షెటర్లు కొద్దిగా లేచి ఉండటంతో స్థానికులు చూసి వారికి సమాచారం ఇచ్చారు. మల్లారెడ్డి, రమేష్‌లు దుకాణాల వద్దకు చేరుకుని క్యాష్‌కౌంటర్లను పరిశీలించగా హార్డ్‌వేర్ దుకాణంలో రూ.25వేలు, ఎరువుల దుకాణంలో రూ.17వేల నగదు పోయిన విషయాన్ని గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రహదారి తెగింది.. దూరం పెరిగింది



వీర్లపల్లికి వెళ్లే మార్గంలో రహదారి కోతకు గురవడంతో వాహనదారుల అవస్థలు

అసంపూర్తి పనులతో ప్రయాణికులకు ఇబ్బందులు



నందిగామ శివారులో బీటీ వేయకుండా వదిలిన రహదారి

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామ మండలంలో రూ.కోట్లు ఖర్చుచేసి నిర్మించిన రహదారులు అసంపూర్తిగా వదిలేయడంతో ప్రయాణికులకు ఇక్కట్లకు గురికాకుండాపోతున్నాయి. ఇటు పాలకులు.. అటు అధికారులు పట్టించుకోకపోవడంతో పది గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థిక క్రితం రహదారి మంజూరైనా నేటికీ ప్రజలకు పూర్తిస్థాయిలో ఉపయోగం లేకపోవడంతో పాట్లు తప్పడం లేదు.

ఆరేళ్ల క్రితం పనులు ప్రారంభం

నందిగామ పాత జాతీయ రహదారిలో ఎల్లమ్మకాలనీ నుంచి వీర్లపల్లి రహదారి జంక్షన్‌ను కలిసే మట్టి రోడ్డును బీటీగా మార్చేందుకు 2017-18లో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.2.12కోట్లు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించిన మూడేళ్ల తర్వాత కొంత దూరం బీటీ ఏర్పాటు చేసి మధ్యలో వదిలేశారు. దీనికి తోడు కల్వర్టు పనులు పూర్తి చేయకపోవడంతో ఇటీవల వర్షానికి అక్కడి రహదారి కోతకు గురైంది. ఈ మార్గంలో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడడంతో వీర్లపల్లి, మామిడిపల్లి, చల్లంపల్లి, చర్లకుంటతిరెడ్డిగూడ, మొదళ్లగూడ, వెంకమ్మగూడ, ఈదులపల్లి, మజీదుమామిడిపల్లి, దేవుని మామిడిపల్లి, మంచన్‌పహాడ్, చేగూరు గ్రామాలకు వెళ్లే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

అదనంగా 8 కిలోమీటర్ల ప్రయాణం

మండల కేంద్రం నుంచి వీర్లపల్లి జంక్షన్ వరకు సుమారు 4 కిలోమీటర్ల దూరం ఉంటుంది. దీంతో చాలా గ్రామాల ప్రజలు ఇదే దారిలో నిత్యం రాకపోకలు సాగించేవారు. కానీ అప్పారెడ్డిగూడ వాగు వద్ద రహదారి తెగిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చంద్రాయన్‌గూడ శివారు నుంచి మామిడిపల్లి రహదారిపై రాకపోకలు సాగిస్తుండటంతో 8 కిలోమీటర్ల దూరం పెరిగిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు పాలకులకు వివరించినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మధ్యలో ఆపేసిన రహదారి పనులను వెంటనే ప్రారంభించి పూర్తిచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వంతెన కోసం ప్రతిపాదనలు పంపించాం

-హేమంత్, ఏఈ పంచాయతీరాజ్, నందిగామ

నందిగామ నుంచి వీర్లపల్లికి వెళ్లే రహదారి పనులు వాగు వద్ద కొంత మేర మినహా పూర్తి చేశాం. మధ్యలో వంతెన నిర్మించేందుకు రూ.3 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. మంజూరైన వెంటనే పనులు ప్రారంభించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

రాజేంద్రనగర్:	8008573330
శంకర్‌పల్లి:	8008573266
షాద్‌నగర్:	8008573907
శంషాబాద్:	9963096353

కొత్తూరు, కేశంపేట, న్యూస్‌టుడే

? కొత్తూరు బైపాస్ నుంచి పెద్దమ్మ ఆలయం వరకు వెళ్లే దారిలో కేటీఆర్‌ఏ నూతన కాలనీలు ఉన్నాయి. వీధి దీపాలు లేక రాత్రుల్లో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. -మహేష్, కొత్తూరు.

✓ పరిశీలించి అవసరమైనచోట వీధి దీపాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. -లావణ్య, వైస్‌ఛైర్మన్

? కొత్తపేటలోని కడ్తాల్ ప్రధాన రహదారిలో వాహనదారులు వేగ నిరోధకాలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పిల్లలను బయటకు పంపించాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. - మామిడి మాధయ్యగౌడ్, కొత్తపేట.

✓ గ్రామంలోని ప్రధాన రహదారి ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్నందున ఆ శాఖ అధికారులను సంప్రదించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. -జగన్, పంచాయతీ కార్యదర్శి, కొత్తపేట.

పేదలను కబ్జాదారులనడం దారుణం: కేటీఆర్



తెలంగాణ భవన్‌లో మూసీ పరీవాహక బాధితులతో మాట్లాడుతున్న కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్: మూసీ ప్రాజెక్టు పేరుతో పేదల ఇళ్లు కూలుస్తామంటే ఊరుకునేది లేదంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హెచ్చరించారు. వారికి భారాస అండగా ఉంటుందన్నారు. అను మతులిచ్చి కరెంట్ బిల్లులు, ఇంటిపన్నులు కట్టించుకున్న కాంగ్రెస్ వాళ్లే పేదలను కబ్జాదారులనడం దారుణమని మండిపడ్డారు. కాంగ్రెస్ 100 రోజుల్లో ప్రజలకు 6 గ్యారంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చి ఇప్పుడు పేద ప్రజల ఇళ్లను కూల్చేస్తుందని మండిపడ్డారు. బాధితులు ఏమాత్రం భయపడాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. మూసీ ప్రాజెక్టు పేరుతో కాంగ్రెస్ సర్కార్ తమ ఇళ్లను కూల్చే ప్రయత్నం చేస్తోందంటూ తెలంగాణ భవన్‌కు వచ్చిన బాధితులతో కేటీఆర్ సమావేశమయ్యారు. 50 ఏళ్లుగా మూసీ పరీవాహక ప్రాంతంలో ఉంటున్న తమ ఇళ్లను కూల్చివేస్తామని ఎక్కడికి వెళ్లేదంటూ బాధితులు వాపోయారు. ఓట్లేసి గెలిపించిన ప్రజాప్రతినిధులను నిలదీయాలని కేటీఆర్ వారికి సూచించారు.

మూసీ బాధితులకు అండగా ఉంటాం: ఎంపీ



భరత్‌నగర్‌కాలనీలో బాధితులతో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: మూసీ బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మూసీ ప్రక్షాళనలో ఇళ్లు కోల్పోతున్న భరత్‌నగర్‌కాలనీ వాసులతో గురువారం భాజపా నాయకులు కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఇళ్లు కోల్పోతున్న పలువురు బాధితులు తమ గోడును చెప్పుకొన్నారు. గతంలో చేసిన మార్కింగ్‌ను దృష్టిలో పెట్టుకొని తాము ఇళ్లు కట్టుకున్నామని కొందరు ఎంపీ దృష్టికి తెచ్చారు. తాజాగా అధికారులు మార్కింగ్‌ను మరింత దూరంగా వేయడంతో తమ ఇళ్లు అందులోకి వస్తున్నాయన్నారు.. దీనిపై ఎంపీ మాట్లాడుతూ.. అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. పేదలకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇళ్లు కోల్పోతున్న పేదలందరికీ తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, కొమ్మయ్య, సిద్దేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలపై దాడులకు పాల్పడేవారిని శిక్షించాలి

చేవెళ్ల: దేవాలయాలపై దాడులకు పాల్పడేవారిని ప్రభుత్వాలు కఠినంగా శిక్షించాలని భాజపా చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంతరెడ్డి డిమాండ్ చేశారు. సికింద్రాబాద్‌లోని ఓ ఆలయంలో విగ్రహం ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇటీవల హైదరాబాద్‌లో దేవాలయాలు, హిందువులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మత ఘర్షణలు రేకెత్తించి అలజడులు సృష్టించాలని కొందరు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం, పోలీసుశాఖపై ఉందన్నారు.

పర్యాటక స్నేహపూర్వక రాష్ట్రంగా తీర్చిదిద్దాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మిథుల్ శర్మ

శంషాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణను పర్యాటక స్నేహ పూర్వక రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో ఆటో, క్యాబ్, ట్యాక్సీ డ్రైవర్లు కీలక పాత్ర పోషిస్తారని శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ చీఫ్ ప్యాసింజర్స్ ఎక్స్‌పీరియన్స్ ఆఫీసర్ మిథుల్ శర్మ అన్నారు. గురువారం విమానాశ్రయంలో రాష్ట్ర పర్యాటక శాఖ, టీహెచ్ఎంసీఐటీల సంయుక్తంగా నిర్వహించిన అతిథి దేవోభవ-2024 రెండో ఎడిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నిపుణుల సమక్షంలో 100 మంది క్యాబ్ డ్రైవర్లకు శిక్షణ ఇచ్చారు. ప్రయాణంలో అస్వస్థత గురైన ప్రయాణికులకు అత్యవసరంగా చేయాల్సిన సీపీఆర్ విధానంపై విమానాశ్రయ ఆసుపత్రి వైద్యులు అవగాహన కల్పించారు. హైదరాబాద్‌లోని నాంపల్లి, చార్మినార్, ఎంజీబీఎస్, సికింద్రాబాద్, జూబ్లీ బస్టాండ్ తదితర రద్దీ ప్రాంతాల్లో పర్యాటకులకు సేవలందిస్తున్న వెయ్యి మంది క్యాబ్ డ్రైవర్లకు దశలవారీగా శిక్షణ ఇస్తామన్నారు. భద్రత చర్యలను వివరించే క్యూఆర్ కోడ్‌తో తయారు చేసిన స్టిక్కర్లను క్యాబ్ డ్రైవర్లకు పంపిణీ చేస్తున్నామని, ఇవి ప్రయాణికులకు అవసరమైన భద్రతా సమాచారం అందిస్తాయన్నారు.

రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుకు విజ్ఞప్తి



రాహుల్‌ని కలిసిన కాంగ్రెస్ నాయకులు

శంషాబాద్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణను అమలు చేసే అధికారం ఆయా రాష్ట్రాలకే ఉందని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో తెలంగాణలో వెంటనే అమలు చేయాలని పీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జల్‌పల్లి నరేందర్ పేర్కొన్నారు. జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు విజయకుమార్ ఆధ్వర్యంలో గురువారం 29 రాష్ట్రాలకు చెందిన ఎస్సీ నాయకులు దిల్లీలో రాహుల్‌గాంధీని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ నుంచి జల్‌పల్లి నరేందర్ హాజరయ్యారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయకపోవడంతో మాదిగలకు ఉపాధి, విద్యా రంగాల్లో జరుగుతున్న నష్టాలపై రాహుల్‌గాంధీకి వివరించారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



బండ్లగూడజాగీర్ కార్పొరేషన్ కార్యాలయంలో...

బండ్లగూడజాగీర్, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడెం, న్యూస్‌టుడే: రామాయణ మహాకావ్యాన్ని ప్రపంచానికి అందించిన గొప్ప మహనీయుడు మహర్షి వాల్మీకి అని పలువురు అన్నారు. మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను గురువారం రాజేంద్రనగర్, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బండ్లగూడజాగీర్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మేయర్ ఎం.లత, డిప్యూటీ మేయర్ పి.రాజేందర్‌రెడ్డి, కమిషనర్ బి.శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు. కొందుర్గులో నిర్వహించిన వేడుకల్లో బోయ శంకర్, వీరేశ్, కృష్ణ, నర్సింహులు, శ్రీశైలం, శేఖర్, యాదయ్య, జిల్లేడు చౌదరిగూడెం మండలం లాల్ పహాడ్‌లో చేపట్టిన వేడుకల్లో బోయ నర్సింహులు, కురుమయ్య, చంద్రయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠాపన

షాద్‌నగర్, న్యూస్‌టుడే: షాద్‌నగర్‌లో దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్ ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గురుస్వామి గిరీష్‌నాయర్, ఆలయ అర్చకులు రవిశర్మ, సంతోష్‌శాస్త్రి, సునీల్‌దాదయ్యల పర్యవేక్షణలో పూజలు చేశారు. కార్యక్రమంలో శంకర్, కృష్ణయ్య, వెంకటరామిరెడ్డి, ఈశ్వరయ్య, చంద్రశేఖర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బడికి పూర్వ విద్యార్థుల తోడ్పాటు

షాబాద్: చదువుకున్న పాఠశాలకు తోడ్పాటునందించాలనే సదుద్దేశంతో తాళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థులు తమ ఔదార్యాన్ని చాటారు. 1984-85 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు తమ సొంత ఖర్చుతో క్రీడా సామగ్రిని కొనుగోలు చేసి గురువారం పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహేందర్‌గౌడ్, మనోహర్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

మూత ధ్వంసం.. ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



ఆరాంఘర్ నుంచి పాతబస్తీ బహదూర్‌పురా మీదుగా వెళ్లే బెంగళూరు జాతీయ రహదారిపై రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఠాణా సమీపంలో మ్యాన్‌హోల్ మూత ధ్వంసమైంది. ఇది జరిగి వారం రోజులవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. జాతీయ రహదారిపై వేగంగా వచ్చే వాహనాలు అక్కడికి రాగానే వేగాన్ని నియంత్రిస్తుండటం, ద్విచక్ర వాహనాలు అందులో పడటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిని గమనించిన ఓ వాహనదారుడు పక్కనే ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు తెలియజేయగా ఆయన స్పందించి వారు తీసుకువచ్చి మ్యాన్‌హోల్ మూట్టు పెట్టారు.

-న్యూస్‌టుడే, కాటేదాన్

మానవ అక్రమ రవాణా నివారణలో భాగస్వాములవ్వాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాగపూర్ణ

నార్సింగి, న్యూస్‌టుడే: మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో ప్రజలు కూడా భాగస్వాములయినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని నార్సింగి మున్సిపల్ ఛైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్ అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్, జిల్లా మహిళా, శిశుసంక్షేమ శాఖ శరీరిణి గంపల్లి ప్రాజెక్టు సంయుక్తంగా మానవ అక్రమ రవాణా నివారణ పై కోకాపేట కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాన్ని ఆమె జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తోందని ఎంతో మంది అమ్మాయిలు జీవితాలను నాశనం చేస్తున్న నేరపూరిత చర్యగా పేర్కొన్నారు. దీనికి పేద, మధ్యతరగతి అమ్మాయిలు, మహిళలు ఎక్కువగా బలవుతున్నారన్నారు. సమాజంలో ప్రజలతో సన్నిహితంగా ఉండే అంగన్‌వాడీ టీచర్లు ఆర్థిక, సామాజిక స్థితిగతులను గుర్తించి వారికి అవగాహన కల్పించాలన్నారు. ప్రజ్వల సంస్థ సీనియర్ ప్రాజెక్టు మేనేజరు బలరాం కృష్ణ మాట్లాడుతూ... అక్రమ మానవ రవాణా నిర్మూలనకు తమ సంస్థ 28 ఏళ్లుగా పని చేస్తూ 28,600 మంది అమ్మాయిలకు పునరావాసం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో కవిత, సూపర్‌వైజర్లు నీలవేణి, ఇందిరా రాణి, ఉమారాణి, పద్మ, పద్మజ, సామాజిక సేవకులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమంతో కుటుంబం చెంతకు యువకుడు



కుటుంబ సభ్యులకు చరణ్ (కుడినుంచి మూడో వ్యక్తి)ను అప్పగిస్తున్న ఎస్సై, యువకులు

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : రెండేళ్ల కిందట అదృశ్యమైన ఓ యువకుడు సామాజిక మాధ్యమం ద్వారా కుటుంబసభ్యులు చెంతకు చేరారు. వనపర్తి జిల్లా కొత్తకోట ఎస్సై మంజునాథరెడ్డి వివరాల ప్రకారం.. శంషాబాద్‌కు చెందిన రాములుకు కుమారుడు చరణ్ (20), ఇద్దరు కుమార్తెల సంతానం. కుమారుడికి చిన్నప్పటి నుంచి మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఇంటి వద్దే ఉండేవారు. రెండేళ్ల క్రితం రాములు ఇల్లు కూలిపోయింది. సమీపంలో ఉన్న బంధువుల ఇంటికి సామగ్రి తరలించే క్రమంలో కుమారుడు కనిపించకుండా పోయాడు. అతడి కోసం వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చరణ్ ఎక్కడికి వెళ్లాడో ఆచూకీ దొరకలేదు. తాజాగా ఆ యువకుడు కొత్తకోట చేరుకున్నాడు. అక్కడ ఉన్న యువకులు వాసు, విష్ణువర్ధన్, రఘు, శ్రీకాంత్‌తో అతను చనువుగా ఉంటుండటంతో పాటు ఇన్‌స్టా గ్రామ్‌ను చూస్తూ పాటలకు నృత్యాలు చేస్తున్నారు. అతని పేరిట వారు ఇన్‌స్టాగ్రామ్ ఖాతా తెరచి అతను చేసిన నృత్యాల వీడియోలు పోస్టు చేశారు. వాటిని 14 లక్షలకు పైగా మంది వీక్షించారు. రాములు కుటుంబసభ్యులు చూసి కొత్తకోట యువకులకు ఫోన్ చేసి వివరాలు ఆరా తీశారు. వీడియో కాల్ చేయడంతో చరణ్ తన తండ్రి, అక్కలను గుర్తుపట్టారు. గురువారం కొత్తకోట పోలీసు స్టేషన్‌కు చేరుకున్న రాములుకు చరణ్‌ను అప్పగించామని ఎస్సై తెలిపారు. యువకుడిని కన్నవారి చెంతకు చేర్చిన యువకులను ఆయన అభినందించారు.

సమాజహితానికి కృషి చేసేవారు కరవు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బక్కని

షాద్‌నగర్ న్యూటౌన్: సమాజ హితం కోసం పాటుపడేవారు రోజురోజుకు కరవవుతున్నారని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. పరూఖ్‌నగర్ మండలం మొగలిగిద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం అధ్యాపకులు, గ్రామ పెద్దలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే వారిలో అవగాహన కల్పించి సమాజాభివృద్ధిలో భాగస్వాములయ్యేలా చూడాల్సిన బాధ్యత కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, గ్రామస్థులపై ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మంజుల, శ్యాంసుందర్, వెంకటయ్య పాల్గొన్నారు.

నకిలీ పాస్‌పోర్టుతో ప్రయాణం.. విదేశీ మహిళ అరెస్టు

శంషాబాద్: నకిలీ పాస్‌పోర్ట్‌తో ప్రయాణించిన ఓ విదేశీ మహిళను శంషాబాద్ విమానాశ్రయంలో గురువారం భద్రతాసిబ్బంది అరెస్టు చేశారు. బంగ్లాదేశ్‌కు చెందిన సోనాలి(25) 2015లో దేశసరిహద్దులను దాటి పశ్చిమబెంగాల్‌కు చేరుకుంది. అక్కడినుంచి ఆమె దిల్లీకెళ్లి ఒకరిని వివాహం చేసుకుంది. అనంతరం నకిలీ పత్రాలతో ఇండియన్ పాస్‌పోర్ట్ తీసుకుని ఒమన్‌కెళ్లింది. భారత్‌కు తిరిగివస్తున్న క్రమంలో శంషాబాద్ విమానాశ్రయంలో దిగింది. ఆమె ప్రవర్తనపై అనుమానం వచ్చిన అధికారులు పాస్‌పోర్టును క్షుణ్ణంగా తనిఖీ చేయగా నకిలీదని తేలింది. అదుపులోకి తీసుకుని ప్రశ్నించడంతో బంగ్లాదేశీయురాలని అంగీకరించింది. వెంటనే ఆర్జీఐఏ పోలీసులకు సమాచారం ఇచ్చారు.


యువతిపై అత్యాచారం.. దోషికి 20 ఏళ్ల కారాగారం

రంగారెడ్డి జిల్లాకోర్టులు, న్యూస్‌టుడే: పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ యువతిపై అత్యాచారానికి పాల్పడిన యువకుడికి న్యాయస్థానం 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.6,000 జరిమానా విధించింది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.మంజులాదేవి కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌కు చెందిన మహమ్మద్ పరీద్(25) స్థానికంగా సైకిల్ వ్యాపారం చేసుకుంటాడు. 2017లో ఓ యువతి (21)తో పరిచయం ఏర్పడింది. నిత్యం సెల్‌ఫోన్‌లో మాట్లాడేవాడు. 2017 సెప్టెంబరు 12 అర్ధరాత్రి ఆమె ఇంటిలోకి చొరబడి పెళ్లి చేసుకుంటానని నమ్మించి, ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా అత్యాచారం చేశాడు. పెళ్లికి నిరాకరించడంతో యువతి ఫిర్యాదు మేరకు ఆర్జీఐ విమానాశ్రయ పోలీసులు నిందితుడిని రిమాండుకు తరలించారు. కేసు విచారించిన జిల్లా 13వ అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి వాణి గురువారం తుది తీర్పు వెలువరించారు.

ఆటో నుంచి పడి యువకుడి దుర్మరణం

చేవెళ్ల గ్రామీణం, న్యూస్‌టుడే: హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై ఆటోలో నుంచి పడి ఒకరు మృతిచెందిన సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం మర్రిపల్లి గ్రామానికి చెందిన పుట్ట శంకర్(19) హైదరాబాద్‌లోని చేపల వ్యాపారి వద్ద పనిచేస్తున్నాడు. నగరం చుట్టూ జరిగే సంతల్లో చేపలను విక్రయించడానికి నిత్యం ఆటోలో వెళ్లేవాడు. ఈ క్రమంలోనే చేవెళ్ల మార్కెట్‌లో చేపలు అమ్మేందుకు మరో ముగ్గురితో కలిసి బయల్దేరాడు. కేసారం గేటు సమీపంలోకి రాగానే ఆటో అదుపుతప్పి ఒక్కసారిగా వెళ్తుండగా శంకర్ ఆటో నుంచి రోడ్డుపై గుంతలో అదుపుతప్పి ఆటోలోంచి కిందపడిపోయాడు. శంకర్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాములు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..



నందిగామ: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన నందిగామ మండలం మేకగూడ శివారులోని వర్ష రోడ్డుపై చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఫరూక్‌నగర్ మండలం కొండన్నగూడ తండాకు చెందిన రవినాయక్(34) నందిగామ మండలంలోని తాజుద్దీన్‌గూడ గ్రామానికి వెళ్లి తిరిగి సొంత గ్రామానికి ద్విచక్రవాహనంపై బుధవారం తిరుగు ప్రయాణమయ్యారు. మేకగూడ శివారులోకి రాగానే వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కంటెయినర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రమైన గాయాలు కావడంతో శంషాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

IN THE COURT OF THE HONOURABLE SENIOR CIVIL JUDGE AT: SHADNAGAR

I.A. No. OF 2023
IN
O.S No 104 OF 2019

Between:-
Khan Mohd Saleem Abdul Raheem ....Petitioner/ Plaintiff
And
Sandhula Padma and others .... Respondents/Defendants

To,
R-3. Akula Pandit Rao S/o A. Satyanarayana Rao, Age: 45 years, Occ: Business, R/o H.No. 2-4-66/1/40, Upperpally, Pillar No. 179, Preetham Colony, Rajendranagar, Ranga Reddy District.
R-4. Natmal Gehlot (HUF) S/o Bhawarlal Gehlot, Age: 67 years, Occ: Business, R/o H.No. 14-4-108, Mukharjpura, Begumbazar, Nampally, Hyderabad-500012
....Respondents/Proposed Defendant No. 3 and 4

NOTICE

Whereas the petitioner/plaintiff has made an application to this court under Order 1 Rule 10 of C.P.C R/w Section 28 C.R.P. You are hereby summoned to appear before this court in person or through pleader to answer such all questions on the 21st day of October 2024 at 10:30 A.M.

If you fail to appear before the court on 21-10-2024 at 10.30 A.M either in person or through advocate the matter will be decided in your absence.

By order of the Court//

Sd/- M. PRAVEEN KUMAR, Advocate, #13-352, Opp.New Court Building, SHADNAGAR TOWN, Dist. R.R.

ఇక్కడ ప్రయాణం.. ప్రయాణికులకు ఆహ్లాదం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు కట్ట నుంచి సాగర్ రహదారి వరకు హరితహారంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయి. ఈ రహదారిపై ప్రయాణం ప్రయాణికులకు ఆహ్లాదం పంచుతోంది.



మహేశ్వరం

•మహేశ్వరం • ఇబ్రహీంపట్నం • కల్వకుర్తి

రోడ్డుపైనే నీళ్లు, బురద.. స్థానికుల పాట్లు



ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: మంగల్‌పల్లి గేట్ సాగర్ రహదారి బస్టాండ్ పక్కన చిన్న వర్షం కురిసినా నెల రోజుల వరకు నీరు నిలిచి పోతోంది. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో 11 కేంద్రాల్లో గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష

ఆదిభట్ల, న్యూస్‌టుడే: రంగారెడ్డి జిల్లాలో 11 కేంద్రాల్లో గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శశాంక తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 8008 మంది అభ్యర్థులకు ఈనెల 21 నుంచి 27 వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు.

బాలికోన్నత పాఠశాల ప్రారంభం

జల్‌పల్లి, న్యూస్‌టుడే: జల్‌పల్లిలో కొత్తగా నిర్మించిన ప్రిన్సెస్ ఎసిన్(ముఫకంజా) బాలికోన్నత పాఠశాలను ఆ సంస్థ ఛైర్మన్ ముఫకంజా బహదూర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రిన్సెస్ ఎసిన్ అనారోగ్యంతో ఉన్నారని, ఈ కారణంతోనే రాలేదని ముఫకంజా పేర్కొన్నారు. పూర్వవిద్యార్థులు మాట్లాడారు.

గీత కార్మికులకు సభ్యత్వాల అందజేత

తలకొండపల్లి, న్యూస్‌టుడే: తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామంలో కల్లు గీత కార్మికులతో ఎక్సైజ్ శాఖ సీఐ బద్యానాథ్ చౌహాన్ గురువారం సమావేశం నిర్వహించారు. కార్మికులకు సభ్యత్వం అందించారు. కార్యక్రమంలో కల్లు గీత కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు తోడ్పాటు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: విద్యార్థులకు దాతలు చేయూత ఇవ్వడం అభినందనీయమని హెచ్‌ఎం ఎం.సుధాకర్ అన్నారు. గురువారం ఎల్మినేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంఖాల శేఖర్‌రెడ్డి.. స్టడీ మెటీరియల్, కె.శ్రీశైలం.. 15 కుర్చీలు, విద్యార్థులకు భిక్షపతి ఐడీ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటయ్య, రాజేందర్, సుజాత, వరలక్ష్మి, శ్రీలత పాల్గొన్నారు.

వసతిగృహంలో దస్త్రాల తనిఖీ

మహేశ్వరం, న్యూస్‌టుడే: మహేశ్వరం ఎస్సీ బాలికల వసతిగృహాన్ని ఎంపీడీవో శైలజారెడ్డి గురువారం సందర్శించారు. 103 మందికి.. కేవలం 35 మంది మాత్రమే వసతిగృహంలో ఉన్నారు. దీనికి గల కారణాలను ఆరా తీశారు. ఆహారం, దస్త్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కుర్మిద్దలో ఫోర్త్‌సిటీ పోలీస్‌స్టేషన్

▼ మూడు ఎకరాల్లో నిర్మాణం

▼ త్వరలో పనులు ప్రారంభం

యాచారం, ఇబ్రహీంపట్నం, కందుకూరు, కడ్తాల్, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన నాలుగో మహానగరం(ఫోర్త్ సిటీ)లో దీటైన పోలీస్‌స్టేషన్ భవనాన్ని నిర్మించనున్నారు. యాచారం మండలం కుర్మిద్ద గ్రామంలో అన్ని హంగులతో దీనిని నిర్మించేందుకు పోలీస్‌శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. యాచారం మండలం మేడిపల్లిలో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్‌ను గత ఏడాది జూన్ 3న ప్రారంభించిన సంగతి తెలిసిందే. దీనినే ఫోర్త్‌సిటీలోకి భవిష్యత్తులో మార్చనున్నారు. ఈ నేపథ్యంలో అన్నిగ్రామాలకు మధ్యలో ఉండే విధంగా ఫార్మాసిటీ ఠాణా భవనాన్ని కుర్మిద్దలో నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. భవిష్యత్తు అవసరాలకు సరిపోయేలా మూడు ఎకరాల భూమిలో అధునాతన హంగులతో పోలీస్‌స్టేషన్ భవనం నిర్మించాలనేది పోలీస్‌శాఖ ప్రణాళిక. ఇందుకు సంబంధించి అన్ని ప్రతిపాదనలు టీజీ ఐఐసీకి పంపామని సీఐ లిక్కి కృష్ణంరాజు చెప్పారు. త్వరలోనే అనుమతులు వస్తాయని, పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. కుర్మిద్ద రెవెన్యూ పరిధిలోని సర్వే సంఖ్య 39లో పల్లె ప్రకృతి వనం పక్కన భూమిని కేటాయించాలని పోలీస్‌శాఖ కోరుతోంది. టీజీ ఐఐసీ అధికారులు మాత్రం మరోచోట భూమిని కేటాయిస్తున్నట్లు సమాచారం. దీనిపై రెండు శాఖలు ఏకాభిప్రాయానికి రావాల్సి ఉంది. సర్వే సంఖ్య 39లో అయితే అన్ని గ్రామాలకు మధ్యలో.. ఇబ్రహీంపట్నం ఏసీపీ పరిధిలో ఠాణా ఉంటుందని ఇక్కడ భూమిని ఎంపిక చేశారు. రైతుల నుంచి ఫార్మాసిటీ కోసం సేకరించిన భూమిలో నుంచి మూడు ఎకరాలు కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి సీఎస్‌ఆర్ నిధులు టీజీ ఐఐసీ కేటాయించనుంది.



మేడిపల్లిలోని ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్

స్టేషన్ పరిధిలోని గ్రామాలు

యాచారం: మేడిపల్లి, నక్కర్త, నానక్‌నగర్, తాటిపర్తి, పిల్లిపల్లి, కుర్మిద్ద, మంగళిగడ్డతండా

కందుకూరు: సాయిరెడ్డిగూడెం, ముచ్చర్ల, ఉట్లపల్లి, మీర్‌ఖాన్‌పేట, ఆకులమైలారం, బేగరికంచె, సార్ల రావులపల్లి, బండమీది తండా, గుట్టలతండా, పోచమ్మతండా, పోతుగడ్డతండా

కడ్తాల్: పల్లె చెల్కతండా

విశాల ప్రాంగణం.. సర్వ హంగులు

– కేపీవీ రాజు, ఏసీపీ, ఇబ్రహీంపట్నం



ఫోర్త్ సిటీ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని అధునాతన హంగులతో విశాలమైన ప్రాంగణంలో ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ భవనం కుర్మిద్దలో నిర్మించాలని నిర్ణయించాం. సాంకేతిక వ్యవస్థతో పాటు ప్రత్యేక బలగాల వసతికి అవకాశం ఉంటుంది. భవిష్యత్తులో ఫోర్త్‌సిటీకి ఈ ఠాణా కేంద్రంగా మారనుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్మాణం చేపడుతున్నాం. త్వరలోనే భవన నిర్మాణం ప్రారంభమవుతుంది. పారిశ్రామిక వేత్తలను ఆకర్షించడానికి శాంతిభద్రతలు ఎంతో ముఖ్యం.

మేమున్నాం.. మీకు తోడుగా..

మహేశ్వరం 80085 73290
ఇబ్రహీంపట్నం 80085 73295
ఆమన్‌గల్, కడ్తాల్ 98481 98888
ఉ.10 నుంచి మధ్యాహ్నం 1 గంట మధ్య మాత్రమే

పహాడీషరీఫ్, మీర్‌పేట, ఆర్కేపురం, బాలాపూర్, న్యూస్‌టుడే:

? జల్‌పల్లి పీ7 కార్గో రోడ్డు పెద్దచెరువు పక్కన పలు వాహనాదారులు నగరం నుంచి తీసుకొస్తున్న చెత్త, వ్యర్థాలను పారబోస్తున్నారు. రహదారి పొడవునా ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోంది.
– గొరిగె వెంకటేష్, జల్‌పల్లి

✓ క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. పలువురు వాహనదారులను పట్టుకుని చలానాలు వేస్తున్నాం.
– వాణిరెడ్డి, జల్‌పల్లి పురపాలిక కమిషనర్

? మీర్‌పేట కార్పొరేషన్ జిల్లెలగూడ వెంకటేశ్వరకాలనీ రోడ్ నెం 1లో చెట్టు కొమ్మలు విరిగి విద్యుత్తు తీగల మీద పడి ప్రమాదకరంగా ఉన్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి వాటిని తొలగించాలి.
– నండూరి శివప్రసాద్, వెంకటేశ్వరకాలనీ, జిల్లెలగూడ

✓ ఈ విషయంపై స్థానిక విద్యుత్తు శాఖ ఏఈకి సమాచారం ఇచ్చి సమస్య పరిష్కరిస్తాం.– చంద్రశేఖర్, కమిషనర్, మీర్‌పేట కార్పొరేషన్

? అల్కాపురి కాలనీ పార్కు సమీపంలో వ్యర్థాలు వేస్తున్నారు.
–సుమన్, అల్కాపురి

✓ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం –సుజాత, సరూర్‌నగర్ డీసీ

? బాలాపూర్ రెడ్డి కాలనీలో విద్యుత్తు స్తంభాలకు దీపాలు ఏర్పాటు చేయాలి. – రాజు, నాదర్‌గుల్

✓ త్వరలోనే లైట్లు ఏర్పాటు చేస్తాం.
– తోట శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్, బడంగ్‌పేట

ఆగని ఆర్టీసీ పండగ స్పెషల్ దోపిడీ



దేవరకొండ బస్సులో ఉన్న స్పెషల్ బోర్డు



పండగ ముందు యాచారం-ఐఎస్‌సదన్ రూ.70 టికెట్



16వ తేదీన యాచారం-ఐఎస్‌సదన్ రూ.90 టికెట్

యాచారం: పండగలప్పుడు ప్రత్యేక బస్సులు నడిపి ఆర్టీసీ ప్రయాణికుల నుంచి అదనపు ఛార్జీలు వసూలు చేయడం తెలిసిందే. అయితే, దసరా పండగ గడిచి ఇన్నిరోజులు దాటినా అదనపు వసూళ్లు ఆపకపోవడంపై ప్రయాణికులకు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యాచారం మీదుగా నడిపే దేవరకొండ బస్సుల్లో ఈ ప్రత్యేకం పేరుతో అదనపు భారం వేయడం కొనసాగుతోంది. యాచారం నుంచి ఐఎస్ సదన్ వెళ్లడానికి ఎక్స్‌ప్రెస్ బస్సులో ఛార్జీ రూ.70.. పండగ సందర్భంగా రూ.90 వసూలు చేశారు. ఇంకా స్పెషల్ బోర్డు పెట్టి అదనపు ధరలు వసూలు చేస్తున్నారు.

నగరంలో విద్యుత్తు చీఫ్ ఇంజినీర్ల బదిలీలు

ఈనాడు, హైదరాబాద్: నగరంలో విద్యుత్తు చీఫ్ ఇంజినీర్లు సమూలంగా బదిలీ అయ్యారు. ఆపరేషన్ విభాగంలో ఉన్నవారిని కార్యాలయ పోస్టులకు, ఇన్నాళ్లు కార్యాలయాలకే పరిమితమైన వారిని ఆపరేషన్ విభాగాలకు బదిలీ చేస్తూ టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ బుధవారం అర్ధరాత్రి బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో పలువురు గురువారం ఉదయమే కొత్తపోస్టుల్లో బాధ్యతలు చేపట్టారు. రంగారెడ్డి జోన్ ఆపరేషన్ సీఈ ఆనంద్ కార్పొరేట్ కార్యాలయంలోని పీ అండ్ ఎంఎం విభాగానికి బదిలీ అయ్యారు. మాస్టర్‌ప్లాన్ సీఈ పాండ్య నాయక్ రంగారెడ్డి జోన్ సీఈగా బదిలీ అయ్యారు. మేడ్చల్ జోన్ సీఈగా కామేష్ బాధ్యతలు చేపట్టారు. మేడ్చల్ జోన్ సీఈగా ఉన్న సాయిబాబను కార్పొరేట్ కార్యాలయం ఆర్‌ఏసీకి బదిలీ చేశారు. కమర్షియల్ నుంచి మాస్టర్‌ప్లాన్ సీఈగా నర్సింహ స్వామి బదిలీ అయ్యారు. రూరల్ జోన్ సీఈగా బాలస్వామి, కమర్షియల్ సీఈగా భిక్షపతి, మెట్రోజోన్ సీఈగా చక్రపాణికి బాధ్యతలు అప్పగించారు.

పోలీసులం.. మీకు స్నేహితులం

యాచారం, న్యూస్‌టుడే: పోలీసులు ప్రజల మధ్య స్నేహబంధం ఉన్నప్పుడే శాంతి భద్రతలు బాగుంటాయని ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ సీఐ లిక్కి కృష్ణంరాజు అన్నారు. తాటిపర్తి గ్రామంలో గురువారం రాత్రి ప్రజలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏమాత్రం అనుమానం వచ్చినా పోలీసులకు సమాచారం ఇచ్చి సహకరించాలని సీఐ సూచించారు. వాహనాలను తనిఖీ చేశారు. ఎస్సై, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కల్వకుర్తిలో రహదారులకు రూ.204 కోట్లు మంజూరు



ఆమనగల్లులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, వేదికపై నాయకులు

ఆమనగల్లు, న్యూస్‌టుడే: కల్వకుర్తి నియోజకవర్గంలో బీటీ రహదారులు నిర్మించేందుకు రూ.204 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క సహకారంతో నిధులు విడుదలైనట్లు ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లులోని ఓ కల్యాణ మండపంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తండాలు, గ్రామాలకు కనెక్టివిటీ రోడ్ల నిర్మాణానికి రూ.100 కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. అవి వారంరోజుల్లో మంజూరవుతాయని తెలిపారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామన్నారు. అనంతరం రేవంత్‌రెడ్డి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. వంపుగూడలో భవన నిర్మాణ కార్మికుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు బాలాజీసింగ్, శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ, జగన్, మానయ్య తదితరులు పాల్గొన్నారు.



గట్టుఇప్పలపల్లిలో ఫుడ్ కమిషన్ సభ్యుడు గోలి శ్రీనివాస్‌రెడ్డి



తుర్కయంజాల్‌లో..



పెద్దఅంబర్‌పేట్‌లో..

ఘనంగా వాల్మీకి జయంతి

తలకొండపల్లి, తుర్కయంజాల్, పెద్దఅంబర్‌పేట్: తలకొండపల్లి మండలం గట్టుఇప్పలపల్లి గ్రామంలో వాల్మీకి జయంతి వేడుకలను ఆ సంఘం నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వాల్మీకి విగ్రహానికి పూజలు చేశారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు బాలాజీసింగ్, మాజీ ఎంపీపీలు పాల్గొన్నారు. ◆ తుర్కయంజాల్‌లోని మున్సిపల్ కార్యాలయంలో వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కమిషనర్ అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, ఆర్ఓ శ్రీనివాస్‌రెడ్డి, ఇతర సిబ్బంది వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ◆ పెద్దఅంబర్‌పేట్‌లో వాల్మీకి చిత్రపటానికి ఛైర్‌పర్సన్ జయశ్రీ పూలమాల వేసి నివాళులర్పించారు. కౌన్సిలర్లు పసుల రాజేందర్, తొండపు రోహిణిరెడ్డి, కోటేశ్వర్‌రావు, కమిషనర్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెల్లని చెక్కులిచ్చిన వ్యక్తికి ఆరు నెలల జైలు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: తీసుకున్న అప్పు తిరిగి తీర్చడానికి రెండు చెల్లని చెక్కులిచ్చి మోసం చేసిన వ్యక్తికి న్యాయస్థానం ఆరు నెలల జైలు శిక్ష, రూ.1.50 లక్షల జరిమానా విధించింది. జరిమానాలో ఫిర్యాదీ రూ.1.40 లక్షలు పరిహారంగా పొందొచ్చని రంగారెడ్డి జిల్లా 6వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ శ్రద్ధా సెహగల్ గురువారం తీర్పునిచ్చారు. ఫిర్యాదీ తరఫు న్యాయవాది యాసాని చంద్రారెడ్డి కథనం ప్రకారం.. బాలాపూర్ పరిధి ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీకి చెందిన నాగరాజు 2014లో మీర్‌పేటలోని బృందావన్ కాలనీకి చెందిన ఎం.లక్ష్మి వద్ద రూ.85,000 అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీర్చేందుకు నాగరాజు ఇచ్చిన రెండు చెక్కులు చెల్లలేదు. ఈ విషయమై లక్ష్మి లీగల్ నోటీస్ పంపినప్పటికీ నాగరాజు స్పందించలేదు. దీంతో బాధితురాలు న్యాయస్థానంలో కేసు దాఖలు చేశారు.

భవనంపై నుంచి పడి మహిళ మృతి

బాలాపూర్, న్యూస్‌టుడే: భవనం మూడో అంతస్తు నుంచి ఓ మహిళ ప్రమాదవశాత్తు కింద పడి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కె.నాగరాజు కథనం ప్రకారం... నందనవనం మూడు గుళ్ల రోడ్డులోని బ్లాక్ నెంబరు 34 మూడో అంతస్తులో భార్యభర్తలు సింగిరెడ్డి లావణ్య(40) సుధాకర్‌రెడ్డి నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. ఆమె పెట్రోల్ బంక్‌లో పనిచేస్తోంది. గురువారం మధ్యాహ్నం ఇంటి ముందున్న బాల్కనీలో ప్లాస్టిక్ కుర్చీపై నిలబడి మనీ ప్లాంట్ మొక్కను సరిచేస్తోంది. ప్రమాదవశాత్తు ఆమె బాల్కనీ నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆధ్యాత్మిక సేవలో మహిళలు ముందుండాలి



శిలఫలకాన్ని ప్రారంభిస్తున్న దేప సురేఖ, భాస్కర్‌రెడ్డి. చిత్రంలో బండపల్లి రీతా, సంతోష్

ఆర్కేపురం, న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక సేవలో మహిళలు, యువకులు ముందుండాలని ఆర్కేపురం మాజీ కార్పొరేటర్ దేప సురేఖరెడ్డి అన్నారు. గ్రీన్ హిల్స్ కాలనీలో నూతనంగా నిర్మించిన సాయినాథుడి మందిరాన్ని గురువారం టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డితో కలిసి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి భూమి ఇచ్చిన బండపల్లి రీతా(అమల), సంతోష్‌లను సత్కరించారు. అనంతరం ఆలయ శిలఫలకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ నేత చిలుక ఉపేందర్‌రెడ్డి, ఎస్సీ సెల్ కన్వీనర్ మధుసూదన్‌రావు, సీనియర్ నేతలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

‘సంక్షేమం, అభివృద్ధిలో కాంగ్రెస్ విఫలం’



ఇబ్రహీంపట్నంలో నినాదాలు చేస్తున్న భారాస నాయకులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం, అభివృద్ధి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని భారాస విద్యార్థి విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్, జిల్లా నాయకులు నిట్టు జగదీష్ ఆరోపించారు. గురువారం ఇబ్రహీంపట్నంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అనంతరం తెలంగాణ భవన్‌లో సమావేశానికి ఇబ్రహీంపట్నం నుంచి విద్యార్థి, యువజన విభాగం నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు మడుపు శివ, ప్రవీణ్, రాఘవేందర్, మనీష్‌రెడ్డి, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలాలు విక్రయిస్తున్నా పట్టించుకోరా?

బాలాపూర్, న్యూస్‌టుడే: బడంగ్‌పేట పరిధిలో ఆయా ప్రాంతాల్లో పార్కులు కబ్జా అవుతున్నా అధికారులు పట్టించుకోవట్లేదని బడంగ్‌పేట కార్పొరేషన్ భాజపా అధ్యక్షుడు సీహెచ్.వెంకట్‌రెడ్డి ఆరోపించారు. నాదర్‌గుల్‌లోని భాజపా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు ఎ.రాంరెడ్డి, టి.మల్లేష్‌యాదవ్, ఆర్.నర్సింహారెడ్డి, కె.లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అండర్ 14 క్రికెట్ విజేత మహబూబ్‌నగర్

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే: గద్వాల ఇండోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు నిర్వహించిన అండర్-14 బాలుర రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. రాష్ట్రం నుంచి పది జిల్లాల జట్లు హాజరు కాగా, మహబూబ్‌నగర్ ప్రథమ, రంగారెడ్డి, హైదరాబాద్ సంయుక్తంగా ద్వితీయ, నల్గొండ తృతీయ స్థానాలు దక్కించుకున్నాయని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జితేందర్ తెలిపారు. అనంతరం విజేతలకు జోగులాంబ గద్వాల జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్ ట్రోఫీ అందజేశారు. ఈ క్రమంలో పతకాలను, ప్రశంసా పత్రాలను ఆయన చేతులమీదుగా బహూకరించారు. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని కన్వీనర్ శ్రీనివాసులు తెలియజేశారు. జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి బీఎస్ ఆనంద్, సూపరింటెండెంట్ రామకృష్ణారావు, విజయ్‌పాల్, కృష్ణయ్య, బీసన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాల్లో సత్తాచాటిన విద్యార్థులు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ హెచ్ ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రాంగణ నియామకాల్లో సత్తాచాటారు. తాజాగా జరిగిన ఇన్ఫోసిస్ నియామకాల్లో ఆరుగురు రూ.9.5లక్షల చొప్పున ప్యాకేజీతో ఎంపికయ్యారు. మొత్తం బీటెక్ నుంచి 234, ఎంటెక్, ఎంసీఏ నుంచి 249మంది ఇన్ఫోసిస్‌కు దరఖాస్తు చేసుకోగా ఇందులో సీఎస్‌ఈ నుంచి పి.సనితారెడ్డి, కె.సాయిహేమంత్‌నారాయణ్, ఎస్.గ్రీష్మా, హెచ్.కేశరాజు, సీఎస్‌ఈ ఐడీపీ నుంచి బి.స్ఫూర్తి, ఎంసీఏ నుంచి కె.శ్రీఉమాదేవి ఉద్యోగాలు సాధించారు.

భూ ఆక్రమణ.. ఇద్దరికి జైలు

యాచారం, న్యూస్‌టుడే: భూ ఆక్రమణకు పాల్పడిన ఇద్దరికి ఇబ్రహీంపట్నం కోర్టు గురువారం శిక్ష ఖరారు చేసింది. ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు వివరాల ప్రకారం.. కందుకూరు మండలం మీర్‌కాన్‌పేటకు చెందిన రైతు ప్రతాపరెడ్డి భూమిని ఇదే గ్రామానికి చెందిన పెద్ద ఈదయ్య, సత్తయ్య 2020లో ఆక్రమించే ప్రయత్నం చేశారు. అప్పట్లో రైతు ఫిర్యాదు మేరకు సీఐ ప్రభాకర్ కేసు నమోదు చేసి సాక్ష్యాలను కోర్టుకు సమర్పించారు. వాటిని పరిశీలించిన న్యాయమూర్తి హిమబిందు.. ఇద్దరు నేరస్థులకు 2 నెలల జైలు లేదా రూ.2500 చొప్పున జరిమానా చెల్లించాలని తీర్పు ఇచ్చినట్లు సీఐ చెప్పారు.

గుర్తుతెలియని మృతదేహం గుర్తింపు

ఆదిభట్ల, న్యూస్‌టుడే: నాదర్‌గుల్‌లోని పార్వతీపురం కాలనీ దుర్గామాత దేవాలయం వెనకాల గుర్తుతెలియని మహిళ మృతదేహం(55) పడి ఉంది. గురువారం ఉదయం సీఐ రాఘవేందర్‌రెడ్డి అక్కడకు చేరుకొని వివరాలు సేకరించారు. 10రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నట్లు స్థానికుల ద్వారా తెలుసుకున్నారు. ఆదిభట్ల పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

యాచారం, న్యూస్‌టుడే: యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో సాగర్ రహదారిపై బుధవారం రాత్రి ఆటో, కారు ఢీకొన్న సంఘటనలో నలుగురు గాయపడ్డారు. గాయపడిన నలుగురిని ఇబ్రహీంపట్నం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్‌పై యాచారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

పహాడీషరీఫ్, న్యూస్‌టుడే: బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ గురువారం ఠాణా పరిధిలోని 32మంది రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నేరాలకు పాల్పడితే కొత్త చట్టాలతో కఠినమైన శిక్షలు పడతాయని హెచ్చరించారు.

బొమ్మలు గీసి.. మొక్కలు నాటి

సేవా మార్గంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు




పాఠ్యాంశాలకు చెందిన చిత్రాలు గీస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు



మొక్కలు నాటేందుకు గుంతలు తీస్తున్న యూత్ ఫర్ సేవా సంస్థ ప్రతినిధులు

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: కార్పొరేట్ కంపెనీల ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు.. వారాంతం వచ్చిందంటే విందులు, వినోదాల్లో మునిగితేలతారని అంతా భావిస్తుంటారు. అయితే కొందరు యువత ఇందుకు భిన్నంగా అవకాశం చిక్కినప్పుడల్లా సేవా మార్గంలో వెళుతున్నారు. యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కార్పొరేట్ కంపెనీల సహకారంతో సేవా కార్యక్రమాల్లో తలమునకలవుతున్నారు. ఇలాంటి యువతకు జేజేలు పలకడంతో పాటు మిగిలినవారు వీరిని ఆదర్శంగా తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



మజీద్‌పూర్ పాఠశాలలో గోడపై బొమ్మ గీస్తూ..

ప్రభుత్వ పాఠశాలలో సేవలు

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సుమారు 35 మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు వచ్చి.. పాఠశాలలోని తరగతి గదుల్లో, ఆవరణలోని గోడలపై పాఠ్యాంశాలకు సంబంధించిన చిత్రాలను ఆకర్షణీయంగా చిత్రీకరించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు తమ వంతు సేవలందించేందుకు సిద్ధమని పేర్కొన్నారు.

స్థితిగతులు మార్చడమే లక్ష్యం..

ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను మార్చేలా తమ వంతు కృషి చేస్తున్నట్లు యూత్ ఫర్ సేవా సంస్థ ప్రతినిధి, హైదరాబాద్ చాప్టర్ మేనేజర్ అరవింద్, కార్పొరేట్ వాలంటీర్ కోఆర్డినేటర్ ప్రదీప్ పేర్కొన్నారు. అధ్వానంగా ఉన్న సర్కారు పాఠశాలల్లో ఆహ్లాదకర వాతావరణం నింపడమే తమ లక్ష్యమని వెల్లడించారు.

సికింద్రాబాద్

• సికింద్రాబాద్ • కంటోన్మెంట్ • సనత్‌నగర్

ముగిసిన కెరీర్ ఫెయిర్-2024



అవగాహన కల్పిస్తున్న వర్సిటీల ప్రతినిధులు

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: న్యూబోయిన్‌పల్లి సీతారాంపురంలోని సెయింట్ పీటర్స్ హై స్కూల్‌లో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న కెరీర్ ఫెయిర్-2024 కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ కార్యక్రమంలో దేశ నలుమూలలకు చెందిన 29 వివిధ విశ్వవిద్యాలయాల పరిపాలన అధికారులు పాల్గొని, విద్యార్థులకు భవిష్యత్తులో విద్యాలయాలలో చేరాల్సిన వివిధవిధానాలతోపాటు వారు ఎంపిక చేసుకునే కోర్సుల్లో సందేహాలను నివృత్తి చేశారు. పాఠశాల కరస్పాండెంట్ టీపీ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదల వైద్య సాయానికి కృషి



సహాయ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే

సికింద్రాబాద్, న్యూస్‌టుడే: నిరుపేదలకు వైద్య సాయం అందించడానికి తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని ఎమ్మెల్యే టి.పద్మారావుగౌడ్ తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న సికింద్రాబాద్ నియోజకవర్గంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన స్టాలిన్, వారాసిగూడకు చెందిన బి.పోషాలకు రూ.2లక్షలు, రూ.4లక్షల చొప్పున మంజూరైన ఎల్వోసీ పత్రాలను గురువారం తన కార్యాలయంలో ఎల్వోసీ పత్రాలు అందించారు.

మేమున్నాం..మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

సికింద్రాబాద్	:	8008573368
కంటోన్మెంట్	:	8008573361
సనత్‌నగర్	:	8008573356

రసూల్‌పుర, న్యూస్‌టుడే: ? బాలంరాయి సొసైటీలో నీటి సరఫరా జరిగే సమయంలో కొందరు నల్లాకు నేరుగా మోటార్లను బిగిస్తున్నారు. దీంతో దిగువ ప్రాంతాలకు సరిపడా నీరు రావడం లేదు. - అశోక్, బాలరాయి సొసైటీ.

✓ నీటి చౌర్యం చేస్తే సహించేది లేదు. త్వరలోనే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి చర్యలు తీసుకుంటాం. - రాజ్‌కుమార్, బోర్డు నీటి విభాగం ఉన్నతాధికారి.

స్పందనకు వందనం

కార్ఖానా, న్యూస్‌టుడే: కంటోన్మెంట్ మూడో వార్డులోని జనక్‌పురి కాలనీలో డ్రైనేజీలు కొన్ని వారాల తరబడి పొంగుతూనే ఉన్నాయి. ఈ సమస్యను స్థానిక కాలనీ వాసులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకురాగా.. 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. డ్రైనేజీలకు మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించారు.

వామ్మో వాంబే

◆ శిథిలావస్థకు చేరిన కృష్ణానగర్‌లోని గృహాలు

◆ గోడలకు బీటలు.. ఊడుతున్న పెచ్చులు



కృష్ణానగర్ వాంబే గృహాలు



బీటలు వారిన గోడలు

రసూల్‌పురా, న్యూస్‌టుడే: బీటలు వారుతున్న గోడలు.. పెచ్చులూడుతున్న పైకప్పులు.. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు కంటోన్మెంట్ రెండో వార్డులోని కృష్ణానగర్ వాంబే గృహాల్లోని నివాసితులు. తరచూ వర్షాలు కురుస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. ఇళ్లకు మరమ్మతులు చేయాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బస్తీలో 2003 సంవత్సరంలో 11 బ్లాకులలో దాదాపు 486 గృహాలను నిర్మించారు. 20 ఏళ్ల కిందట నిర్మించిన ఈ ఇళ్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి మంత్రి తలసాని అధికారులతో కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ఇళ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, అందుకు అవసరమైన నిధులను సైతం మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటివరకు పరిస్థితి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లుగా ఉంది. కానీ మరమ్మతులు మాత్రం చేపట్టలేకపోయారు.

జాప్యం భయంతోనే వెనకడుగు..

ఇళ్లు చాలావరకు శిథిలావస్థకు చేరాయి. బస్తీలోని కొన్ని కుటుంబాలు కొత్త ఇళ్లు నిర్మించాలనే అభిప్రాయం వ్యక్తం చేసినా.. అవి కట్టడానికి ఏళ్ల సమయం పడుతుందని, జాప్యం నెలకొనే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఈ కారణంగానే వెనకడుగు వేస్తున్నారు. ఇక్కడ ఉంటున్న వారిలో చాలామంది చిన్నచిన్న పనులు చేసుకొనే వారే. ఇళ్లను ఖాళీ చేసి అద్దెలు భరించడం ఆర్థికంగా భారమవుతుందని అంటున్నారు.

మరమ్మతులకు మొగ్గు..

స్థానికుల అభ్యర్థనతో ఇటీవల ఎమ్మెల్యే శ్రీ గణేష్, గృహనిర్మాణ, రెవెన్యూ అధికారులు బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా బీటలు వారిన గోడలు, పెచ్చులూడుతున్న స్లాబులను పరిశీలించారు. మరమ్మతులు చేయాలా లేక కొత్తవి నిర్మించాలా అనే విషయాన్ని బస్తీ వాసులంతా కలిసి సమష్టిగా ఒక అభిప్రాయానికి వచ్చి తమకు ప్రతిపాదిస్తే ఓ నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యేతో పాటు అధికారులూ పేర్కొన్నారు. ఈ మేరకు బస్తీ వాసులు కొన్ని రోజుల క్రితం సమావేశం నిర్వహించగా మెజార్టీ శాతం మరమ్మతులకు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. వెంటనే అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పారిశుద్ధ్యం నయ్.. దోమలు గుయ్



బేగంపేట నాలాలో చెత్తాచెదారం

బేగంపేట, న్యూస్‌టుడే: బేగంపేట నాలా ఇరువైపులా బస్తీల్లో దోమలు విజృంభిస్తున్నాయి. కంటి మీద కునుకు లేకుండా రాత్రులు గడుపుతున్నారు. నాలాలో పూడిక నిండటం, బస్తీల్లో పారిశుద్ధ్య లోపం, చాలాకాలంగా ఫాగింగ్ చేయకపోవడంతో దోమలకు ఈ ప్రాంతం ఆవాసంగా మారుతోంది. డెంగీ, మలేరియా జ్వరాలు ప్రబలుతుండటంతో దోమల నివారణ చర్యలు కనిపించడం లేదని స్థానికులు వాపోతున్నారు.

సాంద్రత ఇక్కడే ఎక్కువ

బేగంపేట బ్రాహ్మణవాడిలోని స్వామి రామానంద తీర్థ స్మారక కేంద్రం ఆవరణలో గతంలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన మస్కిట్ యంత్రం ద్వారా దోమల రకాలు, సాంద్రతను లెక్కించారు. ఓ ప్రైవేటు సంస్థతో కలిసి జీహెచ్‌ఎంసీ అధికారులు బేగంపేట, బోరబండ, మలక్‌పేట, నాచారం, జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయాల్లో మస్కిట్ యంత్రాలను ఏర్పాటు చేశారు. ఈ యంత్రాల ద్వారా 250 మీటర్ల పరిధిలోని దోమలను ఆకర్షించి, వాటి సాంద్రత, రకాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఇలా లెక్కించగా బేగంపేట బ్రాహ్మణవాడిలో ఏర్పాటు చేసి మస్కిట్ యంత్రానికి చిక్కిన దోమలే అధికంగా ఉన్నాయని గణాంకాలు వెల్లడించాయి. 24 గంటల పాటు మస్కిట్ ద్వారా దోమలను ఆకర్షించగా బేగంపేటలో 200 వరకు దోమలు చిక్కాయి. సాధారణం కంటే ఇది నాలుగు రెట్లు అధికమని తెలుస్తుంది. బేగంపేటలోని బ్రాహ్మణవాడి, మాతాజీనగర్, ఓల్డ్ కస్టమ్స్ బస్తీ, అల్లంతోటబావి, ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్, మయూరిమార్గ్‌లలో దోమలు ఎక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

పడకేసిన ఫాగింగ్

బేగంపేట నాలా పరిసర ప్రాంతాలు, బస్తీల్లో ఎక్కువగా ఉన్న దోమలను నిర్మూలించే కార్యక్రమాలపై అధికారులు అంతగా శ్రద్ధపెట్టడం లేదని స్థానికులంటున్నారు. ఫాగింగ్ చేయడం, నాలాలు, కాలువల్లో యాంటీ లార్వా మందు పిచికారీ, చెత్తాచెదారం, ఎండిన, రాలిన ఆకులను తొలగించడం వంటి చర్యలు ఇక్కడ కనిపించడం లేదు. ముఖ్యంగా డెంగీ కారక దోమలను అరికట్టేందుకు ఇంటింటికీ తిరిగి నివాసితులకు అవగాహన కల్పించాల్సి ఉన్నా ఎక్కడా ఈ ప్రయత్నం జరగడం లేదనే ఆరోపణలున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు చెబితే తప్ప కొన్ని బస్తీల్లో ఫాగింగ్ చేయడం లేదు.

మరింత మెరుగ్గా ఎంఎంటీఎస్, సబర్బన్ రైళ్ల సేవలు

ఈనాడు, హైదరాబాద్: ప్రయాణికులకు మెరుగైన ఎంఎంటీఎస్ సేవలను అందించేందుకు కృషి చేస్తున్నట్టు సికింద్రాబాద్ డివిజనల్ రైల్వేమేనేజర్ భరతేష్‌కుమార్ జైన్, హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఎంటీఎస్ (మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్), సబర్బన్ రైలు సేవలపై నగరంలోని ప్రయాణికుల అసోసియేషన్లతో సంచాలన్ భవన్‌లో సమావేశాలు నిర్వహించి సలహాలు, సూచనలు స్వీకరించారు. జంట నగరాల సబర్బన్ ట్రావెలర్స్ అసోసియేషన్, అమ్ముగూడలోని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, రాఘవేంద్రకాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, వివేకానందపురం వెల్ఫేర్ అసోసియేషన్, దక్షిణ మధ్య రైల్వే ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు హాజరయ్యారు. సమయ పాలన, ఎంఎంటీఎస్‌లో ప్రయాణించేలా ప్రోత్సాహం, హైలైట్స్ యాప్‌ను పునర్నిర్మించడం, సేవల పొడగింపు, అదనపు స్టాపేజ్, వేర్వేరు మార్గాల్లో పునరుద్ధరణపై మేనేజర్లకు వివరించారు.



నాడు కంపు.. నేడు ఇంపు

ఎప్పుడు మురుగునీటితో భరించలేని దుర్వాసనతో కనిపించే బోయిన్‌పల్లిలోని రామన్నకుంట చెరువు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. చెరువులోకి సమీపంలోని కాలనీలు, బస్తీల నుంచి వచ్చే డ్రైనేజీ నీటిని ప్రత్యేక పైప్‌లైన్‌లను వేసి మళ్లిస్తున్నారు. దీంతో కుంట బాగుపడింది. ఇటీవల కురిసిన వర్షాలకు వరద చేరడంతో జలకళతో ఉట్టిపడుతోంది. దుర్వాసన లేకపోవడంతో స్థానికులు ఉదయం, సాయంత్రం వేళల్లో ఇక్కడ సేదతీరుతున్నారు. - న్యూస్‌టుడే, కార్ఖానా

ముక్కు మూసుకోవాల్సిందే..



అడ్డగుట్ట చౌరస్తా నుంచి ప్రభుత్వ పాఠశాలలు, మారేడుపల్లి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో రహదారి పక్కనే చెత్త కుప్పలు పేరుకుపోయాయి. పైప్రాంతం నుంచి వచ్చే నీరు అందులో కలిసిపోయి దుర్వాసన వస్తోంది. ఆ మార్గంలో ముక్కు మూసుకొని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. - న్యూస్‌టుడే, అడ్డగుట్ట

బంగారు చీరలో ఎల్లమ్మ



పౌర్ణమి సందర్భంగా గురువారం బల్కంపేటలోని శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారిని బంగారు పట్టుచీర, రకరకాల పూలతో అలంకరించారు. బావిలోని అమ్మవారి స్వయంభువు చుట్టూ దీపాలు వెలిగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. - న్యూస్‌టుడే, అమీర్‌పేట

హోల్ సోల్స్ డేకు ఏర్పాట్లు చేయాలని వినతి

పద్మారావునగర్, న్యూస్‌టుడే: నవంబర్ 2న నిర్వహించే హోల్ సోల్స్ డే (పవిత్ర ఆత్మలదినం)కు వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని గురువారం బన్సీలాల్‌పేటలోని బోయగూడ క్యాథలిక్ గ్రేవ్ యార్డ్ నిర్వాహకులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేవ్ యార్డ్‌ను లైటింగ్ ఏర్పాటు, చెత్త, ఇతర వ్యర్థాలను తొలగించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా అధికారులను ఆదేశిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కార్పొరేటర్ కుర్మ హేమలత, ఫాదర్ ఆరోగ్యం, హాజీ టార్చర్ జయరాజ్ తదితరులు ఉన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మహేష్ వైష్ణవికి స్వర్ణం



సనత్‌నగర్, న్యూస్‌టుడే: ఇటీవల దక్షిణ ఆఫ్రికాలోని సన్ సిటీలో జరిగిన కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రెజిమెంటల్‌బజార్‌కు చెందిన మహేష్ వైష్ణవి స్వర్ణం సాధించింది. ఈ నెల 4 నుంచి 13 వరకు జరిగిన పోటీల్లో 30 దేశాలకు చెందిన 600 మంది క్రీడాకారులు పాల్గొనగా 84 కిలోల విభాగంలో వైష్ణవి విజేతగా నిలిచి పసిడి పతకం దక్కించుకుంది. నగరానికి చేరుకున్న ఆమె గురువారం మారేడుపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను మార్యదపూర్వకంగా కలిశారు. పోటీలకు వెళ్లే సమయంలో వైష్ణవి ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నట్లు తెలుసుకున్న తలసాని కుమారుడు సాయి కిరణ్ యాదవ్ తలసాని ట్రస్ట్ ద్వారా రూ.2లక్షల సాయం అందించారు.

చరవాణులు చోరీ చేస్తున్న యువతి రిమాండ్

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: రద్దీ ప్రదేశాల్లో చరవాణులు కొట్టేస్తున్న యువతిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. డీఐ మధుసూదన్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం... దసరా నవరాత్రుల్లో రద్దీగా ఉన్న పెద్దమ్మగుడి వద్ద సనత్‌నగర్‌లోని ఫతేనగర్ ప్రాంతానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి కొమ్మిరె మోర్లిన్ అలియాస్ మేరీ 13 చరవాణులను కాజేసింది. రాయలపురం వెంకటేష్, ఫతేనగర్‌కు చెందిన యుగంధర్, బాలానగర్ రాజుకాలనీకి చెందిన రేణుక విక్రయించి డబ్బులను మేరికి ఇచ్చారు. సీసీ కెమెరాల ఆధారంగా మేరీని గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించింది. ఏడు చరవాణులను స్వాధీనం చేసుకొని, ఆమెతో పాటు వెంకటేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. యుగంధర్, రేణుక పరారీలో ఉన్నట్లు తెలిపారు.

'బకాయిలు విడుదల చేయకపోతే సచివాలయం ముట్టడి'



మాట్లాడుతున్న సంజయ్ కుమార్

లాలాపేట, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు 24 గంటల్లోగా విడుదల చేయకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తామని బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ తెలిపారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించకుండా, విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించడమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి చేరాల వంశీ నేత, దాడి అజయ్, కిరణ్ యాదవ్, కీర్తి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి జీవితం యువతకు ఆదర్శం

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: వాల్మీకి మహర్షి జీవితం యువతరానికి ఆదర్శమని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ అన్నారు. ఐదో వార్డు పరిధిలోని వాల్మీకినగర్ బస్తీలోని వాల్మీకి మహర్షి ఆలయంలో నిర్వహించిన జయంతి వేడుకలకు ఆయన హాజరై పూజలు చేశారు. వాల్మీకి సమాజ్ నాయకుడు సతీశ్ ఆధ్వర్యంలో కార్యక్రమంలో రణవీర్, సుశీల్, లడ్డు, వినోద్, ప్రదీప్, అమర్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

సనత్‌నగర్, న్యూస్‌టుడే: సనత్‌నగర్‌లోని కాలుష్య నియంత్రణ మండలి కేంద్ర కార్యాలయంలో ఆశ్వయుజ పూర్ణిమ సందర్భంగా గురువారం వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పీసీబీ సభ్య కార్యదర్శి జి.రవి ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. పీసీబీ సోషల్ సైంటిస్ట్ డబ్ల్యు.జి.ప్రసన్నకుమార్, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



కార్యాలయంలో పీసీబీ సభ్య కార్యదర్శి రవి, ఇతర అధికారులు

జీవో 29తో బహుజన నిరుద్యోగులకు అన్యాయం



నిరసన వ్యక్తం చేస్తున్న వినోద్‌కుమార్, అభ్యర్థులు

లాలాపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వం జీవో నంబరు 29ని వెంటనే రద్దు చేయాలని దక్షిణ భారత రాజకీయ జేఏసీ ఛైర్మన్, ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఓయూలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో గ్రూప్-1 అభ్యర్థులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఏడు శాతం అగ్రవర్ణాలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ.. 93 శాతం జనాభా ఉన్న బహుజన నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేస్తున్న జీవో నంబరు 29ని రద్దు చేసే వరకు పోరాటం చేస్తామన్నారు. జీవో నంబరు 55 ప్రకారం రిజర్వేషన్లను రీ షెడ్యూల్ చేసి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ జనపరిషత్ నాయకుడు విజయరాజ్‌తో పాటు పలువురు అభ్యర్థులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో శాంతి చండీ హోమం

గుడి ఎదురుగా టెంటు తొలగించిన పోలీసులు.. వాగ్వాదం



హోమం చేస్తున్న పండితులు

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయంలో ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో ఆలయ కమిటీ సభ్యులు గురువారం శాంతి చండీహోమం, పూర్ణాహుతి పూజలు చేశారు. వేదపండితుల సూచనతో అమ్మవారికి శాంతి చేయడానికి శుక్రవారం భక్తులు, స్థానికులతో కలిసి సాక పోసే కార్యక్రమం నిర్వహించనున్నట్లు సభ్యులు తెలిపారు.

స్వల్ప ఉద్రిక్తత.. ఆలయం ముందు స్థానికులు, హిందూ సంఘాలు టెంట్ వేసుకొని పూజలు చేస్తుండగా.. పోలీసులు చేరుకున్నారు. అనుమతి లేకుండా టెంట్ వేసుకున్నారని దాన్ని తొలగించి తీసుకెళ్తుండగా పోలీసులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య వాగ్వాదం జరగ్గా స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక, పలువురు విషయాన్ని డీసీపీ రష్మీ పెరుమాళ్ దృష్టికి తీసుకెళ్లగా ఆమె టెంట్‌కు అనుమతించారు. వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ రాష్ట్ర అధ్యక్షులు బీఎస్ నరసింహ, శివరాం ఆలయాన్ని సందర్శించారు. ఈ నెల 19న సికింద్రాబాద్ ప్రాంతంలో బంద్‌కు, అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలకు పిలుపునిస్తామని ప్రకటించారు.

ప్రభుత్వ తీరు బాధాకరం: తలసాని



ఆర్థిక సాయం అందిస్తున్న తలసాని

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: బాధిత కుటుంబాలను ఆదుకునే విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు చాలా బాధకరమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ విచారం వ్యక్తం చేశారు. ఇటీవల దర్జీ దుకాణాలు కూలిపోయిన నష్టపోయిన నాలుగు కుటుంబాలకు గురువారం మోండామార్కెట్‌లోని ఓల్డ్ జైల్‌ఖానా వద్ద రాష్ట్ర మేరు సంఘం ఆధ్వర్యంలో కుట్టుమిషన్లు, మరో ఇద్దరు బాధితులకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 ఏళ్లుగా దర్జీగా చేస్తూ జీవనం సాగిస్తున్న కుటుంబాలు దుకాణాలు కూలిపోవడంతో తీవ్రంగా నష్టపోయాయని తెలిపారు. సంఘటన జరిగిన నెలరోజులు కావస్తున్నా బాధిత కుటుంబాలకు ప్రభుత్వపరంగా ఎలాంటి సాయం అందలేదన్నారు. త్వరలోనే తాత్కాలిక షెడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. కార్యక్రమంలో మేరు సంఘం ప్రతినిధులు చంద్రశేఖర్, నరేష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా.. ఇద్దరికి తీవ్ర గాయాలు

మొయినాబాద్: మితిమీరిన వేగం.. ఆపై మూలమలుపు.. వెరసి ఓ కారు అదుపుతప్పి రహదారి విభాగినిని ఢీకొట్టి పల్టీ కొట్టింది. ఇద్దరికి తీవ్ర గాయాలైన ఈ ప్రమాదం మొయినాబాద్ పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జి.పవన్‌కుమార్‌రెడ్డి వివరాల ప్రకారం. . సికింద్రాబాద్‌లోని సామశంకరం వీధికి చెందిన నవీన్ తన భార్య విమల(42), కుమార్తె నవ్యశ్రీ(13)తో కలిసి కారులో వికారాబాద్ బయల్దేరారు. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై అజీజ్‌నగర్ రెండు పడకగదుల ఇళ్ల సముదాయం వద్ద మూలమలుపులో వీరి వాహనం అదుపుతప్పి రహదారి విభాగినిని ఢీకొని పల్టీ కొట్టింది. ప్రమాదంలో విమల, నవ్యశ్రీలకు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు.

భార్యతో తరచూ గొడవ.. బలవన్మరణం

కంటోన్మెంట్: మద్యం మత్తులో తరచూ భార్యతో గొడవపడుతున్న ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బోయిన్‌పల్లి ఎస్సై శివశంకర్ వివరాల ప్రకారం... నేపాల్‌కు చెందిన శివరాజ్ జగత్ విశ్వకర్మ(34) అతని భార్య, నలుగురు పిల్లలతో కలిసి నగరానికి వచ్చి ఓల్డ్ బోయిన్‌పల్లి ఆర్ ఆర్ నగర్‌లోని ఓ అపార్ట్‌మెంటులో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. దసరా నుంచి నిత్యం మద్యం తాగుతుండటంతో తరచూ భార్యతో గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఆమె ఈ నెల 15న పిల్లలను తీసుకొని రసూల్‌పురాలో ఉంటున్న తల్లి వద్దకు వెళ్లింది. అప్పటినుంచి ఇంట్లో ఒంటరిగా ఉంటున్న శివరాజ్ జగత్ ఈ నెల 16న గదిలోని సీలింగ్ ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో గంజాయి వ్యాపారం

ఇద్దరు యువకుల అరెస్టు

అమీర్‌పేట, న్యూస్‌టుడే: నగరంలో అవసరమైన వారికి గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను గురువారం ఎస్సార్ నగర్ ఠాణాలో ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి వెల్లడించారు. బల్కంపేట సమీపంలోని నేచర్‌క్యూర్ రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయి వ్యాపారం సాగుతుందన్న సమాచారంతో పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. పాడేరు జిల్లా ముంచింగిపట్టు మండలం సిర్లిమెట్ట గ్రామానికి చెందిన కిల్లో మాధవరరావు(20), పశ్చిమ గోదావరి జిల్లా నల్లజార్లకు చెందిన మల్లుల రాకేష్(21)లు ఓ ద్విచక్ర వాహనంతో పట్టుపడ్డారు. వారి వద్ద 6 కిలోల 300 గ్రాముల గంజాయి లభించింది. నిందితులను విచారించగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా గంజాయి వ్యాపారంలోకి దిగినట్లు వెల్లడించారు. నిందితులిద్దరూ గతంలో అమీర్‌పేటలోని ఓ హోటల్‌లో సర్వెంట్లుగా పని చేశారు. మాధవరావు కొంతకాలం కిందట పనిమానేసి స్వగ్రామానికి వెళ్లిపోయాడు. ఇటీవల తిరిగి వచ్చి ఎల్లారెడ్డిగూడలో ఉంటూ వేరే హోటల్‌లో పనిచేస్తున్నాడు. ఇతను ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేశాడు. నెలనెలా వాయిదాలకు డబ్బులు చాలకపోవడంతో అతను పని చేసేచోట మిత్రులైన అలెక్స్, రాకేష్‌లను సంప్రదించాడు. అప్పటికే గంజాయి అలవాటున్న అలెక్స్ గంజాయి వ్యాపారం చేస్తే డబ్బు వస్తుందని చెప్పాడు. దీంతో మాధవరావు స్వగ్రామానికి వెళ్లి తన సోదరుడు కేశవరావు పండిస్తున్న గంజాయిని కొనుగోలు చేసి రైలులో నగరానికి తీసుకొచ్చాడు. మల్లుల రాకేష్‌తో కలిసి విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటనలో పరారీలో ఉన్న అలెక్స్, గంజాయి పండిస్తున్న కేశవరావు కోసం గాలిస్తున్నారు.

ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా వ్యాపారాలు చేసుకోవాలి



మోండా పాలికబజార్‌లో పర్యవేక్షిస్తున్న ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించకుండా, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా వ్యాపారాలు చేసుకోవాలని ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే సూచించారు. గురువారం జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్, ఉత్తర మండలం ట్రాఫిక్ పోలీసులతో కలిసి మోండా మార్కెట్ సుభాష్‌రోడ్డులో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించారు. అల్ఫాహోటల్ నుంచి బాటా వరకు సుభాష్‌రోడ్డులో ఫుట్‌పాత్‌లు, రోడ్లను దుకాణాల నిర్వాహకులు, చిరువ్యాపారాలు ఆక్రమించుకోవడంతో తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నట్లు గుర్తించామని చెప్పారు. కార్యక్రమంలో నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు, ఇన్‌స్పెక్టర్లు ఉపశంకర్, వెంకటరాముతో పాటు ఆరు ట్రాఫిక్ పోలీసుస్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, పెద్దసంఖ్యలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

మల్కాజిగిరి

అల్వాల్ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

అల్వాల్: (గురువారం నాటివి..కిలో రూ.లో) టమాటా 43, వంగ 28, బెండ 53, పచ్చిమిర్చి 40, కాలీ ఫ్లవర్ 23, క్యాబేజీ 26, క్యారెట్ 50, దొండ 35, ఆలు 37, ఉల్లి 34, సొర 17, పొట్ల 23, బీన్స్ 125, గోరుచిక్కుడు 40, చిక్కుడు 65, దోస 35, బీర 45, కాకర 35, చామగడ్డ 40, కీర 35, క్యాప్సికం 65, బీట్‌రూట్ 32, కందగడ్డ 60, మునగ 75, ముల్లంగి 6(ఒకటి).

రామకృష్ణాపురంలో..

డిఫెన్స్‌కాలనీ: టమాటా కిలో రూ.43, వంగ 35, బెండ 55, పచ్చిమిర్చి 40, కాకర 35, బీర 45, క్యాబేజీ 21, బీన్స్ 125, క్యారెట్ 53, దొండ 35, చిక్కుడు 65, క్యాప్సికం 70, ఆలు 37, కీర 23, దోస 35, చామగడ్డ 40, అరటి 9, బీట్‌రూట్ 32, సొర 17, గోకర 40, చిలకడదుంప 38, మామిడి 105, మునగ 76.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



ఆర్కేనగర్‌లో చెత్తకుప్పలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్ తదితరులు

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: తూర్పుఆనంద్‌బాగ్ డివిజన్ మౌలాలి కస్తూరిబానగర్, మల్కాజిగిరి డివిజన్ ఆర్కేనగర్‌ల పరిధిలో గురువారం పరిశుభ్రతా వారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వై.ప్రేమ్‌కుమార్, వి.శ్రవణ్‌కుమార్‌లు పాల్గొని స్థానికులకు పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను వివరించారు. మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటనే అందరం ఆరోగ్యంగా ఉంటామన్నారు.

వృద్ధులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న శోభన్‌బాబు

గౌతంనగర్, న్యూస్‌టుడే: ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలని లయన్స్‌క్లబ్ హైదరాబాద్ మల్కాజిగిరి సెంట్రల్ మాజీ అధ్యక్షుడు శోభన్‌బాబు అన్నారు. మిర్జాలగూడలోని వృద్ధాశ్రమంలో ఉన్న మహిళలకు గురువారం ఆయన అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతి ఉత్సవాలు

గౌతంనగర్, న్యూస్‌టుడే: వాల్మీకి జయంతి సందర్భంగా మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

చిన్నరాయుని చెరువు సుందరీకరణకు కృషి



గుర్రపుడెక్క తొలగింపు పనుల వద్ద కార్పొరేటర్ విజయశాంతి

అల్వాల్, న్యూస్‌టుడే: చిన్నరాయుని చెరువు సుందరీకరణకు తన వంతు ప్రయత్నం చేస్తున్నట్లు కార్పొరేటర్ విజయశాంతి తెలిపారు. గురువారం చెరువులో గుర్రపు డెక్క ఆకు తొలగింపు పనులను పర్యవేక్షించారు. చెరువు అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే పలు పనులు చేపట్టినట్లు వివరించారు. కట్ట విస్తరణ పూర్తయిందన్నారు. మురుగు తరలింపు పనులు చివరి దశలో ఉన్నాయన్నారు. సుందరీకరణ చేపడితే చెరువు ఆహ్లాదకరంగా మారనుందని చెప్పారు. ఏఈ అభిషేక్, స్థానిక నేతలు మల్లేశ్, ప్రేమ్, యాదగిరి, కాలనీ వాసులు హరిబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యర్థాలు తిష్ఠ.. స్వచ్ఛ స్ఫూర్తికి అప్రతిష్ఠ

రోజుల తరబడి తరలించకపోవడంతో స్థానికులకు అవస్థలు

డిఫెన్స్‌కాలనీ, న్యూస్‌టుడే: పరిసరాల శుభ్రతపై అధికారులు, ప్రజా ప్రతినిధులు పలుమార్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.. కొందరు రోడ్ల పక్కన, పాదబాటలపై చెత్త పడేస్తున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది వాటిని సకాలంలో తొలగించకపోవడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. వర్షాలకు చెత్త కుళ్లి దుర్గంధం వెలువడటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నేరేడ్‌మెట్ డివిజన్ పరిధి యాప్రాల్, అమ్ముగూడా, కళ్యాణ్‌పురి, కిందిబస్తీ,



సప్తగిరి కాలనీలో రహదారి చెంత నిర్మాణ వ్యర్థాలు



ఎంప్లాయిస్ కాలనీలో రోడ్డు పక్కన వేసిన కొమ్మలు

ఎంప్లాయిస్ కాలనీ, రామకృష్ణాపురం, డిఫెన్స్‌కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్ల పక్కన చెత్తాచెదారం, చెట్టు కొమ్మలు, నిర్మాణ వ్యర్థాలు పేరుకుపోయాయి.

ఫిర్యాదు చేసినా స్పందన లేక..

పలుచోట్ల పేరుకుపోయిన చెత్త, చెదారం, భవన నిర్మాణ, చెట్టుకొమ్మల వ్యర్థాలను తొలగించాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండటం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో పలు ప్రాంతాల్లో మూడు నాలుగు రోజులకోమారు వ్యర్థాలను తరలిస్తున్న పరిస్థితి. దీంతో స్థానికులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఫాగింగ్ చేయకపోవడంతో..

అపరిశుభ్రత కారణంగా దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో రాత్రి వేళల్లో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని పలు కాలనీలకు చెందిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల నివారణకు నెలకు రెండు సార్లు కూడా ఫాగింగ్ చేస్తున్న పరిస్థితులు లేవని వాపోతున్నారు. డెంగీ జ్వరాలు విజృంభిస్తుండటంతో పలువురు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య నెలకొన్న ప్రాంతాల్లో వ్యర్థాలు తొలగించి తరచూ ఫాగింగ్ చేయాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

– పారిశుద్ధ్య అధికారి, నాగరాజు

పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. రోడ్డు పక్కన చెత్త వేసే వారిని గుర్తించి జరిమానాలు విధిస్తాం. కాలనీ సంఘాలు సైతం రహదారులు, డ్రైన్లలో చెత్త వేయకుండా ప్రజలను చైతన్యపరచి పారిశుద్ధ్య నివారణకు సహకరించాలి.

మేమున్నాం.. మీకు తోడుగా..

మల్కాజిగిరి:80085 73378, అల్వాల్: 93911 06395
వినాయక్‌నగర్: 98498 60095, మౌలాలి: 80089 02818
గౌతంనగర్: 93475 56399 డిఫెన్స్‌కాలనీ: 84990 06641

మల్కాజిగిరి, గౌతంనగర్, డిఫెన్స్‌కాలనీ, అల్వాల్, న్యూస్‌టుడే:

? తూర్పుఆనంద్‌బాగ్ డివిజన్ వేంకటేశ్వరనగర్‌లో నల్లాల్లో తాగునీరు సకాలంలో అందడం లేదు. – అనిల్‌కుమార్, కాలనీవాసి

✓ మీ ప్రాంతంలో సమస్యను పరిశీలించి తాగునీరు సకాలంలో సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం. – నవీన్‌కుమార్, మేనేజర్, చాణుక్యపురి రిజర్వాయర్



? గౌతంనగర్ డివిజన్ రాజాశ్రీనివాసనగర్‌లో నాలాల్లో నుంచి తొలగించిన చెత్తాచెదారాన్ని సకాలంలో తరలించకపోవడంతో దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– ప్రకాశరావు, రాజాశ్రీనివాసనగర్

✓ చెత్త నిల్వలను డంపింగ్ యార్డుకు తరలిస్తాం.

– సంజీవ, ఎస్ఎఫ్ఏ, మల్కాజిగిరి

? నేరేడ్‌మెట్ డివిజన్ పరిధి చిన్న కందిగూడా ప్రధాన మార్గం, జేజే నగర్ ప్రధాన మార్గంలో రోడ్డు పక్కన చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. అపరిశుభ్రతతో ఇబ్బందులు పడుతున్నాం. –రమేష్, అమృత, జేజేనగర్

✓ పరిశీలించి ఆయా ప్రాంతాల్లో చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలిస్తాం. –నాగరాజు, పారిశుద్ధ్య అధికారి

? మచ్చబొల్లారం మార్కెట్ మద్యం దుకాణం ముందు రోడ్డుపైనే వాహనాలు నిలుపుతున్నారు. సాయంత్రం సమయాల్లో రద్దీ ఏర్పడి వాహనదారులు స్థానికుల మధ్య గొడవలు జరుగుతున్నాయి.

– రఘురామరాజు, స్థానికుడు

✓ దుకాణం యజమానులను బాధ్యులు చేసి చర్యలు తీసుకుంటాం.

– అంబిక, ఎస్సై

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



మల్కాజిగిరి మందిరంలో..



జీకే కాలనీలో ప్రత్యేక హారతులు

గౌతంనగర్, డిఫెన్స్‌కాలనీ, న్యూస్‌టుడే: ఆశ్వయుజ మాసం శుద్ధ పౌర్ణమి సందర్భంగా మల్కాజిగిరి సాయిబాబా ఆలయంలో గురువారం బాబాకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయి సమాజ్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ ఈనెల 20న సాయంత్రం 7 గంటలకు సంకష్టహర చతుర్థి సందర్భంగా వినాయకుడికి అభిషేకం, హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

★ నేరేడ్‌మెట్ డివిజన్ పరిధి జీకే కాలనీలోని శివసాయి ఆలయంలో కొలువైన సాయిబాబాకు గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. నాలుగు విశేష హారతులు, ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన పల్లకీ సేవలో భక్తులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతాలు



ఆనంద్‌బాగ్‌లో..

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: ఆనంద్‌బాగ్ రైల్వేగేట్ సమీపంలోని శిర్డీ సాయిబాబా దేవాలయంలో గురువారం సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమంలో పలు కాలనీలనుంచి భక్తులు హాజరై వ్రతం చేసుకున్నారని ఆలయ అర్చకులు సత్యనారాయణ పండిట్ తెలిపారు.

సామాజిక సేవలో పద్మశాలీలు ముందుండాలి



సభ్యత్వ నమోదులో సేవా సంఘం సభ్యులు

అల్వాల్, న్యూస్‌టుడే: సామాజిక సేవల్లో పద్మశాలీలు ముందుండాలని అఖిల భారత ఐక్య పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడు బాబురావు సభ్యులకు విజ్ఞప్తి చేశారు. గురువారం కానాజిగూడలో సంఘం సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించారు. సేవా సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవలను అన్ని వర్గాలకు విస్తరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గోపాల్, రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్, గోపి, శ్రీరాములు, జయరాములు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించండి



ఏఈ మధురిమకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ గున్నాల సునీత

మౌలాలి: డివిజన్‌లోని వివిధ ప్రాంతాలకు సంబంధించి మంజూరైన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని కార్పొరేటర్ గున్నాల సునీత కోరారు. గురువారం ఏఈ మధురిమను కలిసి డివిజన్‌లోని పలు అభివృద్ధి కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాప్యం చేయకుండా పనులు ప్రారంభించాలని కోరారు. డివిజన్‌లోని రహదారుల పరిస్థితిని వివరిస్తూ ఓ వినతిపత్రం అందజేశారు.

ఇంకుడు గుంతకు మోక్షం



స్పందనకు వందనం

గౌతంనగర్, న్యూస్‌టుడే: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని చిన్మయ్‌మార్గ్‌లో ఇంకుడు గుంతలో పిచ్చి మొక్కలు మొలిచి ఆనవాళ్లు కోల్పోవడంతో ఈనెల 8న 'ఇక్కడ ఇంకుడు గుంత ఉండేదట' శీర్షికతో ఈనాడులో ప్రచురితమైన చిత్ర కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. ఇంకుడు గుంతను శుభ్రం చేశారు. అధికారులు స్పందించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

చెత్త తొలగింపు

డిఫెన్స్‌కాలనీ, న్యూస్‌టుడే: రామకృష్ణాపురం రైల్వే స్టేషన్ నుండి రైతుబజార్‌కు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన చెత్తాచెదారం పేరుకుపోయింది. 'మేమున్నాం.. మీకు తోడుగా'కు స్థానికులు తెలియజేశారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన అధికారులు చెత్తాచెదారాన్ని డంపింగ్ యార్డ్‌కు తరలించారు.

నీలిచిత్రాల వెబ్‌సైట్లు చూస్తున్నావంటూ వ్యాపారికి టోకరా
రూ.2.5లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

అల్వాల్, న్యూస్‌టుడే: నీలి చిత్రాల వెబ్‌సైట్లు చూస్తున్నావంటూ బెదిరించి సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తి నుంచి రూ.2.5లక్షలు కాజేశారు. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం.. అల్వాల్‌లోని సూర్యనగర్‌కు చెందిన ఓ వ్యాపారికి బుధవారం ముంబయి క్రైమ్ ఇన్వెస్టింగ్ పోలీసుల పేరుతో ఫోన్ వచ్చింది. వెబ్‌సైట్లో అసభ్యకర వీడియోలు చూస్తూ పలువురికి వాట్సాప్‌లో పంపిస్తున్నావంటూ తమకు ఫిర్యాదు ఉందన్నారు. దీనికి భయపడిన జైపాల్‌రెడ్డి అయోమయంలో ఉండగా.. సినీతార శిల్పాశెట్టి భర్త రాజ్‌ఠాకూర్ రూ.65లక్షలు బ్యాంకు అకౌంటులో జమచేశారని భయపెట్టారు. తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని కేసు నమోదుకాకుండా చేయాలంటే సుప్రీం కోర్టులో మేనేజ్ చేయాలంటూ రూ.3లక్షలు పంపాలని ఒత్తిడి చేశారు. దీంతో విడతలవారీగా రూ.2.5లక్షలు ఆన్‌లైన్లో పంపాడు. అయినా సైబర్ నేరగాళ్లు వేధించడం ఆపకపోవడంతో మోసపోయానని గ్రహించి గురువారం డయల్ 1930తో పాటు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మురుగు పొంగు.. అస్తవ్యస్తంగా రోడ్డు



గౌతంనగర్ డివిజన్ వెంకటాద్రినగర్‌లో మ్యాన్‌హోల్ పొంగుతుండటంతో మురుగు రోడ్డుపై పారుతోంది. దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని.. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.


–న్యూస్‌టుడే, గౌతంనగర్

గోతులమయం.. వెళ్లాలంటే భయం



గౌతంనగర్ డివిజన్ మిర్జాలగూడ కూడలి నుంచి జ్యోతినగర్ వెళ్లే మార్గం గుంతలమయమైంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గుంతల్లో నీరు చేరి ప్రమాదకరంగా మారాయి. సంబంధిత అధికారులు కనీస మరమ్మతులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గౌతంనగర్

అప్రమత్తంగా లేకుంటే.. ఆగమాగమే



అల్వాల్‌లోని శక్తినగర్ కాలనీ ప్రధాన రహదారి చెంతనున్న మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు ఎత్తుగా ఉండటంతో పాటు.. ఎవరో పైకప్పు తొలగించారు. ఇప్పటికే వీధి కుక్కలు కొన్ని అందులో పడ్డాయి. రాత్రి సమయాల్లో ప్రయాణించే వాహనదారులు, నడుస్తూ వెళ్లే వారు ప్రమాదం బారిన పడే పరిస్థితి ఉందని స్థానికులు తెలిపారు.

– న్యూస్‌టుడే, అల్వాల్

ట్రేడింగ్‌లో చిట్కాలు చెబుతామని మోసం

నారాయణగూడ, న్యూస్‌టుడే: స్టాక్ ట్రేడింగ్‌లో చిట్కాలు చెబుతామని నమ్మించి మోసం చేశారంటూ బాధితుడు హైదరాబాద్ సైబర్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ప్రైవేటు ఉద్యోగికి ట్రేడింగ్ చిట్కాలకు సంబంధించి వాట్సాప్ సందేశాలు వచ్చాయి. ట్రేడింగ్ కోసం ప్రత్యేక ఖాతా తెరిచాడు. అందులో తన బ్యాంకు ఖాతా, ఐఎఫ్ఎస్సీ నంబర్లు ఇతర వివరాలు పొందుపరిచాడు. సెప్టెంబరులో ఆ ఖాతాలో విడతలవారీగా రూ.8.65 లక్షలు డిపాజిట్ చేయడం మొదలుపెట్టాడు. ఆ తర్వాత విత్‌డ్రా చేయడానికి ప్రయత్నిస్తే సాధ్యపడలేదు. అనుమానం వచ్చి బాధితుడు టోటల్ సెక్యూరిటీస్ డాట్ కామ్, సైబర్ క్రైమ్ డాట్ జీఓవీ డాట్ ఇన్‌లో ఫిర్యాదు చేశాడు. సైబర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాంగణ నియామకాల్లో సత్తాచాటిన విద్యార్థులు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రాంగణ నియామకాల్లో సత్తాచాటారు. తాజాగా జరిగిన ఇన్ఫోసిస్ నియామకాల్లో ఆరుగురు రూ.9.5లక్షల చొప్పున ప్యాకేజీతో ఎంపికయ్యారు. మొత్తం బీటెక్ నుంచి 234, ఎంటెక్, ఎంసీఏ నుంచి 249మంది ఇన్ఫోసిస్‌కు దరఖాస్తు చేసుకోగా ఇందులో సీఎస్ఈ నుంచి పి.సనితారెడ్డి, కె.సాయిహేమంత్‌నారాయణ్, ఎస్.గ్రీష్మా, హెచ్.కేశరాజు, సీఎస్ఈ ఐడీపీ నుంచి బి.స్ఫూర్తి, ఎంసీఏ నుంచి కె.శ్రీఉమాదేవి ఉద్యోగాలు సాధించారు.

సంక్షిప్త సమాచారం

వైద్య విద్యార్థినికి ఆర్థిక సాయం

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ వెంకట్‌రెడ్డినగర్‌కు చెందిన రీతు ప్రసన్నకు ఎంబీబీఎస్ చదివేందుకు అయ్యే ఫీజును బీఎల్ఆర్ ట్రస్ట్ చెల్లిస్తుందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. గురువారం విద్యార్థిని ఇంటికి వెళ్లి రూ.29వేల చెక్కు అందజేశారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు సుప్రియ

నాచారం, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు మల్లాపూర్ మోడ్రన్ స్కూల్ విద్యార్థిని ఎం.సుప్రియ ఎంపికైనట్లు పాఠశాల ఛైర్మన్ ముత్యంరెడ్డి, కరస్పాండెంట్ సచీదేవి తెలిపారు. తమిళనాడులోని కోయంబత్తూరులో ఈనెల 18న జరగనున్న జాతీయస్థాయి ఖోఖో టోర్నమెంట్ పోటీల్లో జూనియర్ బాలికల విభాగంలో రాష్ట్రం నుంచి సుప్రియ ప్రాతినిధ్యం వహిస్తుందని ఆయన తెలిపారు.

ఫీజులు చెల్లించాలని ర్యాలీ

ఏఎస్‌రావునగర్: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల బోధన, ఉపకారవేతన ఫీజు బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం అఖిలభారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర, సత్యప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ. 24 లక్షలు

బాగ్‌లింగంపల్లి: చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. సహాయ కమిషనర్ రామాంజనేయులు, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ బి.సురేష్‌కుమార్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. జులై 1 నుంచి అక్టోబరు 17 వరకు కలిపి మొత్తం రూ.24,00,348 లక్షల ఆదాయం సమకూరినట్లు వెల్లడించారు.

రాజకీయాల్లోనూ రాణించాలి

ముషీరాబాద్: సేవా కార్యక్రమాల్లో కొనసాగుతున్న ఆర్యవైశ్యులు రాజకీయాల్లోనూ రాణించేలా కృషిచేయాలని టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్, అంతర్జాతీయ వైశ్య సమాఖ్య(ఐవీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్త కోరారు. బాపూజీనగర్‌లో. . ఐవీఎఫ్ సికింద్రాబాద్ జోన్ ఏవీఎస్ అడిక్‌మెట్, బౌద్ధనగర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

దరఖాస్తు గడువు పెంచాలి

ఉస్మానియా ఆసుపత్రి, న్యూస్‌టుడే: ఉస్మానియా నర్సింగ్ కళాశాలలో ప్రవేశానికి గడువు పెంచాలని పలువురు విద్యార్థినులు కోరుతున్నారు. ఇంటర్ బైపీసీ పూర్తి చేసిన వారు అర్హులు. దరఖాస్తుల సమర్పణకు ఈ నెల 19తో గడువు ముగియనుంది.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: తెలంగాణలో గ్రూప్ 1 పరీక్షల నిర్వహణ విషయంలో నిరుద్యోగులు, అభ్యర్థుల్లో ఉన్న సందేహాలను తొలగించడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

19న ప్రవాస నర్తకి వశిష్ఠ నృత్య ప్రదర్శన

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: ప్రవాసి యువ నృత్య కళాకారిణి వశిష్ఠ ఈనెల 19వ తేదీన సాయంత్రం 5 గంటలకు గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో భరతనాట్య ప్రదర్శన ఇవ్వనున్నట్లు నాట్యగురువు డా.జయశ్రీ రాజగోపాలన్ తెలిపారు.

పర్యాటక స్నేహపూర్వక రాష్ట్రంగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న ఎయిర్‌పోర్ట్ చీఫ్ ప్యాసింజర్స్ ఎక్స్‌పీరియన్స్ ఆఫీసర్ మిథుల్ శర్మ

శంషాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణను పర్యాటక స్నేహ పూర్వక రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో ఆటో, క్యాబ్, ట్యాక్సీ డ్రైవర్లు కీలక పాత్ర పోషిస్తారని శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ చీఫ్ ప్యాసింజర్స్ ఎక్స్‌పీరియన్స్ ఆఫీసర్ మిథుల్ శర్మ అన్నారు. గురువారం విమానాశ్రయంలో రాష్ట్ర పర్యాటక శాఖ, టీహెచ్ఎంఐసీఈలు సంయుక్తంగా నిర్వహించిన అతిథి దేవోభవ-2024 రెండో ఎడిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నిపుణుల సమక్షంలో 100 మంది క్యాబ్ డ్రైవర్లకు శిక్షణ ఇచ్చారు. ప్రయాణంలో అస్వస్థతకు గురైన ప్రయాణికులకు అత్యవసరంగా చేయాల్సిన సీపీఆర్ విధానంపై విమానాశ్రయ ఆసుపత్రి వైద్యులు అవగాహన కల్పించారు. హైదరాబాద్‌లోని నాంపల్లి, కాచిగూడ, ఎంజీబీఎస్, సికింద్రాబాద్, జూబ్లీ బస్టాండ్ తదితర రద్దీ ప్రాంతాల్లో పర్యాటకులకు సేవలందిస్తున్న వెయ్యి మంది క్యాబ్ డ్రైవర్లకు దశలవారీగా శిక్షణ ఇస్తామన్నారు. భద్రత చర్యలను వివరించే క్యూఆర్ కోడ్లతో తయారు చేసిన స్టిక్కర్లను క్యాబ్ డ్రైవర్లకు పంపిణీ చేస్తున్నామని, ఇవి ప్రయాణికులకు అవసరమైన భద్రతా సమాచారం అందిస్తాయన్నారు.



సీపీఆర్ విధానంపై క్యాబ్ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు విడుదల చేయండి



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల ర్యాలీ

నారాయణగూడ, న్యూస్‌టుడే: ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాల ఆధ్వర్యంలో విద్యార్థులతో గురువారం ర్యాలీ నిర్వహించారు. నారాయణగూడ ఫ్లైఓవర్ కూడలి నుంచి వైఎంసీఏ కూడలి వరకు జరిగిన ఈ ర్యాలీలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, సహాయ కార్యదర్శి దామర కిరణ్, జిల్లా కార్యదర్శి అశోక్‌రెడ్డి మాట్లాడారు. ఏడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రూ.8,300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాల బకాయిలు ఉన్నాయన్నారు. బకాయిలు రాక, నిర్వహణ భారమవుతోందని ప్రైవేటు యాజమాన్యాలు కళాశాలలకు తాళాలు వేసిన పరిస్థితి నెలకొందన్నారు. బకాయిలు విడుదల చేయకపోతే సచివాలయం, ప్రజాభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా, ఉపాధ్యక్షుడు స్టాలిన్, నాగేందర్, ప్రశాంత్, చరణ్, శ్రీ, జిల్లా కమిటీ సభ్యులు సహన, భగత్ శివ తదితరులున్నారు.

దుగ్గిరాల సోమేశ్వరరావు ఆత్మీయ పురస్కారాల ప్రదానం

నారాయణగూడ, న్యూస్‌టుడే: పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీలో గురువారం రాత్రి రసరంజని-హైదరాబాద్, దుగ్గిరాల ఫ్యామిలీ సంయుక్తాధ్వర్యంలో దర్శకుడు దుగ్గిరాల సోమేశ్వరరావు జయంతి వేడుకల సందర్భంగా ఆత్మీయ పురస్కారాల ప్రదానం జరిగింది. అక్కినేని నాటక కళా పరిషత్తు అధ్యక్షుడు సారిపల్లి కొండలరావు అధ్యక్షతన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశ్రాంత ఐఏఎస్ అధికారి డా.కె.వి.రమణాచారి మాట్లాడుతూ.. మంచి మనసున్న మహారాజు దుగ్గిరాల సోమేశ్వరరావు అని కొనియాడారు. ఎంతో మందిని నటీనటులుగా తీర్చిదిద్దారన్నారు. విశ్రాంత డీజీపీ హెచ్.జె.దొర మాట్లాడుతూ.. నాటక రంగానికి సేవ చేసిన మహానుభావుడు దుగ్గిరాల అని కొనియాడారు. దర్శకుడు బీఎం రెడ్డి మాట్లాడారు. సీనియర్ నటులు సీహెచ్ నారాయణస్వామి, సుసర్ల కామేశ్వరశర్మ, నటుడు కేతినీడి నటరాజ్, సత్కళాభారతి అధ్యక్షుడు సత్యనారాయణ, తెలుగువర్సిటీ రంగస్థల కళల శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ డా.బీహెచ్ పద్మప్రియలకు దుగ్గిరాల సోమేశ్వరరావు ఆత్మీయ పురస్కారాలు ప్రదానం చేశారు.



అవార్డు గ్రహీతలతో రమణాచారి, హెచ్.జె.దొర, సారిపల్లి కొండలరావు తదితరులు

నగరంలో విద్యుత్తు చీఫ్ ఇంజినీర్ల బదిలీలు

ఈనాడు, హైదరాబాద్: నగరంలో విద్యుత్తు చీఫ్ ఇంజినీర్లు సమూలంగా బదిలీ అయ్యారు. ఆపరేషన్ విభాగంలో ఉన్నవారిని కార్యాలయ పోస్టులకు, ఇన్నాళ్లు కార్యాలయాలకే పరిమితమైన వారిని ఆపరేషన్ విభాగాలకు బదిలీ చేస్తూ టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ బుధవారం అర్ధరాత్రి బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో పలువురు గురువారం ఉదయమే కొత్తపోస్టుల్లో బాధ్యతలు చేపట్టారు. రంగారెడ్డి జోన్ ఆపరేషన్ సీఈ ఆనంద్ కార్పొరేట్ కార్యాలయంలోని పీ అండ్ ఎంఎం విభాగానికి బదిలీ అయ్యారు. మాస్టర్‌ప్లాన్ సీఈ పాండ్య నాయక్ రంగారెడ్డి జోన్ సీఈగా బదిలీ అయ్యారు. మేడ్చల్ జోన్ సీఈగా కామేష్ బాధ్యతలు చేపట్టారు. మేడ్చల్ జోన్ సీఈగా ఉన్న సాయిబాబను కార్పొరేట్ కార్యాలయం ఆర్ఏసీకి బదిలీ చేశారు. కమర్షియల్ నుంచి మాస్టర్‌ప్లాన్ సీఈగా నర్సింహ స్వామి బదిలీ అయ్యారు. రూరల్ జోన్ సీఈగా బాలస్వామి, కమర్షియల్ సీఈగా భిక్షపతి, మెట్రోజోన్ సీఈగా చక్రపాణికి బాధ్యతలు అప్పగించారు.

ముషీరాబాద్

• ముషీరాబాద్ • అంబర్‌పేట

విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం


బీఆర్ఎస్వీ నేతలు గుమ్మడి క్రాంతి, పాండురంగ, మహమ్మద్ గౌస్ తదితరులు

కాచిగూడ, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటం చేపడతామని బీఆర్ఎస్వీ అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం అధ్యక్షుడు గుమ్మడి క్రాంతి తెలిపారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశానికి గురువారం చప్పల్‌బజార్ నుంచి నేతలు పాండురంగ, మహమ్మద్ గౌస్ తదితరులు ర్యాలీగా వెళ్లిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అంబర్‌పేట రేషన్ డీలర్ల కార్యవర్గ ప్రమాణ స్వీకారం



రాంనగర్: పౌరసరఫరాల శాఖ సర్కిల్-6 అంబర్‌పేట డివిజన్ రేషన్‌డీలర్ల వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం గురువారం రాంనగర్ డివిజన్ ఎస్సార్టీ సామాజిక భవనంలో ప్రమాణ స్వీకారం చేసింది. కమిటీ నూతన అధ్యక్షుడిగా బ్యారం కుమార్, ప్రధాన కార్యదర్శిగా వాడకట్టు రాజు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మహేందర్‌రాజు, సలహాదారులుగా గౌరయ్య, అప్పారావు సహా ఇతర సభ్యులూ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణమూర్తి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వైకుంఠం తదితరులు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సర్కిల్-6 గోదాంలో వే బ్రిడ్జి ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ. 24 లక్షలు

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఆలయ సహాయ కమిషనర్ రామాంజనేయులు, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ బి.సురేష్‌కుమార్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. జులై 1 నుంచి అక్టోబరు 17 వరకు కలిపి మొత్తం రూ.24,00,348 లక్షల ఆదాయం సమకూరినట్లు అనంతరం వారు వెల్లడించారు. 132 అమెరికా డాలర్లు, 5 ఆస్ట్రేలియా డాలర్లు కూడా వచ్చాయని, సంబంధిత మొత్తాన్ని బ్యాంకులో జమ చేయనున్నట్లు ఈవో తెలిపారు.

కూరగాయల ధరలు

తిలక్‌నగర్, న్యూస్‌టుడే: (గురువారం నాటివి... కిలోకు రూపాయల్లో) టమాట 50, ఆలుగడ్డ 40, వంకాయ 50, బెండ 60, దొండ 45, దోసకాయ 40, కాకర 60, బీర 60, సొర 35, క్యాబేజీ 35, క్యాప్సికం 50, బీన్స్ 80, చిక్కుడు 70, క్యారెట్ 50, బీట్‌రూట్ 45, ఉల్లిగడ్డ 50, పచ్చిమిర్చి 40, వెల్లుల్లి 360, అల్లం 80.

ఓటు నమోదుకు మరో అవకాశం

- ఈ నెల 29న ముసాయిదా జాబితా
- ఫిర్యాదులు, తప్పుల సవరణకు నెల రోజుల గడువు

అంబర్‌పేట, న్యూస్‌టుడే: అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో కొత్త ఓటర్ల నమోదుకు మరో అవకాశం లభించింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే యువతీయువకులు ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేయించుకోవచ్చు. ప్రస్తుతం నియోజకవర్గంలోనే నివసిస్తున్నా.. చిరునామా మారిన వారితోపాటు పేర్లు, చిరునామాలలో తప్పులు ఉన్నా కూడా సరిచేయించుకోవచ్చు. మరోవైపు, శాశ్వతంగా మరోచోటికి వెళ్లిపోయిన ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, చనిపోయిన వ్యక్తుల పేర్లను ఓటర్ల జాబితాల నుంచి సంబంధిత అధికారులు తొలగిస్తారు.



అఖిలపక్ష సమావేశంలో ఉప కమిషనర్ మారుతీదివాకర్

పోలింగ్ కేంద్రం మార్పుపై చర్చ.. ఓటర్ల జాబితాలపై గురువారం జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్ కార్యాలయంలో ఉప కమిషనర్ మారుతీదివాకర్ అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మహమ్మద్ అబ్దుల్ ఫరీద్ (కాంగ్రెస్), శ్రీహరి(భారాస), అజయ్‌కుమార్ (భాజపా), మహమ్మద్ మోసిన్(ఎంఐఎం) తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల పెంపు, ఓటర్ల జాబితాల సవరణపై ప్రధానంగా సమావేశంలో చర్చ జరిగింది. బాగ్‌అంబర్‌పేట డివిజన్ భరత్‌నగర్ సామాజిక భవనంలో ఉన్న 3 పోలింగ్ కేంద్రాలలో ఒక దాన్ని నూతనంగా నిర్మిస్తున్న సామాజిక భవనంలోకి మార్చాలనే అంశం చర్చకు వచ్చింది. అనంతరం సంబంధిత ప్రతిపాదనను ఉన్నతాధికారులకు పంపాలని నిర్ణయించారు.

నవంబరు 9, 10 తేదీల్లో... నవంబరు 9(రెండో శనివారం), 10(ఆదివారం) తేదీల్లో నియోజకవర్గంలోని కాచిగూడ, నల్లకుంట, గోల్నాక, అంబర్‌పేట, బాగ్‌అంబర్‌పేట డివిజన్లలోని వివిధ కాలనీలు, బస్తీల పరిధిలోని 236 పోలింగ్ కేంద్రాలలో బూత్ స్థాయి అధికారులు(బీఎల్‌వోలు) ప్రజలకు అందుబాటులో ఉంటారు. కొత్త ఓటర్ల నమోదు సహా తప్పుల సవరణ, చనిపోయిన, చిరునామా మారిన వారి పేర్లనూ జాబితాల నుంచి తొలగించేలా చర్యలు తీసుకుంటారు. తొలుత ఈ నెల 29న ఓటర్ల ముసాయిదా జాబితా వెలువడనుంది. అప్పటి నుంచి నవంబరు 28 వరకు నెల రోజుల పాటు ఫిర్యాదుల స్వీకరణ, తప్పుల సవరణకు ఎన్నికల సంఘం అవకాశం కల్పిస్తుంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

ముషీరాబాద్	8008573400
రాంనగర్	8008573395
అంబర్‌పేట	8008573390
నల్లకుంట	8008573389

ముషీరాబాద్, రాంనగర్, నల్లకుంట, బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే:

? భోలక్‌పూర్ డివిజన్ ఇంద్రనగర్‌లో జీహెచ్ఎంసీ వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదు. రాత్రిళ్లు చీకటి కారణంగా స్థానికులు బయటికి వెళ్లేందుకూ అవస్థలు పడుతున్నారు. –బాలనరసింహ, స్థానికుడు

✓ క్షేత్రస్థాయిలో పరిశీలించాక మరమ్మతులు చేయిస్తాం. –అనూష, జీహెచ్ఎంసీ వీధిదీపాల నిర్వహణ ఏఈ

? రాంనగర్ డివిజన్‌లోని చేపల మార్కెట్ వద్ద రోడ్డుపై అక్రమంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. –శ్రీనివాస్, ముషీరాబాద్

✓ అక్రమంగా వాహనాలను నిలిపేవారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం. –వీరేశం, ట్రాఫిక్ సీఐ చిక్కడపల్లి

? న్యూనల్లకుంట బీరప్ప గుడి లేన్‌లోని రోడ్డుపై పలుచోట్ల ఏర్పడిన గుంతలతో రాకపోకల వేళ తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. –శ్రీనివాస్, న్యూనల్లకుంట

✓ అక్కడి రోడ్డును పరిశీలించి మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాను. – నరేందర్, వర్క్ ఇన్‌స్పెక్టర్, జీహెచ్ఎంసీ

? బాగ్‌లింగంపల్లి పరిధి పద్మకాలనీ సామాజిక భవనం సమీపంలో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు.– రామకృష్ణ, పద్మకాలనీ

✓ క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి వెలగని దీపాలను పునరుద్ధరిస్తాం. – అనూష, వీధి దీపాల నిర్వహణ విభాగం ఏఈ, జీహెచ్ఎంసీ

వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

బాగ్‌లింగంపల్లి: వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను గురువారం సూర్యనగర్‌లో నిర్వహించారు. తొలుత చిత్రపటానికి వాల్మీకి మేదర్ సంఘం నేతలు అర్జున్, సుభాష్, సురేందర్, అనిల్, నర్సి, శివ, పవన్, లఖన్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల్లో తమకు ప్రాధాన్యం కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు.


చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అర్జున్, రాజేందర్, సురేందర్, సుభాష్, అనిల్

★ అంబేడ్కర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి విద్యాసంస్థల డైరెక్టర్ విప్లవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాల్మీకి మహర్షి సంస్కృతంలో రాసిన రామాయణం గురించి గుర్తు చేశారు.


చిత్రపటం వద్ద సుదర్శన్, పండరీనాథ్

శివసేన పార్టీ ఆధ్వర్యంలో..

గోల్నాక: వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి శివసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్, అధికార ప్రతినిధి గణేష్, పండరీనాథ్‌లు హాజరై చిత్రపటానికి పూలమాల వేశారు. నేతలు గోపాల్, రాజేష్, ప్రదీప్ పాల్గొన్నారు.

నాలా చుట్టూ ప్రహరీ నిర్మించాలి: ఎమ్మెల్యే

అంబర్‌పేట, న్యూస్‌టుడే: మోయిన్ చెరువు వరదనీటి కాలువకు ఇరువైపులా రక్షణ ప్రహరీని వెంటనే నిర్మించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదేశించారు. కాలువలో పూడికతీత పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం పటేల్‌నగర్ చౌరస్తాలోని నాలాను అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్ ఉప కమిషనర్ మారుతీదివాకర్, సీపీఎల్ కమాండెంట్ వీరా, అదనపు కమాండెంట్ వెంకటప్ప, ఏసీపీ మునీందర్ తదితరులతో కలిసి పరిశీలించారు. నాలా సమీపంలోని రోడ్డు చెంత అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించి రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు చేపట్టాలని కోరారు. రహదారిపై పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించాలని సూచించారు. మున్సిపల్ డీఈలు ప్రశాంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, నేతలు మహేశ్ ముదిరాజ్, మోసిన్, హైమద్, సంతోష్‌చారి తదితరులు పాల్గొన్నారు.


నాలాను పరిశీలిస్తున్న కాలేరు వెంకటేష్, విజయ్‌కుమార్‌గౌడ్

20న హరిణి వనస్థలిలో పద్మశాలి దసరా మేళా

నారాయణగూడ: పద్మశాలి సంఘం (ఎల్బీనగర్ సర్కిల్) ఆధ్వర్యంలో ఈనెల 20న పద్మశాలి దసరా మేళా నిర్వహించనున్నట్లు అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ మహిళా అధ్యక్షురాలు వనం దుశ్యంతల తెలిపారు. జింకల పార్కులోని అనన్య ఎకో పార్కు ఆవరణలో జరిగే ఈ మేళాకు పద్మశాలి మహిళలు తరలిరావాలని కోరారు. గురువారం నారాయణగూడలోని పద్మశాలి భవనంలో మేళా వివరాలను వెల్లడించారు. తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గుంటక రూప, గ్రేటర్ మహిళా అధ్యక్షురాలు పొరండ్ల శారద, ఎల్బీనగర్ పద్మశాలి సంఘం మహిళా అధ్యక్షురాలు రావిరాల సంధ్యారాణితో కరపత్రాన్ని ఆవిష్కరించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలకు డిమాండ్

నారాయణగూడ: ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ, ప్రైవేటు డిగ్రీ కళాశాల యాజమాన్యాల ఆధ్వర్యంలో విద్యార్థులతో గురువారం ర్యాలీ నిర్వహించారు. నారాయణగూడ ఫ్లైఓవర్ నుంచి బషీర్‌బాగ్ ఎస్‌బీఐ వరకు జరిగిన ఈ ర్యాలీలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, సహాయ కార్యదర్శి దామర కిరణ్, జిల్లా కార్యదర్శి అశోక్‌రెడ్డి మాట్లాడారు. ఏడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రూ.8,300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాల బకాయిలు ఉన్నాయని చెప్పారు.

వీధి దీపాలకు మరమ్మతులు


ఈనాడు కథనాలకు స్పందన

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలో వెలగని వీధిదీపాలకు గురువారం జీహెచ్ఎంసీ వీధిదీపాల నిర్వహణ సిబ్బంది మరమ్మతులు పూర్తిచేశారు. కొన్నిరోజులుగా వెలగని స్ట్రీట్‌లైట్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న వైనంపై 'వెలగని దీపాలు.. అంధకారంలో వీధులు' శీర్షికతో గురువారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి సంబంధిత శాఖ అధికారులు స్పందించారు. గురువారం జీహెచ్ఎంసీ సర్కిల్-15 వీధిదీపాల నిర్వాహణ ఏఈ అనూష పర్యవేక్షణలో.. సూపర్‌వైజర్ తిరుమల్‌రెడ్డి, సిబ్బంది కలిసి భారీ నిచ్చెన సహాయంతో రాంనగర్ చౌరస్తా- వీఎస్టీ మార్గంలో వెలగని వీధి లైట్లకు మరమ్మతులు చేపట్టారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత

రాంనగర్: ముషీరాబాద్ ప్రధాన మార్గంలోని ఆర్టీసీ క్రాస్‌రోడ్ వద్ద రహదారిపై ఏర్పడిన గుంతలను ఎట్టకేలకు పూడ్చివేశారు. గుంతల కారణంగా వాహనదారులు పడుతున్న ఇబ్బందులపై 'అడుగడుగునా గుంతలు.. ఆదమరిస్తే ప్రమాదాలు' శీర్షికతో గురువారం 'ఈనాడు'లో చిత్రకథనం ప్రచురితమైన విషయం విదితమే. సంబంధిత అధికారులు స్పందించి.. ఉదయమే అక్కడికి సిబ్బందిని పంపించి గుంతలను మరమ్మతులు చేయించారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోండి


విజయ్‌కు చెక్కు అందజేస్తున్న సయ్యద్ యూసుఫ్. చిత్రంలో వెంకటేశ్వర్లు

నల్లకుంట, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న బీమా పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు(టీజీబీ) హైదరాబాద్ రీజినల్ మేనేజరు సయ్యద్ యూసుఫ్ కోరారు. ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకంలో చేరిన గండికోట జ్యోతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ క్రమంలో మంజూరైన రూ.2 లక్షల చెక్కును గురువారం టీజీబీ నల్లకుంట శాఖలో జరిగిన కార్యక్రమంలో.. జ్యోతి భర్త విజయ్‌కు ఆయన అందజేశారు. బ్యాంకుల ద్వారా అందించే బీమా పథకాల్లో అర్హులంతా చేరాలని ఈ సందర్భంగా కోరారు. టీజీబీ నల్లకుంట శాఖ మేనేజరు వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ పోరాట యోధుడు కుమురం భీం

రాంనగర్, న్యూస్‌టుడే: ఆదివాసీ వీరుడు కుమురంభీం కొనసాగించిన పోరాట స్ఫూర్తిని అలవర్చుకొని వారి ఆశయ సాధనకు ముందుకెళ్లాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆయన 84వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం హుస్సేన్‌సాగర్ ట్యాంక్‌బండ్‌పై ఉన్న విగ్రహం వద్ద తెలంగాణ గిరిజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ సర్వేశ్వర్‌రెడ్డి, సినీ నిర్మాత, దర్శకుడు అల్లాణి శ్రీధర్, గిరిజన ఐక్య వేదిక గౌరవ అధ్యక్షుడు హెచ్‌కే నాగు, కార్యనిర్వాహక అధ్యక్షుడు వివేక్ నాయక్‌లు హాజరై.. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కుమురంభీం భారత రత్న అవార్డు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'దళితబంధు' తరహాలోనే ఆదివాసీ బంధు పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని కాంగ్రెస్ సర్కార్‌కు విజ్ఞప్తి చేశారు. ఆదివాసీ గిరిజనుల న్యాయమైన హక్కులను అమలుచేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా.. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం తాత్సారం చేస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో ఆర్.కోటాజీ, గిరిజన ఐక్య వేదిక సభ్యులు గోవర్ధన్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


విగ్రహం వద్ద సర్వేశ్వర్‌రెడ్డి, కోటాజీ, వివేక్, గోవర్ధన్, శ్రీధర్ తదితరులు

ఆర్యవైశ్యులు రాజకీయాల్లోనూ రాణించాలి


అన్నదాన కార్యక్రమంలో ఉప్పల శ్రీనివాస్‌గుప్త

ముషీరాబాద్, న్యూస్‌టుడే: సేవా కార్యక్రమాల్లో కొనసాగుతున్న ఆర్యవైశ్యులు రాజకీయాల్లోనూ రాణించేలా కృషిచేయాలని టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్, అంతర్జాతీయ వైశ్య సమాఖ్య(ఐవీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్త కోరారు. గురువారం ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్‌లో.. ఐవీఎఫ్ సికింద్రాబాద్ జోన్ ఏవీఎస్ ఆడిక్‌మెట్, బౌద్ధనగర్ శాఖ ఆధ్వర్యంలో పౌర్ణమిని పురస్కరించుకొని నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఐవీఎఫ్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుమిషన్లు, విద్యార్థులకు రాత పుస్తకాల పంపిణీ తదితర కార్యక్రమాలను నిరంతరం చేపడుతున్నట్లు వివరించారు. ఐవీఎఫ్ సికింద్రాబాద్ జోన్ అధ్యక్షుడు బెలిదె రవికుమార్‌గుప్త, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌గుప్త, కోశాధికారి శ్రీనివాస్‌గుప్త, ప్రతినిధులు ప్రసాద్‌గుప్త, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



నిరసనకారుల అరెస్టు



జీవో నం.29ని రద్దుచేయడంతోపాటు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను వాయిదా వేయాలని కోరుతూ అభ్యర్థులు గురువారం గాంధీనగర్‌లోని జీహెచ్ఎంసీ పార్కులో ధర్నాకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని నిరసనకారులను అరెస్టు చేశారు. అనంతరం వారందరినీ నగరంలోని వివిధ ఠాణాలకు తరలించారు. -న్యూస్‌టుడే, గాంధీనగర్, ముషీరాబాద్

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్ గుంత



బాగ్‌అంబర్‌పేట డివిజన్ పరిధి సెంట్రల్ ఎక్సైజ్(సీఈ) కాలనీలోని మీ-సేవా కేంద్రం వద్ద రోడ్డు మధ్యలో ఉన్న మ్యాన్‌హోల్ మూత కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండటంతో.. వాహనదారులు, పాదచారులు ప్రమాదాలబారినపడకుండా హెచ్చరించేలా స్థానికులు ఇలా వెదురుకర్రలు, అట్టపెట్టెలతో తాత్కాలిక రక్షణ ఏర్పాట్లు చేపట్టారు. జలమండలి అధికారులకు ఫిర్యాదుచేసినా స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు తక్షణం స్పందించాలని వారంతా కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, విద్యానగర్

ప్రజాస్వామ్యబద్ధంగా సంస్థాగత ఎన్నికలు: భాజపా


కె.లక్ష్మణ్‌ను సత్కరిస్తున్న పెరిక సురేష్

కాచిగూడ: దేశంలోని ఏ రాజకీయ పార్టీలోనూ లేనివిధంగా భాజపా సంస్థాగత ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహిస్తారని భాజపా ఓబీసీ మోర్చా జాతీయ సామాజిక మాధ్యమాల ఇన్‌ఛార్జి పెరిక సురేష్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. భాజపా సంస్థాగత ఎన్నికల జాతీయ రిటర్నింగ్ అధికారిగా నియమితులైన ఎంపీ కె.లక్ష్మణ్‌ను సన్మానించినట్లు పేర్కొన్నారు. పార్టీ అంతర్గత ఎన్నికలను లక్ష్మణ్ సజావుగా నిర్వహిస్తారని చెప్పారు. భాజపా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడిగా ఆయన అందిస్తున్న సేవలనూ కొనియాడారు.

ఉద్యమకారులను గుర్తించాలని వినతి



కేటీఆర్‌తో శ్రీనివాసరెడ్డి తదితరులు

రాంనగర్: తెలంగాణ ఉద్యమకారులకు భారాసలో గుర్తింపు కల్పించాలని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి కోరారు. గురువారం ఆయన్ను కలిసిన సందర్భంగా ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో చాలామంది యువత తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాడారని గుర్తు చేశారు. దీనిపై కేటీఆర్ స్పందిస్తూ.. కష్టపడి పనిచేసే వారికి తప్పక గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చినట్లు శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు.

'హెబ్రోను సొసైటీ ప్రతినిధులకు న్యాయం చేయాలి'

గాంధీనగర్: హెబ్రోను సొసైటీ ప్రతినిధులపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేసిన ట్రస్టు సభ్యులపై చర్యలు తీసుకోవాలని సొసైటీ ప్రతినిధి వీరాచారి కోరారు. గురువారం చిక్కడపల్లిలో ఆయన మాట్లాడుతూ.. ఆగస్టులో ట్రస్టుకు చెందిన కొందరు అక్రమంగా చర్చిలోకి ప్రవేశించారన్నారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి గోడ దూకి లోపలికి వచ్చేటప్పుడు చేతికి గాయమైందన్నారు. దాన్ని అదునుగా తీసుకొని.. తనతో పాటు మరికొందరిపై హత్యాయత్నం.. తదితర కేసులు పెట్టారన్నారు. వాటిని హైకోర్టు పరిశీలించి బెయిలును మంజూరుచేసిందన్నారు. ఇప్పటికైనా పోలీసులు విచారణ చేపట్టి సొసైటీ సభ్యులకు న్యాయం చేయాలని కోరారు.

సిద్ధమవుతున్న పైవంతెన.. తీరనున్న ట్రాఫిక్ ఇక్కట్లు


గోల్నాక నుంచి అంబర్‌పేట ముత్యాలమ్మ ఆలయం వరకు నిర్మిస్తున్న పైవంతెన పనులు త్వరలో పూర్తి కానున్నాయి. ఈ ఫ్లైవోవర్ అందుబాటులోకి వస్తే కోఠి నుంచి ఉప్పల్ వైపు వెళ్లే వాహనదారులకు ఉపశమనంగా ఉంటుంది. అంబర్‌పేట, గోల్నాక ఛే నంబరు ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గుతాయి.

కారు బోల్తా.. వ్యాపారి దుర్మరణం

కొండపాక గ్రామీణం (కుకునూరుపల్లి), న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా రాజీవ్ రహదారిపై కారు అదుపుతప్పి బోల్తాపడటంతో ఓ వ్యాపారి గురువారం మృతి చెందాడు. ఈ ఘటన కుకునూరుపల్లి మండల కేంద్రంలో జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. హైదరాబాద్ కాచిగూడలో కార్వ రాజేశ్(42) వ్యాపారం చేస్తున్నాడు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో బంధువుల ఇంటికి వెళ్లి కారులో గురువారం తెల్లారుజామున హైదరాబాద్ తిరుగు ప్రయాణమయ్యాడు. ప్రమాదంలో రోడ్డు పక్కన ఇనుప కడ్డీలకు తాకి అనంతరం మరో కారును ఢీకొని బోల్తాపడింది రాజేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి బంధువు కాల్వ బేణిగోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెనుకనుంచి వాహనం ఢీకొని.. వివాహిత దుర్మరణం

వర్గల్, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో వివాహిత మృతి చెందింది. ఆమె కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారం సమీపంలో రాజీవ్ రహదారిపై గురువారం జరిగింది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాలలు.. రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామానికి చెందిన దేవేందర్ కుటుంబ సభ్యులతో హైదరాబాద్ దోమలగూడలో ఉంటూ పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నాడు. పండగకు ఇంటికి వెళ్లిన తల్లి గోపన్నగారి వనిత(46)ను హోండా యాక్టివాపై కూర్చోపెట్టుకొని హైదరాబాద్ వెళుతున్నారు. ప్రమాదంలో దేవేందర్ ఎగిరి రోడ్డు పక్కకు పడిపోయారు. తల్లి వనిత రోడ్డుపై పడటంతో ఢీకొట్టిన వాహనం ఆమె తలపై నుంచి వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు రాగానే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ చెప్పారు. వనితకు భర్త, ఇద్దరు కుమారులు దేవేందర్, చాణక్య ఉన్నారు.

ద్విచక్ర వాహనం దగ్ధం



రాంనగర్: ద్విచక్ర వాహనం నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయిన సంఘటన దోమలగూడ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి వివరాల ప్రకారం.. విద్యానగర్‌కు చెందిన పీవీ మహేశ్(36) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. తాను పనిచేస్తున్న కార్యాలయానికి గురువారం ఉదయం 9 గంటల సమయంలో విద్యానగర్‌లోని నివాసం నుంచి పల్సర్ బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలోని ఇందిరాపార్కు వద్ద స్టీల్ బ్రిడ్జ్‌పై నుంచి దిగిన తర్వాత ట్రాఫిక్ జాం ఉండటంతో బైక్‌ను కొద్దిసేపు నిలిపాడు. ఈ క్రమంలో ప్లగ్ నుంచి మంటలు రావడంతో అప్రమత్తమై ద్విచక్రవాహనాన్ని వదిలేసి పక్కకు వెళ్లాడు. అనంతరం నిమిషాల వ్యవధిలోనే మంటలు చెలరేగి బైక్ పూర్తిగా కాలిపోయింది. స్థానికులు, పోలీసులు అక్కడికి చేరుకొని.. నీళ్లు పోసి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు వెల్లడించారు.

ఇంటి ముందు నిలిపి ఉంచిన బైక్‌ల దహనం

అంబర్‌పేట, న్యూస్‌టుడే: ఇంటి ముందు నిలిపి ఉంచిన రెండు ద్విచక్ర వాహనాలను గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేసిన ఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై మౌనిక, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రేమ్‌నగర్‌లో అద్దెకు ఉంటున్న బాలరాజు, అరుణ్‌కుమార్‌లు తమ ఇంటి ఆవరణలో నిలిపిన రెండు ద్విచక్ర వాహనాలకు గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. అనంతరం బాధితులు ఫిర్యాదు చేయడంతో.. పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలులో మహిళ మృతదేహం స్వాధీనం

కాచిగూడ: ఎంఎంటీఎస్ రైలులో మహిళ మృతదేహాన్ని కాచిగూడ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప, హెడ్‌కానిస్టేబుల్ చిన్నానాయక్ వివరాల ప్రకారం... బుధవారం రాత్రి లింగంపల్లి నుంచి ఫలక్‌నుమా వచ్చిన ఎంఎంటీఎస్‌లో 35-40 ఏళ్ల మధ్య వయసు కలిగిన గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం దాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మహిళ నోటి నుంచి రక్తం వస్తుండటంతో.. అనారోగ్యంతో మృతి చెంది ఉంటుందని భావిస్తున్నారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కాచిగూడ, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన సంఘటన కాచిగూడ ఠాణా పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్, అడ్మిన్ ఎస్సై సుభాష్‌ల వివరాల ప్రకారం.. మలక్‌పేటకు చెందిన మల్లయ్య(57) గురువారం ఉదయం ద్విచక్రవాహనంపై చాదర్‌ఘాట్‌లోని సాయిబాబా ఆలయానికి వచ్చాడు. అనంతరం మోజాంజాహీ మార్కెట్‌లో పూలు కొనుగోలు చేసి తిరిగి వెళ్తుండగా చాదర్‌ఘాట్ చౌరస్తా వద్ద అతడిని కారు ఢీకొట్టడంతో కుడి కాలు విరిగింది. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

'ఓపీ'కగా నిరీక్షిస్తూ..





వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా నల్లకుంటలోని ఫీవర్ ఆసుపత్రికి స్థానికులతోపాటు నగరంలోని వివిధప్రాంతాల నుంచి రోగులు తరలివస్తున్నారు. ఇలా వచ్చేవారిలో పలువురు జ్వరాలు, ఒళ్లునొప్పులకు తోడు దగ్గు, జలుబుతో సతమతమవుతున్న వారే అధికంగా ఉంటున్నారు. గురువారం ఆసుపత్రికి చేరుకున్న అనంతరం ప్రాంగణంలోని ఓపీ విభాగంలో వైద్య సేవలు పొందేందుకు వీలుగా.. తొలుత ఓపీ నమోదు కౌంటర్ వద్ద ఇలా బారులుతీరి కనిపించారు.

ఉప్పల్

• ఉప్పల్ • మేడ్చల్

అపరిశుభ్రంగా బతుకమ్మ కొలనులు



బతుకమ్మ పండగ సమయంలో స్థానికంగా వేసేందుకు తాత్కాలిక కొలనులను ఏర్పాటు చేశారు. కాప్రా సర్కిల్ పరిధిలోని చక్రీపురం, కుషాయిగూడ, జమ్మిగడ్డ, పరిమళానగర్, హౌసింగ్ బోర్డ్ కాలనీ, కాప్రా తదితర ప్రాంతాలలో బతుకమ్మలను నిమజ్జనం చేయించారు. ఆ తర్వాత వాటిని మూసేయలేదు. శుభ్రం చేయకపోవడంతో అపరిశుభ్రతతో దోమలు పెరుగుతున్నాయి. మురుగుతో దుర్వాసన వస్తోంది. – ఏఎస్‌రావునగర్, న్యూస్‌టుడే

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు సుప్రియ



నాచారం, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు మల్లాపూర్ మోడ్రన్ స్కూల్ విద్యార్థిని ఎం.సుప్రియ ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ ముత్యంరెడ్డి, కరస్పాండెంట్ సదీవేద తెలిపారు. తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరులో ఈనెల 18న జరగనున్న జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో జూనియర్ బాలికల విభాగంలో తెలంగాణ రాష్ట్రం నుంచి సుప్రియ ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఖోఖో రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి, జిల్లా అధ్యక్షురాలు మంజుల సుప్రియను అభినందించారు.

వైద్య విద్యార్థినులకు ఆర్థికసాయం



చెక్కును ఇస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, నేతలు

హబ్సిగూడ, న్యూస్‌టుడే: హబ్సిగూడ డివిజన్ వెంకటరెడ్డినగర్‌కు చెందిన రీతు ప్రస్తుత ఎంబీబీఎస్ చదివేందుకు అయ్యే ఫీజును బీఆర్ఎస్ ట్రస్ట్ చెల్లిస్తుందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. గురువారం విద్యార్థిని ఇంటికి వెళ్లి రూ.29వేల చెక్కును అందజేశారు. ఉప్పల్‌చిలుకానగర్ డివిజన్‌లోని మల్లికార్జుననగర్‌కు చెందిన నందిని ఎంబీబీఎస్‌లో సీటు సాధించారు. గురువారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంటు భారాస బాధ్యుడు రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ గీతాముదిరాజ్‌తో కలిసి నందిని ఇంటికి వెళ్లి కాలేజీ ఫీజుకు అవసరమైన మొత్తాన్ని అందజేశారు.

చెత్త రిక్షాల పంపిణీ

హబ్సిగూడ: హబ్సిగూడ వార్డు కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు చెత్త రిక్షాలను కార్పొరేటర్ చేతన గురువారం పంపిణీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కోరారు. స్వచ్ఛభారత్‌కు కృషి చేయాలన్నారు.

సేవా స్ఫూర్తి



మందులు ఇస్తున్న సురేఖారెడ్డి

◆ మురికివాడల్లో వైద్య సేవలు

◆ పేదల ఆర్థిక స్వావలంబనకు కృషి

జవహర్‌నగర్, న్యూస్‌టుడే: ఆయనిది సామాన్య రైతు కుటుంబం.. తనకు ఉన్నంతలో పేదలకు సాయం అందించాలన్న లక్ష్యం..అందుకే నిరుపేద పిల్లలకు ఉచిత విద్యను అందించేందుకు వెంకట సత్య ఎడ్యుకేషనల్ సొసైటీని ఏర్పాటు చేశారు. ఆయన మరణం తర్వాత అదే స్ఫూర్తిని కూతురు తీసుకుంది. విద్య ఒక్కటే కాదు.. పేదలకు వైద్యం అందిస్తోంది. నలుగురికి ఆదర్శంగా నిలుస్తోంది.

ఇదీ నేపథ్యం: కొవ్వూరి వెంకట్‌రెడ్డి బంజారాహిల్స్ కృష్ణానగర్‌లో స్థిరపడ్డారు. పేద విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు అనాథ చిన్నారులు, వృద్ధులకు అవసరమైన తోడ్పాటును అందించారు. అదే సేవాభావం కుమార్తె అలవడింది. ఆమె వైద్యురాలు సురేఖారెడ్డి (ఆయుర్వేదం) తన తండ్రి ఆశయాలను కొనసాగిస్తూ జవహర్‌నగర్ ప్రగతినగర్‌లో సేవా ట్రస్టును ప్రారంభించారు. తండ్రి ఏర్పాటు చేసిన వెంకట సత్య ఎడ్యుకేషనల్ సొసైటీని సూర్యోదయ ఫౌండేషన్ ఛారిటబుల్ ట్రస్టుగా మార్చు చేశారు. ట్రస్టును ఇద్దరితో ప్రారంభించి.. 21 మంది సభ్యులతో ఇరవై ఏళ్లుగా పలు రకాల సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు.

అనాథ చిన్నారులు	332
ఉపాధి పొందిన మహిళలు సుమారు	300
వైద్య సేవలు పొందిన బాధితులు	670
వీధి శునకాలు, గోసంరక్షణ	60
ఒంటరి మహిళలు	450
వృద్ధులు	720

పేదలపైనే మమకారం

పేదరికానికి కారణమైన ఆరోగ్యం, విద్యపై దృష్టి సారించిన సురేఖారెడ్డి మురికి వాడలు, బస్తీల్లో ఉచిత వైద్య శిబిరాలకు శ్రీకారం చుట్టారు. ◆ అక్కడి గుర్తించిన రోగులకు అవసరమైన ఆపరేషన్లు, మందులు, పరీక్షలను ఉచితంగానే చేయిస్తారు. ◆ మహిళల్లో క్యాన్సర్ మహమ్మారి ప్రాణాంతకంగా మారి కుటుంబాలను అతలాకుతలం చేస్తుండటంతో వాటిపై దృష్టి సారించారు. ◆ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులను నిర్వహిస్తున్నారు. మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. ◆ మహిళల ఆర్థిక స్వావలంబనకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నారు. ◆ సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులు, కంప్యూటర్ తరగతుల నిర్వహణ, సిల్క్ డెవలప్‌మెంట్ వంటి అంశాల్లో శిక్షణ ఇప్పిస్తున్నారు. ◆ వీధి శునకాలు, గోసంరక్షణకు పలు కార్యక్రమాలను చేపట్టి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు..



బస్తీలో వైద్య శిబిరం

నమో తిరుమలేశా...!

ఈనెల 18నుంచి 26వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు



శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం

నాచారం, న్యూస్‌టుడే: గోవిందా...గోవిందా... ఏడు కొండలవాడా...వెంకట రమణ గోవిందా... గోవిందా అంటూ శ్రీవారి ఆలయ సన్నిధిలో భక్తులు పరవశించే సమయం ఆసన్నమైంది. ఈనెల 18 నుంచి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ షోడశ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. హెచ్‌ఎంటీనగర్ శ్రీవారి క్షేత్రం భక్తి పారవశ్యంతో మునిగి పోయేందుకు సన్నద్ధం అవుతోంది.

ముస్తాబు: నాచారం హెచ్‌ఎంటీనగర్ శ్రీభూ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబయ్యింది. ఈనెల 18 నుంచి 26వరకు తొమ్మిది రోజుల పాటు జరగనున్నాయి. ఆలయ ప్రధాన అర్చకులు వెంకటేశ్వరాచార్యులు పర్యవేక్షణలో తిరుమల నుంచి వచ్చిన ప్రత్యేక వేదపండితులు, అర్చకుల బృందం వీటిని నిర్వహిస్తారు. తిరుమలలోని ఏడుకొండలస్వామికి జరిగే కైంకర్యాలు.... అదే పద్ధతి ప్రకారం ఇక్కడ స్వామివారికి నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రత్యేక ఏర్పాట్లు చేశాం

– తుమ్మల దుర్గాప్రసాద్, ఆలయ ధర్మాధికారి

హెచ్‌ఎంటీనగర్‌లోని శ్రీవారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు సంప్రదాయం ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. ఈ ఏడాది జరిగే బ్రహ్మోత్సవాలకు ప్రత్యేకత ఉండటంతో నగరంలోని అన్ని ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడికి పెద్దసంఖ్యలో వస్తారు.

వాల్మీకి మహర్షికి నివాళి



మేడ్చల్ కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమాధికారి రాజేశ్వర్, వాల్మీకి సంఘం అధ్యక్షుడు రాజు తదితరులు



నాగారంలో ఛైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కమిషనర్ నాగమణి



పీర్జాదిగూడలో మేయర్ అమర్‌సింగ్, డిప్యూటీ మేయర్ ఇతరులు



బోడుప్పల్‌లో మేయర్ అజయ్‌యాదవ్, కమిషనర్ రామలింగం, తదితరులు



మేడ్చల్‌లో ఛైర్‌పర్సన్ దీపికా, కమిషనర్



పోచారం మున్సిపల్ కార్యాలయంలో ..



జవహర్‌నగర్‌లో మేయర్, ఇతరులు



ఘట్‌కేసర్‌లో ఛైర్‌పర్సన్ ముల్లిపావనియాదవ్

పొదల మాటున నియంత్రిక



బోడుప్పల్, న్యూస్‌టుడే: బోడుప్పల్ నగర పాలక సంస్థ వాసవీ నగర్ కాలనీలో విద్యుత్ నియంత్రిక చుట్టూ చెట్ల పొదలు పెరిగాయి. ఫ్యూజు పోయినా వేయలేని స్థితిలో ఉంది. ప్రమాదకరంగా ఉన్నా విద్యుత్తు శాఖాధికారులు పట్టించుకోవడం లేదు.

ఫీజులు చెల్లించాలని ర్యాలీ



ఏఎస్‌రావునగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల బోధన, ఉపకారవేతన ఫీజు బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఇందులో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, టి.సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ఆందోళన



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు గురువారం ఆందోళన చేశారు. పుర కార్యాలయం ముందు బైఠాయించి నినాదాలు చేశారు. కార్మికులు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ఉదయం 5గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విధులు నిర్వహిస్తున్నామని, ఇప్పుడు మధ్యాహ్నం తర్వాత కూడా పని చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ.1 గంట మధ్య

(8008573370 ఉప్పల్) (80085 73372 కాప్రా), (80085 73288 బోడుప్పల్), (98485 99881 ఘట్‌కేసర్), (80960 04937 నాగారం),

న్యూస్‌టుడే: బోడుప్పల్, ఏఎస్‌రావునగర్ మేడ్చల్, ఘట్‌కేసర్, నాగారం

? చెంగిచర్లలోని కబేళా నుంచి మళ్లీ దుర్వాసన వస్తోంది. కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలి. - **ప్రభాకర్‌గౌడ్,విక్రంగౌడ్, చెంగిచర్ల.**

✓ చెంగిచర్ల కాలుష్యంపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం. పీసీబీకి ఫిర్యాదు చేస్తాం.

-రామలింగం, కమిషనర్, బీఎంసీ.

? సాకేత్ కాలనీలో ఖాళీ ప్లాట్లలో వ్యర్థాలను తీసుకొచ్చి వేస్తున్నారు.

- శ్రీనివాస్ రావు, సాకేత్ కాలనీ

✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాం

- సుదర్శన్, కాప్రా పారిశుద్ధ్య సూపర్‌వైజర్

? పోచారం మున్సిపాలిటీ నారపల్లిలో దోమల బెడద తీవ్రంగా ఉంది. చర్యలు తీసుకోండి

-లక్ష్మీ, సప్తగిరి కాలనీ, నారపల్లి

✓ రాత్రి వేళలో కాలనీలో దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం.

-బోయపల్లి కొండల్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్

? మేడ్చల్ రైల్వేఅంతర్గత పాతబ్రిడ్జికి అవతలి వైపు మురుగుకాలువపై మ్యాన్‌హోల్ పూర్తిగా పగిలిపోయి ప్రమాదకరంగా మారింది. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

-రవికుమార్, మేడ్చల్

✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాం

-నాగిరెడ్డి, కమిషనర్, మేడ్చల్ మున్సిపాలిటీ

? నాగారం పట్టణ రామలింగేశ్వర కాలనీలో ఇంటి యజమానులు తమ ఇళ్ల ముందు సీసీ వేసుకొని రోడ్డుపై బండరాళ్లు పెడుతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నాయి.

- మహేందర్,రామలింగేశ్వర కాలనీ, నాగారం

✓ ఇళ్ల యజమానులు ఇతరులకు,బాటసారులకు ఇబ్బంది కలిగించే విధంగా సీసీ వేసుకొని బండరాళ్లు పెడితే చర్యలు తీసుకుంటాం

- రఘు, డీఈఈ, నాగారం

? నాగారంపుర పరిధి రాంపల్లి సిగ్నల్ నుంచి భవానీనగర్ కాలనీకి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే చెత్తను వేస్తున్నారు.

- రాములు, భవానీ నగర్, నాగారం

✓ పుర సఫాయి సిబ్బందితో చెత్త కుప్పలను తొలగిస్తాం

- రామిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్,నాగారం

ప్రాంగణ నియామకాల్లో సత్తాచాటిన విద్యార్థులు

కూకట్‌పల్లి: జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రాంగణ నియామకాల్లో సత్తాచాటారు. ఇన్ఫోసిస్ నియామకాల్లో ఆరుగురు రూ. 9.5లక్షల చొప్పున ప్యాకేజీతో ఎంపికయ్యారు. బీటెక్ నుంచి 234, ఎంటెక్, ఎంసీఏ నుంచి 249 మంది ఇన్ఫోసిస్‌కు దరఖాస్తు చేసుకోగా ఇందులో సీఎస్ఈ నుంచి పి.సనీతారెడ్డి, కె.సాయిహేమంత్‌నారాయణ్, ఎస్.గ్రీష్మా, హెచ్. కేశరాజు, సీఎస్ఈ ఐడీపీ నుంచి బి.స్ఫూర్తి, ఎంసీఏ నుంచి కె.శ్రీఉమాదేవి ఉద్యోగాలు సాధించారు.

మురుగు.. రోడ్లపై పరుగు



జవహర్‌నగర్, న్యూస్‌టుడే: డ్రైనేజీ కాలువ సరిగా లేకపోవడంతో మురుగంతా రోడ్లపైనే పారుతోంది. వర్షం పడితే మురుగు ఇళ్లలోకి చేరుతోంది. చిన్న వర్షంతోనే ఆనంద్‌నగర్ కాలనీల్లో మ్యాన్‌హోళ్లు పొంగాయి. మున్సిపల్ సిబ్బంది మరమ్మతులు చేసినా సమస్య పరిష్కరించలేకపోయారు. నాలుగు రోజులుగా జవహర్‌నగర్ ప్రధాన రోడ్డుపైనే మురుగు నిలిచింది. తీవ్ర దుర్వాసన వస్తోంది. అయినా మున్సిపల్ సిబ్బంది అటువైపు కన్నెత్తి చూడటం లేదు.

వెళ్తున్న ఆటోపై విరిగిపడిన భారీ వృక్షం



ఘట్‌కేసర్,న్యూస్‌టుడే: ఘట్‌కేసర్ మండల కేంద్రంలో పెను ప్రమాదం తప్పింది. గురువారం మాధవరెడ్డి వంతెన సమీపంలోని రహదారిపై పెద్ద చెట్టు విరిగిపడింది. చెట్టు చివరి కొమ్మల మధ్య ఆటో ఇరుక్కుపోయింది. అక్కడున్నవారంతా పెద్ద ప్రమాదం జరిగిందని ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. డ్రైవర్ పెంటయ్యతోపాటు ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సిబ్బంది వచ్చి చెట్టు కొమ్మలు తొలగించి ఆటోను బయటకు తీశారు. గాయపడిన వారిని ఆస్పత్రికి పంపించారు.

తొలగిన బురద

జవహర్‌నగర్, న్యూస్‌టుడే: జవహర్‌నగర్ ఫైరింగ్ రేంజ్ ప్రభుత్వ పాఠశాల ప్రధాన గేటు ముందు వరద నిలిచి విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న తీరును తెలుపుతూ ఈ నెల 16న " సమస్యను గుర్తించినా...పరిష్కరించలేదు " శీర్షికతో, గత నెల 23న " తరగతిలోకి వెళ్లాలా...బురదలో అడుగేయాల్సిందే " శీర్షికన చిత్ర వార్త ఈనాడులో ప్రచురితమైంది. స్పందించిన మున్సిపల్ అధికారులు గురువారం మరమ్మతులు చేసి సమస్య లేకుండా చేశారు.

దారి విశాలమయ్యింది..

మేడ్చల్ రూరల్: మేడ్చల్ పట్టణంలోని ఎర్ర చెరువు కట్టపై మొక్కలు పెరిగి రహదారి ఇరుకుగా ఉందని గురువారం ప్రచురించిన చిత్రానికి మునిసిపల్ అధికారులు స్పందించారు. గురువారం కమిషనర్ నాగిరెడ్డి రహదారికి ఇరువైపులా పెరిగిన మొక్కలను సిబ్బందితో తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

సంక్షిప్త సమాచారం

పర్యవేక్షణ చేసి.. ప్రజలతో మాట్లాడి

హబ్సిగూడ, న్యూస్‌టుడే: రామంతాపూర్ డివిజన్ రాంశంకర్‌నగర్‌లో రూ.78లక్షలతో నిర్మిస్తున్న వరదకాలువ నిర్మాణపనులను డీఈ నాగమణితో కలిసి కార్పొరేటర్ శ్రీవాణి పరిశీలించారు. అక్కడి సమస్యలపై స్థానికులను వారు అడిగి తెలుసుకున్నారు. పనులను తొందరగా పూర్తి చేయాలని కోరారు.

సామాజిక భవన నిర్మాణం షురూ

బోడుప్పల్: బోడుప్పల్ 15వ డివిజన్ రాజలింగం కాలనీలో రూ .20 లక్షలతో సామాజిక భవన నిర్మాణ పనులను గురువారం నగర మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ ప్రారంభించారు. ఇందులో కార్పొరేటర్ కొత్తదుర్గమ్మ, కిషోర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కుల రక్షణకు చర్యలు

పోచారం(ఘట్‌కేసర్)న్యూస్‌టుడే: పార్కుల రక్షణకు చర్యలు చేపడుతున్నట్లు పోచారం మున్సిపల్ ఛైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాజీవ్‌గృహకల్పకాలనీలో సుమారు రూ.6లక్షలతో చేపడుతున్న పిల్లల పార్కు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ రెడ్యానాయక్, కౌన్సిలర్లు మెట్టు బాల్‌రెడ్డి, ఆకటి శైలజ పాల్గొన్నారు.

డ్రైనేజీ పైపులైను పనులు పూర్తి చేయాలి

నాచారం, న్యూస్‌టుడే: నాచారం పటేల్ కుంట చెరువు వద్ద రూ.1.80కోట్లతో నిర్మిస్తున్న డ్రైనేజీ ప్రత్యేక పైపులైను త్వరలో అందుబాటులోకి తేనున్నట్లు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. గురువారం పటేల్‌కుంట తటాకాన్ని భారాస మల్కాజిగిరి పార్లమెంట్ బాధ్యుడు రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌తో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. అసంపూర్తిగా ఉన్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలన్నారు.

పారదర్శకతకే ఇందిరమ్మ కమిటీలు



మాట్లాడుతున్న పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్, న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులందరికీ పారదర్శకంగా అందించడమే లక్ష్యంగా ఇందిరమ్మ కమిటీలు పని చేస్తాయని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బాధ్యుడు మందుముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు జరిగిన సమావేశంలో పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. పలు సూచనలు చేశారు.

హబ్సిగూడ: ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా ప్రజలకు చేరేలా చేయడమే ఇందిరమ్మ కమిటీల లక్ష్యమని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ బాధ్యుడు పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం రామంతాపూర్ డివిజన్లో కాంగ్రెస్ నాయకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో కమిటీ కీలకపాత్ర పోషించాలన్నారు.

పౌర్ణమి ప్రత్యేక పూజలు



బోడుప్పల్, న్యూస్‌టుడే: బోడుప్పల్ మాతా నిమిషాంబికాదేవి ఆలయంలో గురువారం పౌర్ణమి ప్రత్యేకపూజలు నిర్వహించారు. తెల్లవారు జామునే అమ్మవారికి మేలు కొలుపు పలికి పంచామృత అభిషేకం చేశారు.

ఉరేసుకొని హోంగార్డు ఆత్మహత్య



ఉప్పల్, న్యూస్‌టుడే:ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకొని హోంగార్డు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రామంతాపూర్‌లోని వెంకటరెడ్డినగర్‌లో ఉండే పోడ వెంకటరామయ్య(39) పంజాగుట్ట ఏసీపీ కార్యాలయంలో హోంగార్డుగా పని చేస్తున్నాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వెలుగుగుట్టలో చోరీయత్నం

ఉప్పల్, న్యూస్‌టుడే:ఉప్పల్ వెలుగుగుట్టలోని దుర్గా మల్లికార్జునస్వామి ఆలయంలో దొంగలు పడ్డారు. బుధవారం రాత్రి ఆలయంలోకి ప్రవేశించిన దొంగలు హుండీ తాళం పగులగొట్టారు. వాచ్‌మేన్ అప్రమత్తం కావడంతో పారిపోయారు. ఆగస్టులోనూ ఇదే హుండీ తాళాన్ని పగులగొట్టి అందులోని నగదు దోచుకుపోయారు. ఆ సమయంలో ఆలయంలో సీసీ కెమెరాలున్నప్పటికీ కూడా నిర్వహణ లోపంతో పని చేయలేదు. దీంతో దొంగలను గుర్తించే అవకాశం లేకుండా పోయింది. ఆలయంలో తరుచుగా దొంగలు పడటానికి ఈవో పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యమే కారణమని భక్తులు ఆరోపిస్తున్నారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడిగా మందస్వామి

మూడుచింతలపల్లి(శామీర్‌పేట): తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మూడుచింతలపల్లి మండల కమిటీ అధ్యక్షుడిగా మందస్వామి ముదిరాజ్ గురువారం నియమితులయ్యారు.

పెట్రోలు బంకు క్యాషియర్‌పై దాడి

ఉప్పల్, న్యూస్‌టుడే: పెట్రోలు బంకు క్యాషియర్‌పై అకారణంగా సామూహిక దాడి చేసి గాయపర్చిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. నిజామాబాద్‌కు చెందిన సాయివర్ధన్‌రెడ్డి ఉప్పల్ కావేరీనగర్‌లోని ఓ పెట్రోలు బంకులో క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. గణేష్‌నగర్‌లో ఉండే శివసాయిగౌడ్(కన్నాగౌడ్) ఫైనాన్స్ వ్యాపారి. ఇదే బంకులో పని చేసే ముత్యాలుకు కన్నాగౌడ్ ఫైనాన్స్ ఇచ్చాడు. బుధవారం రాత్రి ముత్యాలు ఉన్నాడ..? అని సాయివర్ధన్‌రెడ్డిని అడిగితే లేడని చెప్పడంతో.. నాకే నిర్లక్ష్యంగా సమాధానం చెప్తావారా అంటూ క్యాషియర్‌ని తన అనుచరులు, సోదరులను రప్పించుకొని క్యాషియర్‌పై పలుమార్లు సామూహిక దాడి చేసి గాయపర్చారు. దాడికి సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో నమోదయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కన్నాగౌడ్, మల్లిఖార్జున్‌గౌడ్, విక్రంగౌడ్, సన్నిగౌడ్‌లపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పేదలను కబ్జాదారులనడం దారుణం

◆ తెలంగాణ భవన్‌లో మూసీ బాధితుల సమావేశంలో కేటీఆర్



ఈనాడు, హైదరాబాద్: మూసీ ప్రాజెక్ట్ పేరుతో పేదల ఇళ్లు కూలుస్తామంటే ఊరుకునేది లేదంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హెచ్చరించారు. వారికి భారాస అండగా ఉంటుందన్నారు. అనుమతులిచ్చి కరెంట్ బిల్లులు, ఇంటిపన్నులు కట్టించుకున్న కాంగ్రెస్ వాళ్లే పేదలను కబ్జాదారులనడం దారుణమని మండిపడ్డారు. కాంగ్రెస్ 100 రోజుల్లో ప్రజలకు 6 గ్యారంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చి ఇప్పుడు పేద ప్రజల ఇళ్లను కూల్చేస్తుందని మండిపడ్డారు. బాధితులు ఏమాత్రం భయపడాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. మూసీ ప్రాజెక్ట్ పేరుతో కాంగ్రెస్ సర్కార్ తమ ఇళ్లను కూల్చే ప్రయత్నం చేస్తోందంటూ తెలంగాణ భవన్‌కు వచ్చిన బాధితులతో కేటీఆర్ సమావేశమయ్యారు. 50 ఏళ్లుగా మూసీ పరీవాహక ప్రాంతంలో ఉంటున్న తమ ఇళ్లను కూల్చివేస్తామంటే ఎక్కడికి వెళ్లేదంటూ బాధితులు వాపోయారు. ఓట్లేసి గెలిపించిన ప్రజాప్రతినిధులను నిలదీయాలని కేటీఆర్ వారికి సూచించారు.

అధికారులూ..

రోడ్డు ఆక్రమిస్తే ఏం చేస్తున్నారు..



ఉప్పల్, న్యూస్‌టుడే:ఉప్పల్‌లోని ప్రధాన రహదారి పక్కనే ఆక్రమించి చేస్తున్న నిర్మాణంపై మున్సిపల్, విద్యుత్తు శాఖల అధికారులకు పలు ఫిర్యాదులొచ్చాయి. మేకల కాంప్లెక్స్ ప్రాంతంలోని కంటి దవాఖానా ముందు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ప్రధాన రహదారిని ఆక్రమించి నిర్మాణం చేస్తున్నారు. అయినా జీహెచ్ఎంసీ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు.

20న హరిణి వనస్థలిలో పద్మశాలీ దసరా మేళా

నారాయణగూడ, న్యూస్‌టుడే: పద్మశాలీ సంఘం (ఎల్బీనగర్ సర్కిల్) ఆధ్వర్యంలో ఈనెల 20న పద్మశాలీ దసరా మేళా నిర్వహించనున్నట్లు అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ మహిళా అధ్యక్షురాలు వనం దుశ్యంతల వెల్లడించారు. జింకల పార్కులోని అనన్య ఎకో పార్కు ఆవరణలో జరుగుతుందని గురువారం తెలిపారు. తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గుంటక రూప, గ్రేటర్ మహిళా అధ్యక్షురాలు పొరండ్ల శారద, ఎల్బీనగర్ పద్మశాలీ సంఘం మహిళా అధ్యక్షురాలు రావిరాల సంధ్యారాణి కరపత్రాన్ని ఆవిష్కరించారు.